ప్రభాతనవ
SINGIDI
తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
సోమవారం 24 ఆగస్టు 2026 | సంపుటి: 1 సంచిక: 68 | పేజీలు 12 | వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar


## క్షిపణుల కొరత...
# రక్షణ బడ్జెట్ సంక్షోభం
**రష్యాతో యుద్ధం వేళ ఉక్రెయిన్‌లో రాజకీయ కలకలం**



దేశంలో ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదించిన రక్షణ శాఖ మాజీ మంత్రి ఫెదోరోవ్

అలా చేస్తే దేశం విచ్ఛన్నం అవుతుందని జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు

2



2

## గినియాలో
# పెను విషాదం
ఏకంగా 22 మంది మృతి

## కన్ఫ్యూజన్‌లో
# కాంగ్రెస్ క్రమశిక్షణ
**క్రమశిక్షణ కమిటీ నిర్ణయంపై ఉత్కంఠ**

ఏంటో.. ఏమో.. ఏమవుతుందో..! తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ వ్యవహారం ఇప్పుడు ఇదే ప్రశ్నగా మారింది. తప్పు జరిగిందని చెబుతున్నారు.. పార్టీ లైన్ దాటారని తేల్చారు.. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని అంటున్నారు.. ఆధారాలు, వీడియోలు పరిశీలించామని చెబుతున్నారు. కానీ.. చర్యల విషయానికి వచ్చేసరికి మాత్రం సస్పెన్స్ కొనసాగుతోంది. వేటు ఉంటుందా? ఉండదా? ఉంటే ఎప్పుడు? అన్న దానిపై క్లారిటీ లేదు. కొండంత రాగం తీసి.. చివరికి కమిటీ ప్రెస్‌మీట్‌తో ఫుల్‌స్టాప్ పెట్టిందా.. లేక కామాతో సరిపెట్టి సశేషం అన్నదా? అన్నదే ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.

హైదరాబాద్ బ్యూరో - సింగిడి



## తప్పు జరిగిందని తేల్చారు.. చర్యపై సస్పెన్స్
పార్టీ లైన్ దాటారని నిర్ధారణ?

శిక్ష ఏంటో చెప్పని కమిటీ

మల్లు రవి ప్రెస్‌మీట్‌తోనూ వీడని సందేహాలు

కాంగ్రెస్‌లో వేటుపై ఊహాగానాలు

తుది నిర్ణయంపై కొనసాగుతున్న ఉత్కంఠ

**తప్పు జరిగిందట..**
పార్టీ వ్యవహారాల్లో క్రమశిక్షణ ఉల్లంఘన జరిగిందని కమిటీ గుర్తించినట్లు తెలుస్తోంది. పార్టీ నిర్ణయాలు, లైన్‌కు భిన్నంగా వ్యవహరించిన అంశాలపై విచారణ జరిపిన తర్వాత ఈ అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. అయితే తప్పు జరిగినట్లు తేల్చిన తర్వాత.. తదుపరి అడుగు ఏంటన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.

**శిక్షపై సస్పెన్స్**
కమిటీ భేటీ, విచారణ తర్వాత కూడా ఎలాంటి చర్య తీసుకుంటారన్న దానిపై స్పష్టత రాలేదు. హెచ్చరికతో సరిపెడతారా? షోకాజ్ నోటీసులు ఇస్తారా? లేక మరింత కఠినంగా వ్యవహరిస్తారా? అన్నదానిపై పార్టీలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో అసలు వ్యవహారం ఎటు దారితీస్తుందన్న ఆసక్తి నెలకొంది.

**మల్లు రవి ప్రెస్‌మీట్..**
ఈ వ్యవహారంపై మల్లు రవి చేసిన ప్రెస్‌మీట్‌తో అయినా పూర్తి క్లారిటీ వస్తుందని భావించినా.. అనుమానాలు మాత్రం తొలగలేదు. కమిటీ పరిశీలన, పార్టీ వైఖరిపై ఆయన చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. దీంతో నాయకత్వం తదుపరి ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది చర్చనీయాంశంగా మారింది.

**కాంగ్రెస్‌లో కొత్త చర్చ**
పార్టీ క్రమశిక్షణ విషయంలో నాయకత్వం తీసుకునే నిర్ణయం.. శ్రేణులకు ఒక స్పష్టమైన సంకేతం ఇస్తుంది. తప్పు జరిగినట్లు తేల్చి.. చర్యనుమాత్రం పెండింగ్‌లో పెట్టడం పార్టీలో భిన్నమైన సందేశానికి దారితీయవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పార్టీ లైన్ దాటిన వ్యవహారాల్లో అధిష్ఠానం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

**తుది నిర్ణయం ఎప్పుడు..**
కమిటీ వైఖరిపై చర్చ జరుగుతున్నా.. తదుపరి చర్యపై మాత్రం ఇంకా స్పష్టత లేకపోవడం కాంగ్రెస్‌లో ఉత్కంఠకు కారణమవుతోంది. ఎవరికి నోటీసులు వస్తాయి? ఎలాంటి శిక్ష ఉంటుంది? పార్టీ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకుంటుంది? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న. తప్పు జరిగినట్లు తేల్చిన కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ.. చర్య విషయంలోనూ అదే స్పష్టత చూపిస్తుందా? అన్నది చూడాలి.



## వచ్చాక అన్నీ మాట్లాడతా
**సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు**

లండన్ పర్యటన సక్సెస్

ముగించుకుని హైదరాబాద్‌కు...

కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నానని వెల్లడి

మరికొన్ని గంటల్లో హైదరాబాద్ వస్తున్నా: ముఖ్యమంత్రి

2

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు బయలుదేరారు. కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడం వల్లనే తన అమెరికా పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని, ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆయన ఆరోపించారు. - హైదరాబాద్, ఆగస్టు 23 (సింగిడి)



## చర్చలు సఫలం
2

సమ్మె విరమించిన ఆటో కార్మిక సంఘాలు

సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం హామీ

ఆటో కార్మికుల సంఘాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. సంఘాలు ఆదివారం అర్ధరాత్రి నుంచి తలపెట్టిన సమ్మెను విరమించుకొన్నాయి. తాము చేసిన 14 డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీకి చెందిన ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీఏడీఎస్, బీఆర్‌టీయూ తదితర సంఘాల నాయకులు వెల్లడించారు. ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో సంయుక్త రవాణా కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలో అధికారులు ఆదివారం రాత్రి సంఘాల నేతలతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆటో సంఘాలు చేసిన పలు డిమాండ్లకు సానుకూలంగా స్పందించారు.

- హైదరాబాద్, ఆగస్టు 23 (సింగిడి)

## ప్రభుత్వ బడుల విద్యార్థులకు
# యూనిఫారాల తిప్పలు



2

ఆడితే చిరిగిపోతాయి, ఉతికితే వెలిసిపోతాయి

విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలా? : హరీశ్ రావు

పెద్దవాళ్లకు చిన్నవి, చిన్నవాళ్లకు పెద్దవి

మఫత్‌లాల్ ముద్దు, చేనేత వద్దు అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా?

మాజీ మంత్రి హరీశ్ రావు

## అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలకునే వారు
# భారత్‌కు రావాలి
**ప్రధాని మోదీ పిలుపు**

నేషనల్ స్పేస్ డే సందర్భంగా స్పేస్ స్టార్టప్ సీఈఓలు ప్రధాని భేటీ

ప్రాజెక్టుల వివరాలను మోదీకి వివరించిన పలువురు సీఈఓలు- స్పేస్‌స్టార్టప్ సీఈఓలను ప్రశంసించిన ప్రధాని



2

# మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సీజేపీ సిద్ధం!
**కేంద్రం హామీలపై సీజేపీ కీలక భేటీ**

2

ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, పరిహారం అంశాల్లో పురోగతి లేదని ఆరోపణ




కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అసంతృప్తి వ్యక్తం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)మరోసారి ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతోంది. జులై 25న దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనను విరమించినప్పటికీ, కేంద్రం నుంచి హామీల అమలుపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సోమవారం జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది.జులై 25న ఆందోళన విరమించే సమయంలో కేంద్రం తమకు పలు హామీలు ఇచ్చిందని సీజేపీ తెలిపింది. వాటి అమలు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అధికారికంగా తమకు తెలియజేయలేదని పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నమ్మి ఉద్యమాన్ని విరమించామని, తమ విశ్వాసాన్ని బలహీనతగా భావించొద్దని సీజేపీ హెచ్చరించింది.

- న్యూఢిల్లీ, ఆగస్టు 23 (సింగిడి)



## 14 దేశాలకు టీఆర్ఎస్ పార్టీ
# అధ్యక్షుల నియామకం
2



## ఏపీ మాజీమంత్రి
# కారుమూరి అరెస్ట్

మద్యం రవాణా కేసులో ఈడీ దూకుడు

ముందస్తు బెయిల్ ప్రయత్నాలు విఫలం

ఏ క్షణమైనా అరెస్టు కావచ్చని భావించిన నాగేశ్వరరావు

హైదరాబాద్‌లో స్నేహితుడి ఇంట్లో ఉండగా అదుపులోకి తీసుకున్న ఈడీ

2

## 2035 నాటికి భారత సొంత
# అంతరిక్ష కేంద్రం ఏర్పాటు
**ఇస్రో చీఫ్ డాక్టర్ వి.నారాయణన్**

భారతీయ అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు తొలి మాడ్యూల్‌కు ఇప్పటికే ఆమోదం

గగన్‌యాన్‌తో పాటు స్పేస్ స్టేషన్‌పై కొనసాగుతున్న పనులు

50కిపైగా రంగాల్లో అంతరిక్ష సాంకేతికతతో పౌరులకు సేవలు

2



అంతరిక్ష రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకునే దిశగా అడుగులు వేస్తోంది. 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా భారత్ కృషి చేస్తునట్లు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తెలిపారు. ప్రతిపాదిత భారతీయ అంతరిక్ష కేంద్రంలోని తొలి మాడ్యూల్‌కు ఇప్పటికే ఆమోదం లభించిందని వెల్లడించారు. గగన్‌యాన్ మానవ సహిత అంతరిక్ష యాత్రతో పాటు స్పేస్ స్టేషన్ ఏర్పాటుపై కూడా ఇస్రో దృష్టి సారించిందని చెప్పారు.

- న్యూఢిల్లీ, ఆగస్టు 23 (సింగిడి)


## బంగ్లాదేశ్‌లో హిందూ ఫ్యామిలీ
# దారుణ హత్య
2



బంగ్లాదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాంత హిందూ టీచర్ కుటుంబం హత్యకు గురైంది. తన ఇంటిపై డ్రగ్స్ తీసుకుంటుండడాన్ని ప్రశ్నించినందుకు దుండగులు అతన్ని చంపారు.

- ఢాకా (సింగిడి)

## ఒడిశా తీరంలో మునిగిపోయిన
# కార్గో షిప్
22 మంది సిబ్బంది గల్లంతు



2

# బ్యాట్ మ్యాన్‌గా రాహుల్ గాంధీ

కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల పోస్టర్లు

రాహుల్ గాంధీని 'రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్'గా చిత్రీకరిస్తూ పోస్టర్లు-

సోషల్ మీడియాలో ఆయన చేసిన వ్యాఖ్యలతో వైరల్‌గా మారిన ట్రెండ్



2

## మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సీజేపీ సిద్ధం!

హామీల అమలుకు అవసరమైన అన్ని చర్యలను పరిశీలిస్తామని, అందులో మరోసారి శాంతియుత మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అవకాశమూ ఉందని స్పష్టం చేసింది. కేంద్రం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయడం, వేరే అర్థం చెప్పడం లేదా విస్మరించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించింది. అలా జరిగితే దేశ యువతకు చేసిన వాగ్దానానికి ద్రోహంగా భావిస్తామని స్పష్టం చేసింది.

**ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టులో విచారణ**

ఇటీవల ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం కూడా కీలకంగా మారింది. ఆగస్టు 18న దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల సమగ్ర జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరినట్లు సీజేపీ తెలిపింది. తమ ప్రకారం, సుప్రీంకోర్టు ఈ జాబితాను మూడుసార్లు కోరిందని, కేసులను కొట్టివేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను వినియోగించే అంశాన్ని పరిశీలించేందుకు ఈ వివరాలు అవసరమని తెలిపింది. అయితే కోర్టు పదేపదే కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ జాబితాను అందజేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వలేదని ఆరోపించింది.

**'యువతను మోసం చేస్తున్నారా?'**

సుప్రీంకోర్టు విచారణ అనంతరం సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్, న్యాయ వ్యవహారాల విభాగం బాధ్యురాలు రత్నా సింగ్ ప్రభుత్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేసినట్లు పార్టీ తెలిపింది. కేంద్రంతో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీల ఆధారంగానే ఉద్యమాన్ని విరమించామని, ఇప్పుడు వాటి అమలులో జాప్యం జరుగుతుండటం యువతను మోసం చేసినట్లేనని వారు అభిప్రాయపడినట్లు పేర్కొంది. ముఖ్యంగా నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించడం, విద్యార్థులు లేదా శాంతియుత ఆందోళనకారులపై భవిష్యత్తులో శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా హామీ ఇవ్వడం వంటి అంశాలపై స్పష్టత కావాలని సీజేపీ కోరుతోంది.

**నీట్ బాధిత కుటుంబాలకు పరిహారం**

సీజేపీ డిమాండ్లలో మరో కీలక అంశం నీట్ యూజీ వివాదం. పేపర్ లీక్ కారణంగా మేలో పరీక్ష రద్దు కావడం, దాని తర్వాత కొందరు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశంపైనా కేంద్రం హామీ ఇచ్చిందని చెబుతోంది. అయితే పరిహారం, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ సహా లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం తమను అధికారికంగా సంప్రదించలేదని ఆరోపించింది.

ఇక ఇటీవల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నాట్లు సుప్రీకంకోర్టు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది.

## చర్చలు సఫలం

ఆర్టీసీ పక్షాన ఎలక్ట్రిక్ ఆటోలు కొనే ప్రసక్తే లేదని, అది దుష్ప్రచారం మాత్రమేనని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించినట్టు స్పష్టంచేశారు. విధివిధానాల ఖరారుకు సెప్టెంబరు 1వ తేదీ కార్మిక, రవాణా శాఖలు, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహిస్తామన్నారు. 2012 తర్వాత ఆటో ఛార్జీలు పెంచలేదు కాబట్టి ఛార్జీలు పెంచడానికి అంగీకరిస్తామని, కాకపోతే ఏ మేరకు పెంచాలనేదానిపై తగిన నివేదిక తీసుకొని జీవో విడుదల చేసేందుకు అంగీకరిస్తామని చెప్పారు. ఓలా, ఉబర్ మాదిరి ప్రభుత్వం తరపున యాప్‌ను ప్రారంభించేందుకు తగిన ప్రక్రియ చేపడతామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు రూ.12 వేల సాయంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు.

**డిమాండ్లు పరిష్కరిస్తాం-మంత్రి పొన్నం**

ఆటో కార్మిక సంఘాలు సమ్మె విరమించుకున్నందుకు మంత్రి పొన్నం ధన్యవాదాలు తెలిపారు. వారి డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరంలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న, పల్లె పల్లెల్లో ప్రజాపాలన' కార్యక్రమంలోనూ ఆయన మాట్లాడుతూ.. ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ఒక్కోదానికి రూ.1.50 లక్షల వరకు సహాయం చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

## ఏపీ మాజీమంత్రి కారుమూరి అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 23 (సింగిడి)**

ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో పెద్ద వికెట్ పడింది. ఈ మొత్తం వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు హైడ్రామా మధ్య ఆదివారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. కారుమూరి తన మిత్రుడి ఇంట్లో ఉండగా ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసులో ఇప్పటికే ఆయన కుమారుడితో పాటు మిగతా నిందితులను ఈడీ అరెస్టు చేసింది.

వైకాపా హయాంలో మద్యం పాలసీని అడ్డం పెట్టుకొని రూ.వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేసి దర్యాప్తు మొదలుపెట్టింది. మద్యం ధరలు ఇష్టారాజ్యంగా నిర్ణయించడం, మామూళ్లు ఇచ్చిన సంస్థలకే మద్యం అమ్మకాలకు అవకాశం ఇవ్వడం వంటి అవకతవకలకు పాల్పడ్డ వైకాపా ప్రభుత్వ పెద్దలు.. తద్వారా భారీగా కూడబెట్టుకున్నట్లు సిట్ నిగ్గుతేల్చింది. ఇది ఒక ఎత్తయితే ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి దుకాణాలకు మద్యం సరఫరాలోనూ వైకాపా పెద్దలు చేతివాటం చూపారు. సీఐడీ ఈ రెండు అంశాలపై వేర్వేరుగా కేసులు నమోదుచేయగా వీటి ఆధారంగా ఇందులో నిధుల మళ్లింపునకు సంబంధించి ఈడీ మరో కేసు నమోదుచేసింది. ఇలా కొట్టేసిన నిధులు ఎటు వెళ్లాయన్న అంశంపై దర్యాప్తు మొదలుపెట్టింది.

**ఇదీ రవాణా కుంభకోణం**

ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి దుకాణాలకు మద్యం రవాణా కాంట్రాక్టును తొలుత సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. దీన్నుంచి శ్రీసుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సబ్‌కాంట్రాక్టు తీసుకుంది. శ్రీసుదర్శన్ సంస్థ కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్‌దేనని ఈడీ నిర్ధారించింది. ఒక్కో కార్టన్‌కు కిలోమీటర్‌కు రూ.19.68గా ఉన్న రవాణా ధరను రూ.32.53కు పెంచినట్లు, తద్వారా దాదాపు రూ.195.33 కోట్లు దండుకున్నట్లు ఈడీ గుర్తించింది. తదుపరి దర్యాప్తులో భాగంగా జూన్‌లోనే సునీల్‌కుమార్ ఇంటితోపాటు బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన వాసుదేవరెడ్డి, ఈ కుంభకోణానికి వైకాపా ప్రభుత్వం తరఫున అన్నీ తానై వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి, ఇంకా కేసుతో సంబంధం ఉన్న విజయ నరసింహారెడ్డి, వల్లు సందీప్‌ల ఇళ్లలోనూ ఈడీ అధికారులు సోదాలు చేశారు. సునీల్‌కుమార్ ఇంట్లో రెండు రోలెక్స్ వాచీలు, ఒక రేంజి రోవర్ కారు స్వాధీనం చేసుకోగా ఇవన్నీ మద్యం రవాణా నేరం ద్వారా ఆర్జించిన డబ్బుతో కొన్నవేనని ఈడీ నిగ్గుతేల్చింది. వీటితోపాటు ఈడీ అధికారులు ఇక్కడ స్వాధీనం చేసుకున్న ఫోన్లో ఒక కరెన్సీ నోటు బొమ్మ ఉన్నట్లు గుర్తించారు. హవాలా లావాదేవీలో భాగంగానే ఈ నోట్‌ను పంపినట్లు, దీనిద్వారా కారుమూరికి రూ.15 కోట్లు ముట్టినట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. మద్యం రవాణాకు కుదుర్చుకున్న జాయింట్ వెంచర్ ఒప్పందం కాపీని కూడా సునీల్‌కుమార్ ఇంట్లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జూన్ 11న వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డిలను అరెస్టుచేసిన ఈడీ అధికారులు జూన్ 18న కారుమూరి సునీల్‌కుమార్‌ను అరెస్టు చేశారు. నాగేశ్వరరావుకు సంబంధించిన రూ.37.7 కోట్ల ఆస్తులను ఈడీ ఇదివరకే జప్తు చేసింది.

**నాటకీయ పరిణామాలు**

తనను అరెస్టు చేయొచ్చని ఊహించిన కారుమూరి ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టులు ఆయన పిటిషన్‌ను తిరస్కరించాయి. ఇది రాజకీయ కక్షసాధింపు చర్య అన్న కారుమూరి వాదనలను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో ఏ క్షణమైనా అరెస్టు కావచ్చని భావించిన కారుమూరి.. కోకాపేటలోని తన ఇంట్లో కాకుండా మజీద్‌బండ క్రాస్‌రోడ్డులోని షార్క్‌హైట్స్ అపార్టుమెంట్లో తలదాచుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ఆదివారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో అక్కడకు చేరుకున్న అధికారులు.. నాగేశ్వరరావును అరెస్టు చేసి బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి తరలించారు. అనంతరం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అక్కడి నుంచి మళ్లీ ఈడీ కార్యాలయానికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయం కోర్టులో ప్రవేశపెడతారు.

# అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలనుకునే వారు భారత్‌కు రావాలి

అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలనుకునే వారు భారత్‌కు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందుకోసం తమ ప్రభుత్వం విధారనపరమైన మద్దతిస్తుందని తెలిపారు. నేషనల్ స్పేస్ డే సందర్భంగా స్పేస్ స్టార్టప్ సీఈఓలు ప్రధానితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము చేపట్టనున్న ప్రాజెక్టుల వివరాలను పలువురు సీఈఓలు మోదీకి వివరించారు. అనంతరం మాట్లాడిన ప్రధాని మోదీ, అంతరిక్ష రంగంలోకి ప్రవేశించి ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించారని స్పేస్‌స్టార్టప్ సీఈఓలను ప్రశంసించారు. స్పేస్ టెక్నాలజీతో ప్రజా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని వారికి సూచించారు.

ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మోదీ వెల్లడించారు. అంతరిక్ష రంగంలో పనిచేస్తున్న 20 స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో ప్రధాని మోదీ ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తు అవకాశాలు, సాంకేతికత వినియోగంపై చర్చలు జరిపారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను మోదీ తమ ఎక్స్ పోస్టులో పంచుకున్నారు. ఎప్పటిలాగే, భారత్ అంతరిక్ష ప్రయాణంపై స్టార్టప్‌ల అభిప్రాయాలు, ఆశావహ దృక్పథం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

**భరోసా కల్పించడమే మా లక్ష్యం**

అంతరిక్ష రంగం వంటి కొత్త విభాగంలో అడుగుపెట్టిన స్టార్టప్ వ్యవస్థాపకులను మోదీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో స్థిరత్వం ఎంతో ముఖ్యమని, దీనివల్ల రిస్క్ తీసుకునే వ్యాపారవేత్తలకు పూర్తి భరోసా లభిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తమ తప్పిదాల వల్ల ఏదైనా సమస్య వస్తే అది వేరే విషయమని, కానీ ప్రభుత్వ విధానాల మార్పులతో మధ్యలో వదిలివేయరనే నమ్మకం ఉండాలని తెలిపారు. రిస్క్ తీసుకునే వారికి భరోసా కల్పించే వాతావరణాన్ని సృష్టించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రిస్క్ తీసుకుంటేనే మనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానం

మరోవైపు, అంతరిక్ష రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను భారత్ ఆకర్షించగలదని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ రంగంలో భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే ప్రపంచ నిపుణులు భారత్‌కు వచ్చేలా ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని సృష్టించాలని చెప్పారు. రిస్క్ తీసుకుంటేనే మనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోగలమని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం విషయంలో భారత్‌కు ఎలాంటి కొరత లేదని, ఖర్చుల పరంగా కూడా భారత్ పోటీదారుగా ఉందని అన్నారు.

**'ప్రజల జీవితాలను ఎలా సులభతరం చేయవచ్చో ఆలోచించాలి'**

ప్రజల జీవితాలను మెరుగుపరచడంలో స్టార్టప్‌లకు మోదీ పలు కీలక సూచనలు చేశారు. అంతరిక్ష సంస్థలు కేవలం ఉపగ్రహాలు, ప్రయోగాలకే పరిమితం కాకుండా తమ సాంకేతికతతో ప్రజల జీవితాలను ఎలా సులభతరం చేయవచ్చో ఆలోచించాలని అన్నారు. అలాగే, వ్యవసాయ రంగంలో పనిచేసే స్పేస్ టెక్నాలజీ సంస్థలు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ విభాగాలతో కలిసి పనిచేస్తే రైతులకు మెరుగైన సమాచారం అందించవచ్చని చెప్పారు. అంతరిక్ష సంస్థలు, ఇతర రంగాల్లో పనిచేస్తున్న సంస్థలతో స్పేస్ స్టార్టప్‌లు మరింతగా భాగస్వామ్యాలు ఏర్పరచుకోవాలని చెప్పారు. అంతరిక్ష వ్యర్థాలపై పనిచేసే కంపెనీలు, పర్యావరణ సంస్థలతో కలిసి తమ సాంకేతిక పరిష్కారాలను విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవచ్చని ఉదహరించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో మరింత సహకారం అందించుకోవాలని మోదీ పేర్కొన్నారు. దీనివల్ల పిల్లల్లో చిన్న వయస్సు నుంచే అంతరిక్ష రంగం పట్ల ఉత్సుకత, ఆసక్తి కలుగుతాయని ఆయన అన్నారు.

కాగా, ఈ సమావేశంలో స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, పిక్సెల్, ధ్రువ స్పేస్, గెలాక్సీ, పియర్‌సైట్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, దిగంతర, శాట్‌స్యూర్, సుహోరా టెక్నాలజీస్, మనస్తు స్పేస్, ఆస్ట్రోబేస్, టేక్‌మీ2స్పేస్, వ్యోమిక్, ఆర్బిట్‌ఎయిడ్ ఏరోస్పేస్, స్కైసర్వ్ (హైస్పేస్), సెరెండిపిటీ స్పేస్‌తో సహ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బ్యాట్ మ్యాన్‌గా రాహుల్ గాంధీ

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని "రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్"గా చిత్రీకరిస్తూ జాతీయ రాజధానిలోని భారత జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో రాహుల్ గాంధీ చిత్రంతో పాటు "ది సైలెంట్ గార్డియన్, ఎ వాచ్‌ఫుల్ ప్రొటెక్టర్, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్" అనే ట్యాగ్‌లైన్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల ప్రారంభంలో రాహుల్ గాంధీ ఇన్‌స్టాగ్రామ్‌లో విద్యార్థులు, యువ పౌరులతో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి సరదాగా "మీరు బ్యాట్ మ్యాన్ ఆ?" అని ప్రశ్నించారు. దీనికి రాహుల్ స్పందిస్తూ, "బ్యాట్ మ్యాన్, తాను ఒకే గదిలో ఎప్పుడూ లేమని అందరూ అనుకుంటున్నారులే" అంటూ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. రాహుల్ గాంధీ చేసిన ఈ సరదా వ్యాఖ్య ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. విద్యార్థులు దీనిపై పలు మీమ్స్‌ను రూపొందించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల ఆయనను 'రియల్ లైఫ్ బ్యాట్ మ్యాన్'గా పేర్కొంటూ పోస్టర్లు ఏర్పాటు చేశారు.

**రాహుల్ ఈతపై రిజిజు వ్యాఖ్యలు**

ఇదిలా ఉండగా, రాహుల్ గాంధీ తన ఫిట్‌నెస్ దినచర్యలో భాగంగా ఈత గురించి తరచుగా మాట్లాడుతుంటారని, అయితే అరుణాచల్ ప్రదేశ్‌లోని ఉధృతంగా ప్రవహించే నదుల్లో ఈత కొట్టే ముందు ఆయనకు కొంత శిక్షణ అవసరం కావచ్చని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఈ మేరకు "నేను ఖిలాడీని" అంటూ ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. రాహుల్ గాంధీతో ఫిట్‌నెస్‌కు సంబంధించిన సరదా సంభాషణల పరంపరలో ఇది తాజా వ్యాఖ్య. గత ఏడాది పార్లమెంటులో జరిగిన సంభాషణతో పాటు, ఈ ఏడాది ప్రారంభంలో రాహుల్ విసిరిన జియు-జిట్సు సవాలు కూడా ఇందులో ఉన్నాయి.

## గినియాలో పెను విషాదం

### ఏకంగా 22 మంది మృతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (సింగిడి)**

ఆఫ్రికా దేశం గినియాలో పెను ప్రమాదం చోటు చేసుకుంది. రాజధాని కొనక్రీలోని డంపింగ్ యార్డ్ లో భారీ చెత్త కుప్ప విరిగిపడింది. ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో ఏకంగా 22 మందికి పైగా మృతి చెందారు. వర్షానికి చెత్త కుప్పకూలడంతో గుడిసెలు అందులో పూడుకుపోయాయని స్పష్టం చేస్తున్నారు అధికారులు. ఈ పెను ప్రమాదంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారని అధికారులు వెల్లడించారు. అందులో చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు సహాయక చర్యలు చేపడుతున్నారు.

## ప్రభుత్వ బడుల విద్యార్థులకు యూనిఫారాల తిప్పలు

**హైదరాబాద్, ఆగస్టు 23 (సింగిడి)**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు అందిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. మాట్లాడితే ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అనే సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీసం నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారా? అని ప్రశ్నించారు. కొన్ని చోట్ల యూనిఫారాలు అందలేదని, అందిన చోట కొలతలు సరిగ్గా లేవన్నారు. కుట్లు ఊడిపోతున్నాయని, ఉతికితే రంగులు వెలిసిపోతున్నాయని ఎద్దేవా చేశారు. రెండు జతలు ఇవ్వాల్సి ఉండగా, చాలా చోట్ల ఒక్క జత కూడా పూర్తిగా అందలేదని ఆరోపించారు.

కమీషన్ల కోసమే : రేవంత్ రెడ్డికి గుజరాత్ దళారులపై ఉన్న ప్రేమ, తెలంగాణ చేనేత కార్మికులపై లేదని మండిపడ్డారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వాల్సింది పోయి, కమీషన్ల కోసం బడా కార్పొరేట్ సంస్థల నుంచి నాసిరకం యూనిఫారాలు తెప్పించి విద్యార్థులకు, చేనేత కార్మికులకు అన్యాయం చేశారు.

చేనేత వద్దు అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా? : చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా, స్థానికంగా యూనిఫారాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వకుండా కార్పొరేట్ సంస్థలకు టెండర్లు ఇచ్చారని విమర్శించారు. మఫత్‌లాల్ ముద్దు(కాంట్రాక్ట్ సంస్థ) చేనేత వద్దు అన్నదే ప్రభుత్వ వైఖరిగా మారిందా? అని ప్రశ్నించారు. ఒకవైపు చేనేత కార్మికుల ఉపాధికి గండికొట్టి, మరోవైపు విద్యార్థులకు నాసిరకం యూనిఫారాలు అందించారని విమర్శించారు. దీంతో విద్యార్థులకు కష్టం, చేనేత కార్మికులకు ఉపాధి నష్టమని, నాసిరకం యూనిఫారాలపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

రెండు జతల యూనిఫారాలు : తెలంగాణలోని 28వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు, విద్యాశాఖ గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, సంక్షేమ గురుకులాల్లో సుమారు దాదాపుగా 27 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఏడాదికి రెండు జతల చొప్పున యూనిఫారాలను ప్రభుత్వం అందించాలి. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. బ్రాండెడ్ దుస్తులు (యూనిఫారాలు) అందించేందుకు రూ.678 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపింది. ప్రతీ విద్యార్థికి ఏడాదికి రెండు జతల యూనిఫారాలు, బెడ్‌షీట్లు, దుప్పట్లు, ఇవ్వాలంటే 2.97 కోట్ల మీటర్ల క్లాత్ అవసరం. గతంలో ఈ ప్రస్తాన్ని స్థానిక చేనేత కార్మికుల సహకార సంఘం నుంచి కొనుగోలు చేసి పంపిణీ చేసేది. కానీ ఈసారి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు టెండర్లు అప్పగించింది.

చర్యలు తీసుకుంటారా? : సహకార సంఘానికి మాత్రం 30 శాతం కొనుగోలుకు మాత్రమే ఆర్డర్‌ను కేటాయించింది. దీనికి తోడు అడ్వాన్స్ చెల్లింపులోనూ జాప్యం జరిగినట్టు సదరు కాంట్రాక్టు సంస్థలు చెబుతున్నాయి. సహకార సంఘాలకు ముందస్తుగా డబ్బులు చెల్లించకపోయినా నాణ్యమైన యూనిఫారాలు ఇచ్చేవి. కానీ కార్పొరేట్ సంస్థలు సరాఫరా చేసిన యూనిఫారాలపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. మరి ఇప్పుడైన ప్రభుత్వ చేనేత సంఘాలతో యూనిఫారాలు తయారు చేయించి, సదరు కార్పొరేట్ సంస్థలపై చర్యలు తీసుకుంటుందా అనే దానిపై వేచి చూడాల్సిందే. ఈ యూనిఫారాల విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ గతంలో పెద్ద ఎత్తున ఆందోళన చేసింది. మంత్రులకు సవాళ్లు విసిరింది. అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ వద్ద ఆరోజు హైడ్రామా నడిచిన సంగతి

## క్షిపణుల కొరత... రక్షణ బడ్జెట్ సంక్షోభం

రష్యాతో యుద్ధం కొనసాగుతున్న తరుణంలో దేశంలో ఎన్నికలు నిర్వహించడం అత్యంత ప్రమాదకరం అని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం మార్షల్ లా (సైనిక చట్టం) అమల్లో ఉన్నందున ఎన్నికల్ని నిలిపివేసినట్లు గుర్తు చేసిన ఆయన, ఈ క్లిష్ట సమయంలో ఓటింగ్ నిర్వహిస్తే దేశం విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటీవల ఆయన పదవి నుంచి తొలగించిన రక్షణ శాఖ మాజీ మంత్రి మైఖైలో ఫెదోరోవ్ దేశంలో ఎన్నికలు జరపాలంటూ అనూహ్యంగా ప్రతిపాదించిన నేపథ్యంలో జెలెన్‌స్కీ దీనిపై స్పందించారు. శనివారం ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాల్ని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహిస్తే దేశంలో రాజకీయ విభజనలు మరింత పెరిగి, ఉక్రెయిన్‌ను మరింత బలహీనపరుస్తాయని అన్నారు. యుద్ధం వేళ ఎన్నికల నిర్వహణతో దేశమే విడిపోయే ప్రమాదం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఆగస్ట్ 22న జర్నలిస్టులతో దాదాపు 2 గంటల పాటు నిర్వహించిన సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు.

యుద్ధం సమయంలో దేశంలో ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌కు ప్రజల్లో కూడా పెద్దగా మద్దతు లేదని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. తాత్కాలికంగా ఎన్నికలు నిలిపివేస్తూ జెలెన్‌స్కీ తీసుకున్న నిర్ణయానికే ఓటేస్తున్నారు. ఒక సర్వే ప్రకారం కేవలం 15 శాతం మంది ప్రజలు మాత్రమే యుద్ధం ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నారు. అందుకే ఈ సమయంలో ఎన్నికల దిశగా అడుగులు వేయడం అంటే దేశాన్ని నాశనం చేసుకోవడమే అని జెలెన్‌స్కీ హెచ్చరించారు.

**ఫెదోరోవ్ తప్పుడు మార్గంలో వెళ్తున్నారు- జెలెన్‌స్కీ**

ఇక గత నెలలో రక్షణ మంత్రి పదవి నుంచి ఫెదోరోవ్‌ను తొలగించిన తర్వాత దేశంలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ వివాదంపై జెలెన్‌స్కీ తొలిసారిగా బహిరంగంగా మాట్లాడారు. ఆయను ఎందుకు, ఏ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి తొలగించాల్సి వచ్చిందో వివరించారు. ఉక్రెయిన్ సైన్యాన్ని ఆధునీకరించడంలో, డ్రోన్ పోరాటాల్ని పెంచడంలో ఫెదోరోవ్ కీలక పాత్ర పోషించినప్పటికీ, ఆయన మిలిటరీ కమాండ్‌తో విభేదించారని తెలిపారు. ఫెదోరోవ్ ప్రభుత్వం నుంచి బయటకు వెళ్లిన తర్వాత చేపట్టిన భారీ నిరసనలు, ఎన్నికల పిలుపులు తప్పుడు మార్గంలో వెళ్తున్నాయని విమర్శించారు. ఆయనకు స్పష్టమైన కార్యచరణ ప్రణాళిక లేదని పేర్కొన్నారు.

**స్టార్‌లింక్ వివాదం**

రష్యా భూభాగంలో తమ దాడులకు స్టార్‌లింక్ సేవలను ఉపయోగించేందుకు స్పేస్ ఎక్స్ అంగీకరించిందని రక్షణ మంత్రిత్వ శాఖ తప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదురైందని జెలెన్‌స్కీ వెల్లడించారు. ఎలాన్ మస్క్ ఆ వార్తల్ని ఖండించగా, ట్రంప్ ముందు తాను నిందలు పడాల్సి వచ్చిందని తెలిపారు. పదవి నుంచి తొలగించిన తర్వాత ఫెదోరోవ్ ఎన్నికలు జరపాలని డిమాండ్ చేయడం, సైనిక నాయకత్వంపై విమర్శలు చేయడంపైనా జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించే సైన్యానికి గౌరవం ఇవ్వాలని అన్నారు. ఇంకా ఫెదోరోవ్ ప్రభుత్వంలోనే కొనసాగేందుకు తాను నాలుగు వేర్వేరు ప్రతిపాదనలు చేసినప్పటికీ, ఆయన వాటిని తిరస్కరించారని చెప్పారు. మరోవైపు రష్యా నుంచి బాలిస్టిక్ క్షిపణి దాడులు రోజురోజుకూ తీవ్రమవుతుండగా, వీటిని ఎదుర్కొనేందుకు మిత్ర దేశాల నుంచి తమకు అందే 'ప్యాట్రియాట్' ఎయిర్ డిఫెన్స్ క్షిపణుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని జెలెన్‌స్కీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో ఉక్రెయిన్‌కు 675 ప్యాట్రియాట్ క్షిపణులు అందగా, 2025లో ఆ సంఖ్య 364 కు తగ్గిందన్నారు. 2026 నాటికి కేవలం 264 క్షిపణులు మాత్రమే అందే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే శీతాకాలం తమకు కనీసం మరో 300 క్షిపణులు అవసరమని, వీటిని అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. అయితే ప్రస్తుతం రక్షణ మంత్రిత్వ శాఖలో 27 బిలియన్ డాలర్ల బడ్జెట్ లోటు ఏర్పడిందని పేర్కొన్నారు. ఇదిలా ఉన్నప్పటికీ ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా ఉక్రెయిన్ దళాలు రష్యాతో పోరాటంలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని జెలెన్‌స్కీ ఆశాభావం వ్యక్తం చేశారు. ద్నిప్రోపెట్రోవ్స్క్ ప్రాంతంలో దాదాపు పూర్తి భూభాగాన్ని ఉక్రెయిన్ బలగాలు తిరిగి స్వాధీనం చేసుకున్నాయని జెలెన్‌స్కీ చెప్పారు. కేవలం 10 చదరపు కిలోమీటర్ల పరిధిలోని 3 చిన్న గ్రామాలు మాత్రమే రష్యా నియంత్రణలో ఉన్నాయన్నారు. 2026 చివరినాటికి రష్యా ఆక్రమించిన తమ మొత్తం భూభాగాన్ని దక్కించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 2035 నాటికి భారత సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు: ఇస్రో చీఫ్

అహ్మదాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మూడో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో వి.నారాయణన్ పాల్గొని ప్రసంగించారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన పురోగతిని వివరించారు. 64 ఏళ్ల క్రితం ప్రారంభమైన భారత అంతరిక్ష కార్యక్రమం, ప్రస్తుతం అనేక రంగాల్లో ప్రజలకు నేరుగా ఉపయోగపడే స్థాయికి చేరుకుందని అన్నారు.

**50కిపైగా రంగాల్లో అంతరిక్ష సేవలు**

భారత్ అంతరిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన సమయంలో ప్రధానంగా ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాల సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపైనే దృష్టి పెట్టిందని ఇస్రో చీఫ్ తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. భూ పరిశీలన, రిమోట్ సెన్సింగ్, టెలికమ్యూనికేషన్లు, టెలివిజన్ ప్రసారాలు, టెలి-ఎడ్యుకేషన్, విపత్తుల ముందస్తు హెచ్చరికలు, నావిగేషన్, రక్షణ, భద్రత, రియల్‌టైమ్ పర్యవేక్షణ, ట్రాకింగ్ వంటి 50కిపైగా రంగాల్లో అంతరిక్ష ఆధారిత సేవలను భారత్ అందిస్తోందని చెప్పారు. అంతరిక్ష సాంకేతికత సామాన్యుల జీవితాల్లోనూ కీలకంగా మారిందని నారాయణన్ పేర్కొన్నారు.

గగన్‌యాన్‌పై ప్రత్యేక దృష్టి

భారతీయ అంతరిక్ష కేంద్రంతో పాటు గగన్‌యాన్ కార్యక్రమం కూడా దేశానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని నారాయణన్ అన్నారు. మానవులను అంతరిక్షంలోకి పంపే ఈ కార్యక్రమం కోసం ఇస్రో పలు దశల్లో పరీక్షలు, సాంకేతిక అభివృద్ధి చేపడుతోంది.

## 14 దేశాలకు టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుల నియామకం

**హైదరాబాద్, ఆగస్టు 23 (సింగిడి)**

తెలంగాణ రక్షణసేన (టీఆర్ఎస్).. వివిధ దేశాలకు పార్టీ అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్ట్రేలియా (కిషోర్ కత్తి), యూకే (సుమన్ రావు బాల్మూరి)కెనడా (వెంకట్రామన్ మెట్‌పల్లి), యూఏఈ (శేఖర్ గౌడ్ ఆరె) సహా 14 దేశాలకు పార్టీ అధ్యక్షులను నియమించారు. మహారాష్ట్ర శాఖకు అధ్యక్షుడిగా సుల్గే శ్రీనివాస్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలను ఏకం చేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని కవిత సూచించారు.

## వచ్చాక అన్నీ మాట్లాడతా

ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. యూకే, యూఎస్ పర్యటనలకు ప్రభుత్వం ముందుగానే అనుమతులు కోరినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం కేవలం లండన్ పర్యటనకే క్లియరెన్స్ ఇచ్చి, అమెరికా పర్యటనకు 'రాజకీయ కోణం' చూపిస్తూ అనుమతి నిరాకరించిందని సీఎం తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గళమెత్తి సీఎం రేవంతు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా ఖర్గేకు రేవంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన లండన్ పర్యటన అత్యంత విజయవంతంగా ముగిసిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగాలు, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో తెలంగాణకు కీలకమైన భాగస్వామ్యాలు కుదిరాయని పేర్కొన్నారు. మరికొద్ది గంటల్లోనే తాను హైదరాబాద్‌కు చేరుకుంటానని, హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత కేంద్రం వైఖరి, పూర్తి అంశాలపై సవివరంగా మాట్లాడతానని సీఎం వెల్లడించారు.

## బంగ్లాదేశ్‌లో హిందూ ఫ్యామిలీ కుటుంబం దారుణ హత్య

**ఢాకా (సింగిడి)**

బంగ్లాదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాంత హిందూ టీచర్ కుటుంబం హత్యకు గురైంది. తన ఇంటిపై డ్రగ్స్ తీసుకుంటుండాన్ని ప్రశ్నించినందుకు దుండగులు అతన్ని చంపారు. ఈ సంఘటన రంగ్‌పుర్‌లో చోటుచేసుకుంది.పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ వివరాలు వెల్లడించారు. గణపతి చక్రవర్తి (65) కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ టీచర్‌గా రిటైర్డ్ అయి హోమియోపతి వైద్యాన్ని ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం రంగ్‌పుర్‌లో కొత్త ఇంటిని నిర్మించుకుని భార్య ప్రీతిలత (50), కుమార్తె అగామీ (23), కుమారుడు ప్రియమ్ (12)తో కలిసి ఉంటున్నారు. చక్రవర్తి భార్య ప్రీతిలతకు ఆమె సోదరి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మిగతా కుటుంబ సభ్యుల ఫోన్లు సైతం కలవకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఆ ఇంటి తలుపులను పగలగొట్టి చూడగా నలుగురు హత్యకు గురై కనిపించారు. చక్రవర్తి మృతదేహం ఇంటి పైకప్పుపైన, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపైన, కుమారుడి మృతదేహం ఇంట్లోని మంచం కింద లభ్యమయయాయి. గురువారం రాత్రి ఈ హత్యలు జరిగినట్లు పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ తెలిపారు. ఇద్దరు దుండగులు డ్రగ్స్ తీసుకోవడానికి చక్రవర్తి ఇంటిపైకి వెళ్లారు. దాన్ని గమనించిన గణపతి వారిని ప్రశ్నించడంతో తమను గుర్తుపట్టారని, టవల్‌తో మెడకు చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఈ క్రమంలో శబ్దం రావడంతో భార్య ప్రీతిలత పైకి వెళ్లగా ఆమెను సైతం గొంతునులిమి హత్య చేశారు. అనంతరం వారి పిల్లలను చంపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను గుర్తించి విచారిస్తున్నట్లు తెలిపారు

## ఒడిశా తీరంలో మునిగిపోయిన కార్గో షిప్

**న్యూఢిల్లీ, (సింగిడి)**

ఒడిశా తీరంలో పనామాకు చెందిన కార్గో నౌక మునిగిపోయింది. ఈ ఘటనలో నౌకలోని 22 మంది సిబ్బంది గల్లంతయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. పనామాకు చెందిన కార్గో నౌక సింగపూర్ వెళ్తుండగా, ఒడిశా తీరంలో, బంగాళాఖాతంలో ప్రమాదవశాత్తు మునిగిపోయింది. ఒడిశా తీరంలోని పారదీప్‌నకు 240 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో నౌకలోని 22 మంది గల్లంతయ్యారు. ఘటనపై సమాచారం అందుకున్న ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్ సిబ్బంది వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. నౌకకు చెందిన ఇద్దరిని రక్షించారు. గల్లంతైన 22 మంది కోసం గాలిస్తున్నారు. ఈ ప్రమాదంపై ఇండియన్ కోస్ట్ గార్డ్ స్పందించింది. పనామాకు చెందిన ఎంవీ ఓషన్ విన్నర్ అనే నౌకతో సంబంధాలు తెగిపోయినట్లు సమాచారం అందిందన్నారు. నౌకలో 20 మంది చైనా వాసులు, ముగ్గురు మయన్మార్ పౌరులు, ఒక బంగ్లాదేశ్ పౌరుడు ఉన్నారు. ఒడిశా నుంచి ఈ నౌక ఐరన్ ఓర్ లోడ్‌తో శుక్రవారం సింగపూర్ బయల్దేరింది. నౌక మునిగిపోవడానికి కొద్దిసేపు ముందు సంబంధాలు తెగిపోయాయి. ప్రస్తుతం ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్ సంయుక్తంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో ఇదే మార్గంలో ప్రయాణిస్తున్న ఇతర నౌకల్ని అలర్ట్ చేశారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
24-8-2026



# బీఎల్ వోలు సర్‌పై అప్రమత్తంగా పనిచేయాలి

• ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**వికారాబాద్ ప్రతినిధి ఆగస్టు 23(సింగిడి):** సర్ పేస్ టూ కార్యక్రమంలో భాగంగా పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ బిఎల్‌వోల అవగాహన సదస్సు శనివారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్, పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ బూత్‌లకు చెందిన బి ఎల్ వో లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి సర్ పేస్ టూ ప్రక్రియ, ఓటర్ల జాబితా పరిశీలన, బూత్ స్థాయిలో బిఎల్‌వోల బాధ్యతలు, ప్రజలకు కల్పిం చాల్సిన అవగాహన తదితర అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం గాంధీ భవన్ ట్రైనర్ రన్ ధీర్ ప్రత్యేక ప్రెజెంటేషన్ ద్వారా సర్ పేస్ టూ పై బి ఎల్ ఓలకు, కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఓటర్ల వివరాల పరిశీలన, అసడ్ ఏ ఎస్ డి డి, మాపింగ్ , అనొమాలీస్ సంబంధిత పత్రాల పరిశీలన, అభ్యం తరాలు, ఓటర్ల వివరాల్లో మార్పులు, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన చర్యలను ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పరిగి నియోజకవర్గంలోని 305 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 73,487 కేసులు ఉండగా, అందులో 8,918 మాపింగ్ కేసులు, 64,569 అనొమాలీస్ కేసులు ఉన్నట్లు తెలిపారు. వీటిని పరిష్కరించేందుకు రోజుకు సగటున 3,499 కేసులను డీల్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ప్రతి బూత్‌లో బి ఎల్ ఓ లు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సర్ నోటీసులు అందిన వారు సంబంధిత పత్రాలతో హాజరై వివరణ ఇవ్వాలని సూచించారు. సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలు, ఆధారాలతో నిర్ణీత సమయంలో హాజరై తమ వివరణ అందించాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఈ నెల 27న గ్రామ సభల్లో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ఏర్పాటు చేయనున్నారని అన్నారు. ప్రజల సమక్షంలో చదివి వినిపిం చనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు గ్రామ సభలకు హాజరై తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయా లేదా పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ యువ వికాసం తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలి. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. అదే సమయంలో సర్ పేస్ టూ ప్రక్రియలో ప్రతి బూత్‌లో బి ఎల్ వో లు అవిశ్రాంతంగా, అప్రమత్తంగా పనిచేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. అదేవిధంగా త్వరలోనే పరిగి నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించి నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, నాయకులు తప్పని సరిగా పాల్గొని ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి అర్హుడి ఓటు ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైనది. సర్ పేస్ టూ పూర్తయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ బిఎల్‌వోలు అవిశ్రాంతంగా, అప్రమత్తంగా పనిచేయాలని అన్నారు. బూత్ స్థాయిలో ప్రతి ఓటరు వివరాలను పరిశీలిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు కాపాడేలా బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధార సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జంగా రెడ్డి, గాంధీ భవన్ ట్రైనర్ రన్ ధీర్‌తో పాటు నియోజకవర్గంలోని మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ కమిటీల చైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గాజులరామారం డివిజన్‌లో సీసీ రోడ్లకు శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 23 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో గాజుల రామారం డివిజన్‌లో ఆదివారం సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అందులో బాలాజీ లేఔట్‌లో రూ. 14 లక్షలు, వొక్షిత్ ఎంక్లేవ్‌లో రూ. 40. 50 లక్షలు, వీనస్ ఎంక్లేవ్‌లో రూ. 45 లక్షల చొప్పున మొత్తం రూ. 99. 50 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గాజులరామారం డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా కాలనీల్లో రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాను మంజూరు చేయించిన రోడ్ల పనులపై స్థానికంగా రాజకీయ ప్రచారం జరుగుతోందని కూన శ్రీశైలం గౌడ్ విమర్శిం చారు. తాను మంజూరు చేయించిన రోడ్లను ప్రస్తుత ఎమ్మెల్యే మంజూరు చేసినట్లుగా రోడ్ల





వెంట తిరుగుతూ శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు నిధులు లేవంటూ విమర్శలు చేస్తూనే, మరో వైపు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులను పరి శీలించడం ప్రజలను అయోమయానికి గురిచేసే విధంగా ఉందని ఆయన వ్యాఖ్యా నించారు. అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయో జనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గాజులరామారం డివిజన్‌లో రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చేందుకు నిరంతరం అందుబాటులో ఉంటా నని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ గారు మరియు కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు స్థానిక నాయకులు యాము సాగర్, లక్ష్మీ నారా యణరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు ప్రతినిధులు, అంజన్న, గోపాల్ రెడ్డి, వల్లెపు వేణు కుమార్, సురపరాజు, వెంకట్రావు, వెంకట్ రెడ్డి, శివ, కిరణ్, సురేష్ కుమార్, జగదీష్, నాగరాజు, కిరణ్, ఋషి కుమార్, శ్రీకాకుళం రవి, వెంకటేశ్వరరావు, అమ్రేష్, శశిధర్, దీపక్, సత్యనారాయణ, రామ నాథరెడ్డి, రాఘ వేంద్ర, రంగారెడ్డి, గోపి, ప్రతాపరెడ్డి, వివేక్, ఆనందరావు, మహేందర్, శ్రీపాల్ రెడ్డి మరియు స్థానికులు తదితరులు పాల్గొని సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, ఆగస్టు 23(సింగిడి):** నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆధ్యాత్మికతతో పాటు ప్రజల ఐక్యతకు దేవాలయాలు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆదివారం బీరంగూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట రెయిన్బో మెడోస్ కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా దేవాలయాల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలే కాకుండా



ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. దేవాలయ నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణ, సీనియర్ నాయకులు శ్రీకాంత్, జగదీష్, గోపాల్, కృష్ణ, శ్రీనివాస్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత


### ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు





**కుత్బుల్లాపూర్, ఆగస్టు 23 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ లోని పెద్ద చెరువు కట్ట మైసమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం, ఇందిరమ్మ కాలనీలోని నడిగడ్డ నాగులమ్మ ఎల్లమ్మ తల్లి బోనాల కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### శుభ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 23 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట మున్సిపల్ ప్రగతి నగర్ లోని నాన్ కన్వెన్షన్ హాల్ లో బౌరంపేట సింహపురి కాలనీ నివాసులు సత్యనారాయణ రెడ్డి కుమారుడు పుట్టు పంచల కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి శుభాశీస్సులు అందజేశారు. కొంపల్లిలోని హైందవ గౌరిక్ ఫంక్షన్ హాల్ లో దూలపల్లి నివాసులు బర్మా వెంకటేష్ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. దూలపల్లి లోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో దూలపల్లి నివాసులు గురాల ఆంజనేయులు యాదవ్ కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పటాన్ చెరువు నియోజకవర్గం బీరంగూడ నివాసులు అత్తేలి ఈశ్వర్ రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అమీన్పూర్ ప్రభుత్వ విద్యారంగానికి మహర్దశ..





• 100 కోట్ల రూపాయలతో రెండు నూతన పాఠశాలలు, భవనాల ఆధునీకరణ, అదనపు తరగతి గదులు..
• ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య..
• పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి..

**పటాన్చెరు, ఆగస్టు 23(సింగిడి):** అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ, అమీన్పూర్ డివిజన్లలో గల పేద మధ్యతరగతి విద్యార్థులకు అతి త్వరలో అత్యధిక వసతులతో కూడిన క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు అందుబాటులోకి రానున్నాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. 100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అమీన్పూర్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం, నవ్య రోడ్డులో నూతన పాఠశాలలకు, కిష్టారెడ్డి పేటలో ఉన్నత పాఠశాల నవీనీకరణ పనులకు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం క్యూర్ అర్బన్ రీజియన్ (సి యు ఆర్ ఈ)పరిధిలో ఆధునిక వసతులతో క్యూర్ అర్బన్ స్కూల్స్ నిర్మిస్తోందని తెలిపారు. వీటి నిర్మాణం ద్వారా ఒకే ప్రాంగణంలో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించిన సాధ్యమవుతుందని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఆటస్థలాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అత్యాధునిక ల్యాబ్‌లు, లైబ్రరీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నూతన పాఠశాలలు ఎంతగానో ఉపకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణ, (టి జి ఈ డబ్ల్యూ డి ఐ సి ) ఈఈ శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సుధాకర్, సీనియర్ నాయకులు గోపాల్, కృష్ణ, జగదీష్, సునీత, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ట్రాఫిక్ నరకం

**కూకట్ పల్లి, ఆగస్టు 23 (సింగిడి):** హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ ప్రాంతాలలో ఒకటైన కూకట్‌పల్లిలో ప్రయాణం రోజురోజుకూ సవాలుగా మారుతోంది. ముఖ్యంగా కూకట్ పల్లి తహశీల్దార్ కార్యాలయం ముందున్న ప్రధాన రహదారిపై పూలు, పండ్ల షాపుల అక్రమ ఆక్రమణలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా పరిణమించాయి. కార్యాలయం ఆవరణ పొడవునా ఉన్న డివైడర్ కారణంగా రోడ్డు ఇప్పటికే కొంతమేర ఇరుకుగా మారింది. దీనికి తోడు రోడ్డును ఆనుకుని వెలసిన తాత్కాలిక దుకాణాలు, వాటి వద్దకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో పరిస్థితి మరింత దిగజారింది. కార్యాలయం ముందు రోడ్డు కుచించుకుపోవడం వల్ల పీక్ అవర్స్‌లో భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. గతంలో అధికారులు పలుమార్లు ఈ ఆక్రమణలను తొలగించినప్పటికీ, పర్యవేక్షణ కొరవడటంతో కొద్దిరోజులకే వ్యాపారులు మళ్లీ యథావిధిగా అక్కడే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. సీఎంసీ, రెవెన్యూ అధికారుల మధ్య



సమన్వయ లోపం, పట్టీపట్టనట్లు వ్యవహరించే తీరు వల్ల అక్రమార్కులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇరుకైన రోడ్డుపై పాదచారులు నడిచేందుకు కూడా స్థలం లేకపోవడంతో, వాహనదారులు, పాదచారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కేవలం ఒక్కసారి తొలగించి ఊరుకోకుండా, ఆ ప్రాంతంలో మళ్లీ ఆక్రమణలు జరగకుండా పోలీస్, మున్సిపల్ సిబ్బందితో శాశ్వత నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. నిబంధనలను ఉల్లంఘించి రోడ్లను ఆక్రమించే వారిపై భారీ జరిమానాలు విధించడం లేదా వ్యాపార సామగ్రిని జప్తు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలి. జీవనోపాధి కోల్పోకుండా చిన్న వ్యాపారస్తుల కోసం సమీపంలోనే 'స్ట్రీట్ వెండర్ జోన్'లను కేటాయించి అక్కడికి తరలించాలి. ప్రజల ప్రయాణ సౌలభ్యం కోసం నిర్మించిన రోడ్లు కొందరి స్వార్థం వల్ల ఇబ్బందికరంగా మారడం గమనార్హం. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పూర్తిగా పరిష్కరించడానికి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పీఏసీ సమావేశానికి భారీగా తరలిరావాలి



• కాంగ్రెస్ బలోపేతానికి కీలక నిర్ణయాలపై చర్చ
• కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్

**కొల్చారం, ఆగస్టు 23 (సింగిడి):** మెదక్ పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో నేడు ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పీఏసీ సమావేశం నిర్వహించనున్నట్లు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ నర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్‌తో పాటు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని నాగులగారి మల్లేశం గౌడ్ పిలుపునిచ్చారు.

## రక్తదాతలకు అభినందనలు



**కూకట్ పల్లి, ఆగస్టు 23 (సింగిడి):** కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లోని సుఖశాంతి భవన్‌లో రేడియేషన్ ఎఫెక్ట్స్ రీసెర్చ్ ఫౌండేషన్, రాజయోగ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బ్రహ్మకుమారి సోదరీమణుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న దాతలను స్వయంగా కలిసి వారి సేవాభావాన్ని ఆయన అభినందించి, ప్రశంసించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం శిబిర నిర్వాహకులను అభినందిస్తూ, సమాజ సేవలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. సేవ, ఆధ్యాత్మికతతో పాటు సమాజానికి ఉపయోగపడే సత్కార్యాలను నిర్వహిస్తున్న బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు, రేడియేషన్ ఎఫెక్ట్స్ రీసెర్చ్ ఫౌండేషన్ సభ్యులు, రాజయోగ మెడిటేషన్ సెంటర్ నిర్వాహకులు, రక్తదాతలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రి,హాస్టల్, దేవాలయాల్లో

## దోబీ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలి

• రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక
• బట్టలు ఉతికే కాంట్రాక్టు రజకులకే ఇవ్వాలి
• జిల్లా యూత్ అధ్యక్షులు అనిల్



**కొడంగల్, ఆగస్టు23 (సింగిడి):** కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, జిల్లా యూత్ అధ్యక్షులు సి. అనిల్ , జిల్లా మహిళ అధ్యక్షురాలు లక్ష్మి లు మాట్లాడుతూ,రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆసుపత్రిలు,హాస్టళ్లలో, దేవాలయాల్లో రజక పోస్టులు వెంటనే మంజూరు చేయాలని అన్నారు. కోడంగల్ పట్టణంలో ఉన్న నూతన ప్రభుత్వ హాస్పిటల్ , హాస్టల్ , గురుకుల పాఠశాలలు , ఫార్మా కాలేజ్, పాలిటెక్నిక్ కళాశాల మరియు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దోబీ పోస్టులు అర్హులైన వారితో తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ బట్టలు ఉతికే కాంట్రాక్టు కూడా రజక వృత్తిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో చదువుకున్న నిరుద్యోగ యువతకు దోబి పోస్టులు భర్తీ చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అన్నారం అధ్యక్షులు సాయిలు,జిల్లా ఉపాధ్యక్షులు దౌల్తాబాద్ వెంకటప్ప, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లలిత,జిల్లా యూత్ ఉపాధ్యక్షులు నాగేష్, కోడంగల్ మండల అధ్యక్షులు మొగులప్ప,ఇంఛార్జి మోహన్, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు మొగులప్ప, మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, సంపత్,శ్యామప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi సోమవారం 24-8-2026

# ఎడిటోరియల్

Editorial

## ఇప్పుడు యుద్ధ మంటే

యుద్ధ మంటే
ఊపిరి దీపాలను ఆర్పడం
కాదు
శత్రువుల ఎదలపై ప్రేమ
మొలకను నాటడం

యుద్ధ మంటే
పచ్చని బతుకులను కూల్చడం
కాదు
చెదిరిన గూడులకు నిట్టాడై
నిలబడటం

యుద్ధ మంటే
ఆధిపత్యాన్ని అవని నిండా
నాటడం కాదు
అందరి మన్సులపై మల్లెలను
పూయించడం

యుద్ధ మంటే
డ్రోన్ల తోటి పరుల గుండెలను
చీల్చడం కాదు
కన్నీళ్ల సుడులను దోసిల్లకు
తీసుకోవడం

యుద్ధ మంటే
అక్షరాల తోటను ఆగం
చేయడం కాదు
వారి నుదుటిపై ఉన్నత
గీతలను గీయడం


ఇప్పుడు యుద్ధ మంటే
రుధిరంతో పుడమిని
తడపడం కాదు
కూలిన కండ్లలల్లో వెలుగును
నింపడం

తాటిపాముల రమేష్
( తార )
7981566031

## ఓ ఐఫోన్ కోసం మూడు ప్రాణాలు.. మన విలువలు ఏమయ్యాయి?

### సోషల్ మీడియా స్టేటస్ కంటే జీవితం విలువైనది

మహారాష్ట్ర ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో జరిగిన సంఘటన మనందరినీ కలిచివేసింది. 19 ఏళ్ల కునాల్ చాంద్‌గుడే జువీ× కట్టడానికి డబ్బు అడిగాడు. తండ్రి కాదనడంతో కొండెక్కి బెదిరించాడు. కాపాడేందుకు వెళ్లిన తండ్రి మురళీధర్, కన్నీరు పెట్టుకున్న తల్లి సంగీత – ముగ్గురూ లోయలోకి దూకి ప్రాణాలు



కారణం ఏంటి? ఒక ఐఫోన్ 15 ప్రో.
సమస్య ఎక్కడుంది?
స్టేటస్ సిండ్రోమ్: ఇన్‌స్టా, యూట్యూబ్ లో "ఐఫోన్ ఉంటేనే గొప్ప" అనే భ్రమ. లేకపోతే సమాజంలో తల ఎత్తుకోలేమనే భయం...
ఓపిక లేని తరం: "ఇప్పుడే కావాలి". వేచి ఉండి, కష్టపడి సంపాదించాలనే ఆలోచన లేదు.
కుటుంబ సంభాషణ లోపం: పిల్లలు కోపంలో ఉంటే వినేవారు లేరు. తల్లిదండ్రులు "కాదు" అని చెప్పినా ఎందుకు అని అర్థం చేసుకోవడం లేదు.

జువీ× సంస్కృతి: లేని డబ్బుతో ఉన్నట్టు చూపించే మాయాజాలం. రుణం పేరుతో లగ్జరీని అవసరంగా మార్చేస్తున్నాం

పరిష్కారం ఏంటి?... పిల్లలకు చెప్పాలి: ఒక బ్రాండ్, ఒక ఫోన్ నీ విలువను నిర్ణయించవు. నీ ప్రవర్తన, నీ జ్ఞానం, నీ కష్టమే నిన్ను గొప్పగా చేస్తాయి.

తల్లిదండ్రులకు విజ్ఞప్తి: పిల్లల కోరికలు తీర్చలేకపోతే కోపగించుకోకండి. కూర్చుని ప్రేమగా మాట్లాడండి. "మన పరిస్థితి ఇది, కలిసి దీన్ని సాధిద్దాం" అని భరోసా ఇవ్వండి.
పాఠశాలలు, కళాశాలలకు: ఫైనాన్షియల్ లిటరసీ, మెంటల్ హెల్త్ క్లాసులు తప్పనిసరి చేయాలి.


సమాజంగా మన బాధ్యత...
లైక్‌ల కోసం లగ్జరీని ప్రమోట్ చేయడం ఆపాలి. సాదా జీవితాన్ని గౌరవించడం నేర్చుకోవాలి. కునాల్ కుటుంబం తిరిగి రాదు. కానీ వారి మరణం వృధా కాకూడదు. గుర్తుంచుకోండి – ఫోన్ పాడైతే కొత్తది వస్తుంది. ప్రాణం పోతే తిరిగి రాదు. మన పిల్లలకు ఐఫోన్ కంటే ముందు "జీవితం" విలువ నేర్పుదాం.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**వ్యాసకర్త**
**9440287170.**



# సాహితీ వాచస్పతి దాశరథి

## ఆగస్టు 24... దాశరథి రంగాచార్య జయంతి



తెలుగు జాతి గర్వించదగిన సాహితీవేత్త దాశరథి రంగాచార్య. అయన చేసిన బహుముఖ రచనలు అనన్య సామాన్యాలు. అసాధారణ మేథో సంపత్తికి ప్రతిరూపాలు. రంగాచార్య రచనల్లో తెలంగాణదనం నిండుగా పరుచుకొని ఉంటుంది. ప్రగతి శీల భావం ఉప్పొంగుతుంది. వేద విజ్ఞానం ఆధ్యాత్మికతను తట్టి లేపుతుంది. తెలంగాణ గ్రామీణ జన జీవనం సాక్షాత్కారిస్తుంది. అందుకే తెలంగాణ ప్రజలు, పోరాట యోధులు, తీవ్రవాదులు, పీడిత తాడిత ప్రజలు, నిరంకుశ పాలన బాధితులు, చరిత్రకారులు, చివరకు భాగవతోత్తములు... ఒక్కొక్కరికీ ఒక్కొక్క రీతిలో ఆత్మీయ రచయితగా నిలిచారు.

ఆయన రచయిత, జీవిత చరిత్రకారుడు మాత్రమే కాదు. తెలుగు, సంస్కృతం, ద్రావిడం, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో గొప్ప పండితుడు, కవి, విమర్శకులు, నాటకకర్త. గొప్ప వక్త. ఏ అంశాన్నైనా అలవోకగా అవలీలగా వీనులకు ఇంపుగా చెప్పగలిగిన వ్యాఖ్యాత. తొలితరం ఉద్యమ రచయిత, తెలంగాణ అజ్ఞాత సాయుధ పోరాట యోధుడు.

దాశరథి రంగాచార్యులు 1928, ఆగస్టు 24 న నాటి మహబూబా బాదు జిల్లా, చిన్నగూడూర్ మండలం, చిన్నగూడూర్ లో విద్వాన్ వెంకటాచర్య– శ్రీమతి వెంకటమ్మ దంపతులకు జన్మించారు. పుట్టింది పండిత కుటుంబమే అయినా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు దాశరథి. ఆయన అగ్రజుడు దాశరథి కృష్ణమాచార్యుల నుండి అభ్యుదయ, విప్లవ భావాలను అలవర్చుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఇద్దరూ కలిసి పనిచేశారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా పోరాడారు. తెలంగాణ ఉద్యమ జీవితాన్ని సాహిత్య రూపంలో ప్రజలకు అందించారు రంగాచార్య. తెలంగాణ చరిత్ర, ఉద్యమాలు, ప్రజల జీవితం, సాహిత్యం, సంస్కృతి.. ఇలా తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలను రచనల్లో స్పృశించిన సాటిలేని మేటి రచయిత ఆయన.


ఆయన రచనల్లో పార్శ్వం...

మూడు కావ్యేతిహాసాలను -- శ్రీమద్రామాయణము, శ్రీమదాంధ్ర మహాభారతము, శ్రీమద్భాగ వతము, వేదాలు -- ఋగ్వేదము, కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము ఒకే ఒక్కరుగా సంస్కృతం నుంచి వ్యాఖ్యాన సహితంగా ప్రతికృతి చేసిన ఏకైక రచయిత దాశరథి. ఆరవ తరగతి చదువుతున్నప్పుడే తోటి విద్యార్థులను కూడగట్టి నిజాంకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. నిజాం రాజ్యం ఆచంద్రార్కం నిలిచి ఉండాలని పాఠశాలల్లో చేసే ప్రార్థన, తాను చేయడానికి రంగాచార్య నిరాకరించి, నిబంధన మేరకు వారి లాగే కుచ్చు రూమీ టోపీ ధరించడానికి తిరస్కరించి బడి నుండి బహిష్కృతులు అయినారు. ఎక్కడా చదువు కాకుండా నిజాం ప్రభుత్వం ఫర్మానా జారీ చేసింది కూడా.

పోలీసు నిర్బంధం, చిత్రహింసల నుంచి తప్పించుకుని అజ్ఞాతంలోకి వెళ్ళి నిజాం వ్యతిరేక పోరాటం క్రియాశీలంగా జరిపారు. తర్వాత నిజాం ప్రభుత్వం వారంటు జారీ చేసినా, రంగాచార్య జాడ కనుక్కోలేక పోయింది. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్లు రైతు కూలీలకు ఉద్యమ బోధ చేసేవారు.

తొలి నవల 'చిల్లరదేవుళ్లు'ను 1969లో వెలువరించారు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్లు' 1938కి పూర్వపు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942–48 సంవత్సరాల మధ్య కాలాన్ని 'మోదుగు పూలు' నవల వర్ణిస్తుంది.

చిల్లరదేవుళ్లు', 'మోదుగు పూలు' వంటి నవల్లో తెలంగాణ పలుకుబడులను -- నుడికారాన్ని పలికించారు. స్వాతంత్ర్యం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలో చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010 సంవత్సరంలో వెలువరించారు. 1994లో హరివంశ సహిత 'మహా భారతం' రచించారు. 1940ల్లో కోల్ కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల 'సవ ఖ్షష్ట్రశీ తీఱఙసవం ా ీఅస్త్రవతీ'ను 'దేవుని పేరిట' పేరుతో తెలుగులో అనువదించారు. తొలినాళ్ళలో రంగాచార్య పిల్లలకోసం 'వివేకనందుడు', 'మహాత్ముడు', 'కాళిదాసు' అనే మూడు నాటకాలు రచించారు. 1974లో 'శ్రీ వేంకటేశ్వర లీలలు' రచించారు.




వేదాలు సామాన్యుడికి సైతం అందించాలనే ఆలోచనతో 70 ఏళ్ళ వయస్సులో బృహత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. విస్తృత సాహిత్యాన్ని సరళమైన తెలుగులోకి తేవడం, ముద్రణ, పంపిణీ, వ్యాప్తి కళ్ళార చూడడం రంగాచార్య చేసిన శ్రమఫలం, చేసుకున్న అదృష్టం. ఒక జీవితకాలంలో ఇంత చేసినవారు, ఎదిగినవారు మరొకరులేరు.

తెలంగాణ జీవితాన్ని లోకానికి తెలియ జెప్పాలనే చారిత్రక దృష్టితో, దృఢ సంక్పంతో, తెలంగాణ మీద అభిమానంతో, అందమైన శైలిలో రచనా వ్యాసంగాన్ని ఆయన సాగించారు.

1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో చేరి, ఉద్యోగం చేస్తూనే బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. 32 సంవత్సరాల పాటు పనిచే చేసి, 1988లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేశారు.

రంగాచార్య 2015 జూన్ 8వ తేదీన కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

ప్రభాతవన సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
24-8-2026

## బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు బిగ్ షాక్..



- ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు
- ప్రతి కష్టంలో తోడుంటా,ప్రతి ఒక్కరికి అండగా ఉంటా
- సంక్షేమ పథకాలను ఇంటింటికి చేరవేయాలి

**జమ్మికుంట, ఆగస్టు 23 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం నుండి పెద్ద ఎత్తున బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్. అనంతరం వారు మాట్లాడుతూ ఒకవైపు సంక్షేమ పథకాలు,మరొకవైపు అభివృద్ధి రెండు సమపాళ్ళలో ప్రభుత్వం అందిస్తుందని,నియోజవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అభివృద్ధి ప్రజలకు ఇంచార్జి గా ప్రణవ్ బలంగా తీసుకువెళు న్నారని వారి ఆధ్వర్యంలో పని చేయడానికి ముందుకు వచ్చామని తెలిపారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు స్థానిక నాయకులతో కలిసి ప్రజలకు చేరవేస్తామని,మరిన్ని నిధులు తీసుకొచ్చి హుజురాబాద్ అభివృద్ధికి తోడ్పడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు సదానందం,మండల అధ్యక్షుడు పరశురామ రావు,గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్,యాదవ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్,డివైసి సెక్రటరీ సజ్జు,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాగర్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్,వార్డు సభ్యులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వారసంత పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట, ఆగస్టు 23 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలో ప్రతి మంగళవారం జరిగే వారసంతను కొండూరు కాంప్లెక్స్ నుండి పాత వ్యవసాయ మార్కెట్ సమీపంలో మార్చడం జరిగిందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్అన్నారు. ఈ సందర్భంగా పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డు సమీపంలో జరుగుతున్న పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో ప్రతి మంగళ వారం జరిగే వారసంత వల్ల కొండూరీ కాంప్లెక్స్ లో పాఠశాలలు హాస్పిటల్స్ బొమ్మల గుడి ప్రాంతంలో వర్షం వల్ల భురదమయం అవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ సమావేశంలో అంగడి కొండూరీ కాంప్లెక్స్ నుండి పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డు నుండి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వరకు మార్చడం జరిగిందని దీనికోసం అవసరమైన లైటింగ్, పారిశుద్ధం,చెట్ల కొమ్మల తొలగింపు చేసి అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు . జమ్మికుంట పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు గ్రహించి సహకరించాలని కోరారు. ఈ పరిశీలనలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్, బోళ్ళ సదానందం, కొలుగురి కిరణ్, మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన హైడాటిడ్ సిస్ట్ శస్త్రచికిత్స విజయవంతం

### ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం





**జమ్మికుంట, ఆగస్టు 23 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలో అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సను ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జనరల్ సర్జన్ డాక్టర్ మహిపాల్ విజయవంతంగా నిర్వహించారు. సిరిసేడు గ్రామానికి చెందిన 70 ఏళ్ల రైతు 16 సంవత్సరాల క్రితం హనుమకొండలోని ప్రముఖ ఆసుపత్రిలో కాలేయంలోని హైడాటిడ్ సిస్ట్‌ల తొలగింపునకు లాపరోటమీ శస్త్రచికిత్స చేయించుకున్నారు. అయితే ప్రస్తుతం ఆయనకు కాలేయంతో పాటు పొత్తికడుపులోని పెరిటోనియం ప్రాంతానికి కూడా హైడాటిడ్ వ్యాధి విస్తరించింది. ఆపరేషన్ చేయడానికి దాదాపు 8 ఆసుపత్రులు నిరాకరించడంతో, రోగి కుటుంబ సభ్యులు పలు ఆసుపత్రులను సంప్రదించిన అనంతరం చివరకు జమ్మికుంటలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆశ్రయించారు. రోగిని పరీక్షించిన డాక్టర్ మహిపాల్, కాలేయంలో సుమారు 12 హైడాటిడ్ పరాన్నజీవి తిత్తులు ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఎక్స్‌ప్లోరేటరీ లాపరోటమీ ద్వారా శస్త్రచికిత్స చేయాలని తెలిపారు. శస్త్రచికిత్స సమయంలో కాలేయం మరియు పొత్తికడుపు ప్రాంతంలో ఉన్న హైడాటిడ్ తిత్తులను, వాటి గోడలను జాగ్రత్తగా తొలగించారు. తిత్తుల్లోని పరాన్నజీవులు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేకమైన స్కోలిసైడల్ ఏజెంట్ ఉపయోగించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో డాక్టర్ మహిపాల్ తన అనుభవాన్ని ఉపయోగించి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. అతి తక్కువ స్థాయిలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అందించడం పట్ల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్లిష్టమైన అరుదైన శస్త్రచికిత్సలను అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

## కరీంనగర్‌కు చేరుకున్న గురు రవిదాస్ పవిత్ర మట్టి కలశం

సమరసత సంకల్ప్ అభియాన్‌లో భాగంగా

కలశ వందనం, సంత్ సంపర్క్ కార్యక్రమాలు



**కరీంనగర్, ఆగస్టు 23(సింగిడి):** సంత్ శిరోమణి శ్రీ గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సమరసత సంకల్ప్ అభియాన్‌లో భాగంగా పవిత్ర మట్టి కలశం ఆదివారం కరీంనగర్‌కు చేరుకుంది. గురు రవిదాస్ మహారాజ్ జన్మస్థలమైన సీర్ గోవర్ధన్‌పూర్ నుంచి తీసుకువచ్చిన కలశాన్ని హైదరాబాద్ నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో కరీంనగర్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ, సమాజంలో సమరసత భావనను పెంపొందించడమే అభియాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో కలశ వందనం, స్థానిక ఆలయాల్లో సమరసత కార్యక్రమాలు, సంత్ సంపర్క్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- జీవో 97ను రద్దు చేయాల్సిందే..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కమలాకర్



**కరీంనగర్, ఆగస్టు 23(సింగిడి):** పాలిటెక్నిక్ విద్యా విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. జీవో రద్దయ్యే వరకు విద్యార్థుల తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మోడల్ గురుకుల పాలిటెక్నిక్ మహిళా కళాశాలను సందర్శించిన గంగుల కమలాకర్ విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొత్త విధానం అమలైతే తమ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంటుందని, ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి కీలకమైన ఈసెట్ రాసే అవకాశం కోల్పోతామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరి మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. సాంకేతిక విద్యా విధానాన్ని బలహీనపరిచి కొత్త విధానాన్ని తీసుకు రావడం ద్వారా పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందని విమర్శించారు. పాలిటెక్నిక్ కళాశాలల ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో 97ను ప్రభుత్వం బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని, జీవో రద్దయ్యే వరకు విద్యార్థుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, శాతవాహన విశ్వవిద్యాలయ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, నాయకులు గంగాధర చందు, మొగిలోజు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు పూర్తయితే ఆడబిడ్డ ఇంటికి కొత్త వెలుగు

పేదింటి గృహప్రవేశానికి 'వెలిచాల' కానుక

గృహప్రవేశం చేసుకునే కుటుంబాలకు పొయ్యి లేదా పాత్రల సెట్ అందజేస్తా..

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు



**కరీంనగర్, ఆగస్టు 23(సింగిడి):** ఇందిరమ్మ ఇల్లు పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసుకునే ప్రతి ఆడబిడ్డ కుటుంబానికి తనవంతు కానుకగా విద్యుత్ పొయ్యి లేదా పాత్రల సెట్ అందజేస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి నుంచి ఆదివారం ప్రారంభించారు. చామనపల్లికి చెందిన పల్లె జగదీష్--శిరీష దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేందర్‌రావు, నూతన గృహంలోకి అడుగుపెడుతున్న దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. తొలి కార్యక్రమంగా వారికి విద్యుత్ పొయ్యితో పాటు పాత్రల సెట్‌ను అందజేశారు. పేద కుటుంబానికి సొంతిల్లు భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్‌కు భరోసానిస్తుందని అన్నారు.

**పేదల సొంతింటి కలకు ప్రభుత్వ భరోసా..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని రాజేందర్‌రావు తెలిపారు. మొదటి విడతలో నాలుగు లక్షల ఇళ్లకు, రెండో విడతలో మరో రెండు లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యేలా తనవంతు కృషి చేస్తానన్నారు. రేకుల షెడ్లు లేదా గోడల వరకు నిర్మించుకుని ఉన్న అర్హులైన కుటుంబాలకు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు ఆర్థిక సహాయం అందే అవకాశం ఉందని తెలిపారు. ఇరుకుల్ల గ్రామంలో విజయలక్ష్మి--రామ్‌రెడ్డి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి రాజేందర్‌రావు భూమిపూజ చేశారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నెలలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని, బిల్లులు సకాలంలో అందేలా అధికారులతో సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కురుమ సంఘం సభ్యులతో కలిసి బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. చామనపల్లిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న రాజేందర్‌రావు, సంఘ భవన నిర్మాణానికి సహకరిస్తానని, ప్రభుత్వ పరంగా అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. గౌడ సంఘం కార్యక్రమంలోనూ పాల్గొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, చామనపల్లి సర్పంచ్ బోగొండ ఐలయ్య, కార్పొరేటర్ గుమ్మడి రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

పెగడపల్లిలో డ్రగ్స్, సైబర్ మోసాలపై అవగాహన

ఎస్సై రమేష్





**మహాముత్తారం, ఆగస్టు 23 (సింగిడి):** రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడంతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ సూచించారు. ఆదివారం పెగడపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్ఐ సూచించారు. మద్యం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి, యువత వాటికి దూరంగా ఉండాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. వాహనాల తనిఖీలు.. జరిమానాలు అవగాహన కార్యక్రమం అనంతరం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు.

**25 లీటర్ల గుడుంబా స్వాధీనం**

అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 25 లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం తయారు చేయడం, విక్రయించడం, రవాణా చేయడాన్ని ఉపేక్షించబోమని ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. అక్రమ మద్యం కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## ఎమ్మార్పీఎస్ వికారాబాద్ మండల కమిటీ అధ్యక్షుడిగా నాగారం ప్రవీణ్

ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా ఆర్,చరణ్ మాదిగ ఎన్నిక



**వికారాబాద్, ఆగస్టు 23(సింగిడి):** ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీలను ఎన్నుకున్నారు. అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దామని కంకణ బద్దులై సాగాలని ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో నూతన తరాన్ని ప్రోత్సహించే ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇంచార్జి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ,జిల్లా మాజీ అధ్యక్షుడు కొడిగంటి మల్లికార్జున్ మాదిగ, వికారాబాద్ మండల ఇంచార్జి చిట్టి గిద్ద కిష్టయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వికారాబాద్ మండల కమిటి ఎన్నిక సమావేశం నిర్వహించారు. మండల కమిటి అధ్యక్షుడిగా ప్రవీణ్ మాదిగ,అధికార ప్రతినిధి మాదిగ, నాగారం అరుణ్ మాదిగ ప్రధాన కార్యదర్శులు ఆర్, బాలు మాదిగ, ఉపాధ్యక్షులుగా విక్రమ్ మాదిగ, మాదిగ, అశోక్ మాదిగ కోశాధికారి పి,రమేష్ మాదిగ, కార్యదర్శిలు కె, పోషయ్య మాదిగ, కార్తీక్ మాదిగ, శ్రీకాంత్ మాదిగ,సహాయ కార్యదర్శిలు ఆనంద్ మాదిగ, ఎం ఎస్ ఎఫ్ స్టూడెంట్ ఫెడరేషన్ వికారాబాద్ మండల అధ్యక్షుడిగా ఆర్, చరణ్ మాదిగ, అధికార ప్రతినిధిగా పవన్ కుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ మాదిగ, ప్రధాన కార్యదర్శిలు మహేందర్ మాదిగ, ఆర్,అరుణ్ మాదిగ, కార్యదర్శిగా సంతోష్ మాదిగ, అనంతరం ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా ఇంచార్జి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ,మరియు మాజీ జిల్లా కొడిగంటి మల్లికార్జున్ మాదిగ, రవి మాదిగ, మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వర్గీకరణ ఫలాలు అందుకోవాలి సూచించారు, మాదిగ జాతి అన్ని రంగాల్లో ముందుకు తేవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణమాదిగ గారు 32సం" రాలుగా అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఎమ్మార్పీఎస్ లక్ష్యం అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమేనని అన్నారు. మాదిగ జాతి హక్కులు కోసం ఆత్మగౌరం కోసం, శ్రమిస్తున్నామని ఆయన ఉద్యమానికి మద్దతుగా వికారాబాద్ మండలం నుంచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. అదేవిధంగా సెప్టెంబర్ 9న వరంగల్ వేదికగా ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గానికై నియామక పత్రాన్ని అందించారు. అనంతరం నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని వర్గాలకు అండగా ఉండాలని కమిటి సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా నాయకురాలు పుష్ప రాణి మాదిగ, పద్మమ్మ,జిల్లా సీనియర్ నాయకులు గుట్టకింది రవి కుమార్ మాదిగ, యేసు మాదిగ,సుధాకర్ మాదిగ,శేఖర్ మాదిగ, ప్రసాద్ మాదిగ, శ్రీను మాదిగ, రాంచందర్ మాదిగ, సుధాకర్ మాదిగ,వి హెచ్ పి ఎస్ నాయకులు రాజు మాదిగ, నవీన్ కుమార్ మాదిగ, రమేష్ మాదిగ, బందయ్యా మాదిగ, రామచంద్రి, వికాస్ మాదిగ, భాను ప్రసాద్, నంది కిశోర్, జైదుపల్లి యాదయ్య, కృష్ణ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## వీరయ్యను పరామర్శించిన మంత్రి రాజనర్సింహ



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 23 (సింగిడి):** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గంలోని చౌటకూరు మండల కేంద్రంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు వీరయ్యను పరామర్శించారు. వీరయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరయ్య కుమారుడు మునిపల్లి మండల తాహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాహసిల్దారుగా మర్రి ప్రదీప్ గారు విధులు నిర్వహిస్తున్నారు. వారి తండ్రిగారైన వీరయ్య గారిని మంత్రి పరామర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## నేత్ర దాత కిరణ్ చూపు సజీవం

### నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు



**జమ్మికుంట, ఆగస్టు 23 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శాలవాడకు చెందిన బూరుగుపల్లి కిరణ్ (45) మరణం చెందగా, ఆయన కుటుంబ సభ్యులు చూపిన ఉదారత ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపింది. శనివారం కిరణ్ మరణించిన విషయం తెలుసుకున్న సదాశయ ఫౌండేషన్ జమ్మికుంట ప్రతినిధి డాక్టర్ క్యాతం రవి.. మృతుని కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ ప్రతినిధుల సూచనతో కిరణ్ భార్య శారద, కుమారుడు వివేక్, కుమార్తె రాజహర్షిని నేత్రదానానికి సంపూర్ణ సమ్మతి తెలిపారు. వెంటనే స్పందించిన సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ టెక్నీషియన్ రాజేంద్ర ప్రసాద్ సహాయంతో కార్నియాలను సేకరించి, భద్రపరచి హైదరాబాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. పరమపదించిన వేళలోనూ నేత్రదానం చేసి సామాజిక స్ఫూర్తిగా నిలిచిన మృతుడి భార్య శారద కుమారుడు వివేక్ కూతురు రాజా హర్షిని తోపాటు రవి సమ్మయ్య రాము సదానందం లను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు,అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారు రమేష్, జిల్లా అధ్యక్షుడు నరహరి, డీలర్ వెంకన్న తదితరులు అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థుల భద్రతతో చెలగాటమా?

మల్లారెడ్డి విద్యాసంస్థలపై సమగ్ర విచారణ జరపాలి

దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్



**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 23 (సింగిడి):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన కళాశాల ప్రాంగణాన్ని సినిమా ప్రమోషన్ కార్యక్రమాలకు వేదికగా మార్చడం సిగ్గుచేటని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ తీవ్రంగా విమర్శించారు. ఆదివారం రోజున జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 22న మల్లారెడ్డి విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన టాక్సిక్ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో తొక్కిసలాట జరిగి ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో, కార్యక్రమానికి అనుమతులు ఉన్నాయా? విద్యార్థుల భద్రతకు సరైన ఏర్పాట్లు చేశారా? అనే అంశాలపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాలేజీ అంటే చదువుకునే ప్రదేశం.. సినిమా ప్రమోషన్ల కోసం వేలాది మందిని సమీకరించే అడ్డా కాదు. వేరే వేదికలో అనుమతులు తీసుకుని కార్యక్రమం నిర్వహించుకోలేక విద్యార్థులు చదువుకునే కాలేజీని ఎంచుకోవడం సిగ్గుచేటు అని ఆయన ఘాటుగా విమర్శించారు. జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిది? విద్యార్థుల భద్రతకు ఎవరు సమాధానం చెబుతారు? అని ప్రశ్నించిన ఆయన, నిబంధనలు ఉల్లంఘించినట్లు విచారణలో తేలితే మల్లారెడ్డి విద్యాసంస్థల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగుూ ఓ నిజం
Singidi
సోమవారం
24-8-2026

# రూ.530 కోట్లతో శాశ్వత నీటి సమస్యకు పరిష్కారం

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**హన్మకొండ, ఆగస్టు 23(సింగిడి):** వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అభివృద్ధి పనులతోనే ప్రజల ముందుకు వెళ్తామని, పనులు చేసి ఓటు అడుగుతామని స్పష్టం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 49వ డివిజన్‌లో లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత రెండున్నరేళ్లలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గతంలో ఒక డివిజన్‌కు రూ.50 లక్షలు కేటాయించడం గొప్పగా చెప్పుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఒక్కో డివిజన్‌కు రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. శాయంపేట ప్రాంతానికి సుమారు రూ.20 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని, నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. వరంగల్ నగరానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను తీసుకురావడం తన ప్రధాన లక్ష్యాల్లో ఒకటని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కోరిన మేరకు నగరానికి భారీ వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు మంజూరైందని, ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా డ్రైనేజీ పైప్‌లైన్లు, నీటి పైప్‌లైన్లు, సెంట్రల్ లైటింగ్ తదితర మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భారీ ప్రాజెక్టు కావడంతో పనులు పూర్తయ్యేందుకు కొంత సమయం పడుతుందని, అనంతరం నగరానికి శాశ్వతమైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రస్తుతం కొత్తగా శాశ్వత రోడ్లు నిర్మించి, కొద్దికాలానికే వాటిని తవ్వాల్సిన పరిస్థితి రాకుండా ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఇప్పుడు రోడ్లు వేస్తే కొన్ని నెలల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం మళ్లీ తవ్వాల్సి వస్తుందని అందుకు ప్రాజెక్టు పూర్తయ్యాక రోడ్లు, డ్రైనేజీలు, పైప్‌లైన్లు అన్నీ సమగ్రంగా, అత్యాధునిక విధానంలో ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. వరంగల్ నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.530 కోట్లతో చేపడుతున్న పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే తెలిపారు. నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ పాత కాలంలో నిర్మించిన నీటి సిస్టం వ్యవస్థలను ఆధునీకరించడంతో పాటు, అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. తాగునీరు ప్రజలకు అత్యవసరమైన అంశమని, దీనికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కాలనీ పెద్దలు, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపుతామని చెప్పారు.

ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వన మహోత్సవ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దాని బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేందుకు నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం అభినందనీయమన్నారు. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను నాటడం సంతోషకరమన్నారు. మొక్కలను నాటి వదిలేయకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నగర అభివృద్ధిలో ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన



**మిర్యాలగూడ ఆగస్టు 23(సింగిడి):** ఆత్మ ఆధ్వర్యంలో ఆర్ బి ఎల్ ఆధారిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పల్లోజు వినోద్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కె. జగదీశ్వర్ రెడ్డి, కెవికే శాస్త్రవేత్త రామలక్ష్మ, మండల వ్యవసాయ అధికారి ఎం. రుషేంద్రమని పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడకుండా ప్రకృతి సిద్ధమైన వనరులను వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. జీవామృతం, వివిధ కషాయాలు వంటి దేశీయ పద్ధతులను వినియోగించడం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం వినియోగం, భూమి ఆరోగ్య పరిరక్షణ, తక్కువ పెట్టుబడితో సాగు, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తుల సాధన ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. అలాగే మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా కంది, పెసర, మినుములు, నువ్వులు, జొన్న, సజ్జ, ఆముదం వంటి పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ శ్రీ బ్రహ్మానందరెడ్డి, కిసాన్ జిల్లా అధ్యక్షులు శ్రీ మురిరెడ్డి నర్సిరెడ్డి, బిటం గిరి, ఏఈవో లు అశ్విన్, నాగయ్య, అలగడప సర్పంచ్ శ్రీమతి ఇంద్రపల్లి కుమారి, ఇంద్రపల్లి శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, రైతులు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 27న ధర్నాలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 23 (సింగిడి):** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీజేఏసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ. లింగారెడ్డి తెలిపారు. ధర్నాలను విజయవంతం చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన టీటీఎఫ్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నాలుగు దశల పోరాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మూడో దశలో ఈ నెల 27న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ధర్నాలకు ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రస్థాయిలో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో అన్ని వర్గాలను కలుపుకుని పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కాబట్టి ఈ నెల 27న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ధర్నాలకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని లింగారెడ్డి కోరారు. సమావేశంలో టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్. అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాస్‌రెడ్డి, బి. తిరుపతిరెడ్డి, వీరేశం, భోజ నాయక్, వీరన్న, ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శనం, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థి వరుణ్ సాయికి హైజంప్‌లో స్వర్ణ పతకం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



**చిలుకూరు ఆగస్టు 23(సింగిడి):** చిలుకూరు మండల కేంద్రం లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో చదువుతున్న 7వ తరగతి విద్యార్థి, యు. వరుణ్ సాయి అండర్-14 విభాగంలో హైజంప్‌లో స్వర్ణ పతకం సాధించి ప్రతిభ చాటాడు. 12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ (బాలుర బాలికలు) -- సౌత్ జోన్ పోటీలకు సెలెక్షన్‌లో జిల్లా స్థాయి ఎంపికల్లో వరుణ్ సాయి అద్భుత ప్రతిభ కనబరిచి హైజంప్‌లో ప్రథమ స్థానాన్ని సాధించినందుకు యు. వరుణ్ సాయి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సూర్యాపేట జిల్లా తరఫున ఎంపికయ్యాడు. విద్యార్థి సాధించిన ఈ ఘన విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ వీరయ్య, పీఈటీ బ్రహ్మచారి, పీఈటీలు రాజ్ కుమార్, మల్లయ్య, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# నూతన క్రీడా అధికారులకు ఘన సన్మానం

● క్రీడారంగంలో యాదాద్రి భువనగిరి జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి : అధికారులు



**ఆలేరు, ఆగస్టు 23(సింగిడి):** యాదాద్రి భువనగిరి జిల్లా నూతన జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టిన కె ధనంజేయులు, 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ' జిల్లా నూతన నోడల్ అధికారిగా నియమితులైన పొన్నగాని కృష్ణమూర్తి గౌడ్ లను ఎస్ఎఫ్‌ఐ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి చెన్న రాజేశ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె ధనంజేయులు మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులను క్రీడల పరంగా అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తామన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాను క్రీడా రంగంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సమష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు. నూతన నోడల్ అధికారి పొన్నగాని కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడలు, శారీరక విద్యను మరింత ప్రాధాన్యత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ముఖ్యంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ విద్యార్థులు క్రీడల వైపు ఆసక్తి చూపేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చెన్న రాజేశ్ మాట్లాడుతూ నూతన అధికారుల నేతృత్వంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో క్రీడారంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లాలోని క్రీడాకారులు, విద్యార్థులకు మెరుగైన శిక్షణ, అవకాశాలు అందించడంతో పాటు ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు క్రీడాభిమానులు, విద్యార్థులు, యువజన ప్రతినిధులు పాల్గొని నూతన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు



**మిర్యాలగూడ, ఆగస్టు 23(సింగిడి):** యాద్గార్ పల్లి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. రాఘవ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కంచర్ల లక్ష్మి జ్ఞాపకార్థం వాటర్ ప్లాంట్‌ను పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించడం అభినందనీయమని, విద్యార్థుల ఆరోగ్యం, పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఆదర్శప్రాయమని అన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన దాత గార్లపాటి శేఖర్ రెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావూరి బాలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల దాతలు చూపుతున్న శ్రద్ధను పాఠశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పెద్దలు శ్రీ గాయం ఉపేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, దాతలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లావూరి బాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు 23(సింగిడి):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల సముదాయ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ఘన్‌పూర్ మండలం మైలారం గ్రామంలో నిర్మిస్తున్న పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల నిర్మాణ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నాలుగు అకాడమిక్ బ్లాకులు, సీనియర్, జూనియర్ డార్మిటరీలు, కిచెన్, డైనింగ్ హాల్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణ ప్రణాళికను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ఫుటింగ్ లెవెల్, బేస్ కాంక్రీట్ పనులు పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగవంతం చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడవద్దని కలెక్టర్ ఆదేశించారు. కాంక్రీట్ గోడల నిర్మాణంలో షియర్ వాల్ టెక్నాలజీని వినియోగించి పనులను నాణ్యంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలో చెట్లను తొలగించవద్దని, ఒకవేళ తొలగించాల్సి వస్తే తప్పనిసరిగా అటవీ శాఖ అనుమతులు పొందిన తర్వాతే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో 2640 మంది విద్యార్థులు 300 మంది సిబ్బంది వసతి కల్పించాల్సి ఉందని, అందుకు అవసరమైన నీటి వసతి కల్పించేలా 6 లక్షల లీటర్ల సామర్థ్యం గల అండర్‌గ్రౌండ్ ట్యాంక్, 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణంతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అరుణ్ కుమార్, తహసీల్దార్ రాజేశ్వర రావు, ఏఈ జీవన్, సర్పంచ్ సమ్మయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చేనులో పేలిన బాంబు

మహిళా కూలీకి తీవ్ర గాయాలు

కొడవలితో కదిలించడంతో ఒక్కసారిగా పేలుడు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో ఆగస్టు 23(సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గూడెపల్లిలో చేనులో బాంబు పేలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. చేనులో కూలి పనికి వెళ్లిన మహిళా కొడవలితో భూమిలో ఉన్న వస్తువును కదిలించడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో మహిళా కూలీ తీవ్రంగా గాయపడింది. గూడెపల్లి గ్రామానికి చెందిన మోరె రాజు తన 20 గుంటల భూమిలో మిరప తోట సాగు చేసేందుకు భూమిని దున్నిందాడు. అనంతరం నలుగు ఏరేందుకు ఇద్దరు మహిళా కూలీలను పనికి పిలిచాడు. పనిలో భాగంగా గుండె స్వర్ణలత (34) చేనులో నలుగు ఏరుతుండగా భూమిలో గట్టిగా ఏదో తగిలింది. దానిని కొడవలితో కదిలించడంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో స్వర్ణలత ముఖం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను వరంగల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతోంది.

**బాంబు ఎలా వచ్చింది?**

చేనులో బాంబు పేలడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో నక్సలైట్ల సంచారం ఉన్న నేపథ్యంలో అప్పట్లో నాటిన బాంబు మిగిలిపోయిందా? అనే కోణంలో చర్చ జరుగుతోంది. మరోవైపు భూ వివాదాల నేపథ్యంలో భూమి యజమాని కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ఎవరైనా బాంబు పెట్టారా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**పోలీసుల దర్యాప్తు**

ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు గూడెపల్లి చేనుకు చేరుకుని పరిశీలించారు. పేలిన బాంబు ఏ రకానికి చెందినది? ఎంతకాలం క్రితం అక్కడ పెట్టారు? అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో మరేదైనా పేలుడు పదార్థాలు ఉన్నాయా అనే కోణంలో తనిఖీలు చేపట్టారు. ఘటనకు గల కారణాలను నిర్ధారించేందుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డి-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు 23(సింగిడి):** జాతీయ మాదకద్రవ్యాల నిరోధక ప్రణాళిక పథకం కింద జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డి-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన స్వచ్ఛంద సంస్థల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భారత ప్రభుత్వం, సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ (డ్రగ్స్ ప్రివెన్షన్ డివిజన్) ఉత్తర్వుల ప్రకారం దేశవ్యాప్తంగా గుర్తించబడిన 315 గ్యాప్ జిల్లాలలో 'నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్' పథకం కింద జిల్లా డి-అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన స్వచ్ఛంద సంస్థల నుండి 'ఇ-అనుదాన్' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 17 గ్యాప్ జిల్లాలలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కూడా ఒకటిగా ఎంపిక చేయబడిందని జిల్లాలోని అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రభుత్వేతర సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు చేసే సంస్థలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ (ఎం.ఓ.ఎస్.జె.ఈ) లేదా రాష్ట్ర ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న ఇంటిగ్రేటెడ్ రిహాబిలిటేషన్ సెంటర్స్ ఫర్ అడిక్ట్స్ డి-అడిక్షన్ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు లేదా ప్రైవేట్ డి-అడిక్షన్ కేంద్రాలు, గత 2 సంవత్సరాలుగా లేదా అంతకంటే ఎక్కువ కాలంగా అదే రంగంలో నిర్వహిస్తున్న అనుభవం కలిగి ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రముఖ సామాజిక సంస్థల నుండి పట్టభద్రులైన యువ నిపుణులతో కూడిన స్టార్టప్ సంస్థలు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని అయితే వారు డ్రగ్ డి-అడిక్షన్ ట్రీట్మెంట్ రంగంలో కనీసం 2 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. 15 మంది రోగుల సామర్థ్యం కోసం చిన్న పట్టణాలు మరియు గ్రామాలలో 4,000 చదరపు అడుగులు, మెట్రో నగరాలలో 3,000 చదరపు అడుగుల స్థలం కలిగి ఉండాలని 30 మంది రోగుల సామర్థ్యం కోసం చిన్న పట్టణాలు మరియు గ్రామాలలో 5,000 చదరపు అడుగులు, మెట్రో నగరాలలో 4,000 చదరపు అడుగుల స్థలం కేటాయించాల్సి ఉంటుందన్నారు. సంస్థల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, మెమోరాండం ఆఫ్ అసోసియేషన్, గత 2 సంవత్సరాల ఆడిట్ నివేదిక మరియు వార్షిక నివేదికలను ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు విధిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన సంస్థలు కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ యొక్క ఇ-అనుదాన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హతగల సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# మరిపెడ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మికంగా తనిఖీ

● మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి



**దోర్నకల్/మరిపెడ, ఆగస్టు 23(సింగిడి):** మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలోని 4వ వార్డు పరిధిలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలకు చేరుకున్న ఆమె ముందుగా విద్యార్థుల వసతి గృహాలను, భోజనశాలను, స్టోర్ రూమును పరిశీలించారు. విద్యార్థులకు వండుతున్న భోజనాన్ని స్వయంగా తనిఖీ చేసి, వంటల నాణ్యత, పరిశుభ్రత, సరుకుల నిల్వ తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, వసతులు, చదువు విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు, టవల్స్ ను చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ మెరుగు రాము, పాఠశాల హెచ్ఎం లాలు, వార్డెన్ రమేష్, ఉపాధ్యాయులు కృష్ణ, మోతీలాల్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడ, బయ్యారంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



**కాటారం, ఆగస్టు 23(సింగిడి):** మండలంలోని ధన్వాడ, బయ్యారం గ్రామాల్లో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు ధన్వాడలో సర్పంచ్ చిటారి మహేశ్‌గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ధన్వాడ గ్రామపంచాయతీ పరిధిలో 70 రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులతో పాటు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. వేరుగా బయ్యారంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్రహ్మారెడ్డి, ఉప సర్పంచ్ లు తొగర రాజేందర్, శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు జంగిలి రజిత రమేష్, కొండ్ర శివకృష్ణ, ఆకునూరి రాజేశ్వర్, బోలిశెట్టి తిరుపతి, రేషన్ డీలర్ అమర్నాథ్, యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మారగోని శ్రావణ్‌గౌడ్, నాయకులు రాజేశం, శ్రీకాంత్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ వార్డు కమిటీ ఎంపికల సమావేశాలు

2వ వార్డు అధ్యక్షుడిగా బానోత్ భత్రు నాయక్ ఏకగ్రీవ ఎన్నిక



**దోర్నకల్/మరిపెడ, ఆగస్టు 23(సింగిడి):** మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ వార్డు కమిటీల నిర్మాణంలో భాగంగా నిర్వహించిన ఎన్నికల సమావేశాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి వీసారపు శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో 2వ వార్డు అధ్యక్షుడిగా బానోత్ భత్రు నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా వీసారపు శ్రీపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పానుగోతు రాంలాల్, డి సి సి సభ్యుడు కుడితి నరసింహారెడ్డి, ఉండాల ఉపేందర్ ప్రజాపతి, గంధసిరి విక్రమ్, నయ్యర్ సర్వర్, నరేష్, కస్నా నాయక్, వీరన్న, బిక్కు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పవర్‌ఫుల్ డిటాక్స్ డ్రింక్!



ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డిటాక్స్ పానీయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అటువంటి వాటిలో దాల్చినచెక్క, తేనె డిటాక్స్ డ్రింక్ ఒకటి.. దీనిని దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయ రసంతో సులభంగా తయారుచేసుకోవచ్చు. ఈ ఆరోగ్యకరమైన పానీయం శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ మిశ్రమంలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. దాల్చినచెక్క-తేనె డిటాక్స్ డ్రింక్.. యాంటీఆక్సిడెంట్లు (పాలిఫెనాల్స్), సిన్నమాల్డిహైడ్ (దాల్చినచెక్కలో), ఫినోలిక్ సమ్మేళనాల (తేనెలో) గొప్ప మూలం.. ఇది జీవక్రియను మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడం, వాపును తగ్గించడం, బరువు తగ్గడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు.




**దాల్చిన చెక్క తేనె డిటాక్స్ డ్రింక్‌కు కావలసిన పదార్థాలు:**
**దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయ, నీరు..**

**తయారీ విధానం:**

సిన్నమన్ హనీ డిటాక్స్ తయారుచేయడం చాలా సులభం. ముందుగా, ఒక పాత్రలో తగినంత నీటిని తీసుకుని పొయ్యి మీద పెట్టి బాగా మరిగించాలి. నీరు మరిగిన తర్వాత, దానికి తగినంత దాల్చిన చెక్క పొడిని కలపాలి. నీటి పరిమాణం, దాల్చిన చెక్క ఘాటును బట్టి పొడిని సర్దుబాటు చేసుకోవాలి. దాల్చిన చెక్క పొడి వేసిన తర్వాత మరికొద్ది సేపు మరిగించాలి. అప్పుడే దాల్చిన చెక్కలోని పోషకాలు నీటిలో కలుస్తాయి. ఆ తర్వాత ఈ ద్రావణాన్ని ఒక గ్లాసులోకి వడకట్టుకోవాలి. చివరగా, దానికి కొద్దిగా నిమ్మకాయ రసం, ఒక స్పూన్ తేనెను కలిపి బాగా కలుపుకుంటే వేడివేడి సిన్నమన్ హనీ డిటాక్స్ సిద్ధం అవుతుంది. నిమ్మకాయ, తేనె దాల్చిన చెక్క ఘాటైన రుచిని సమతుల్యం చేస్తాయి.

## ఎప్పుడు తీసుకోవాలి?

ఈ డిటాక్స్ పానీయాన్ని ఉదయం పూట తీసుకోవడం ఉత్తమం. చాలా మంది ఉదయం టీ లేదా గ్రీన్ టీ తీసుకుంటారు. దాని స్థానంలో ఈ సిన్నమన్ హనీ డిటాక్స్ ను తీసుకోవచ్చు. డిటాక్స్ డైట్‌లో



ఉన్నప్పుడు, రోజులో అనేక రకాల డిటాక్స్ టీలను ప్రతి రెండు లేదా మూడు గంటలకు ఒకసారి తీసుకోవాల్సి ఉంటుంది.. అందులో ఇది ఒక రకం. డిటాక్స్ సమయంలో పాలు కలిపిన టీలను నివారించాలి. కాబట్టి పాల బదులు నీటితో తయారుచేసిన ఈ డిటాక్స్ పానీయం అనుకూలంగా ఉంటుంది.

దాల్చిన చెక్క కొద్దిగా ఘాటుగా ఉంటుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ లేదా అల్సర్ సమస్యలతో బాధపడేవారు దీనిని తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అల్సర్ తీవ్రతను బట్టి, వారు దీనిని తక్కువ మోతాదులో లేదా అప్పుడప్పుడు (రెండు, మూడు రోజులకు ఒకసారి) తీసుకోవాలి. అల్సర్స్ తీవ్రంగా ఉన్నవారు ఈ పానీయాన్ని పూర్తిగా నివారించడం మంచిది. ఏదేమైనా.. ఏదైనా కొత్త ఆహార పదార్థాన్ని డైట్‌లో చేర్చుకునే

### ఎన్నో పోషకాలు.. మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు..

దాల్చిన చెక్క, తేనె, నిమ్మకాయల కలయిక అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దాల్చిన చెక్కలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడి ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఈ డిటాక్స్ పానీయం శరీరంలోని టాక్సిన్స్‌ను సమర్థవంతంగా తొలగిస్తుంది.. తద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అలాగే, ఇది రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేస్తుంది.. శరీరాన్ని వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడుతుంది.

# రజకుల డిమాండ్ పట్టించుకోకపోతే బండకేసి బాదుతాం.. చాకిరేవులో ముంచుతాం..

**చాకలి కులస్తుల్ని SC జాబితాలో చేర్చాలని డిమాండ్**

**కరెంటు బిల్లుల బకాయిలు ఇవ్వకుంటే.. ఇస్త్రీలు బంద్ పెడతామని కొత్త కొండ శ్రీలక్ష్మి హెచ్చరిక**



**హైదరాబాద్, (సింగిడి):** చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, తమ డిమాండ్ ను విస్మరిస్తే ఈ అధికార కాంగ్రెస్ పార్టీని బండకేసి బాదుతామని, చాకిరేవుల ముంచుతామని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తకొండ శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం ఎల్ బి నగర్, సాగర్ రింగ్ రోడ్డులోని కేకే గార్డెన్స్ లో జరిగిన చాకలి ఎస్సీ సాధన సమితి తొమ్మిదో వార్షికోత్సవ మహాసభలో ఆమె మాట్లాడారు. నేటి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 2016 లో ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు చాకలి కులస్తులకు ఎస్సీ హోదా కల్పించాలని అసెంబ్లీ చేసారని, ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రి గా ఉన్నారని, తమ డిమాండ్ ను నెరవేర్చాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే తమ డిమాండ్ అమలు చేస్తామని కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ గత అసెంబ్లీ ఎన్నికల సభ లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. చాకలి వారి ఆకాంక్ష ను పరిశీలిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పిన నాటి ముఖ్యమంత్రి, ఇప్పుడు ప్రధాన ప్రతిపక్ష ఎతీం నేత కే. చంద్రశేఖర్ రావు ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. తమ ఆశలు, ఆకాంక్ష లను పెడచెవిన పెడితే ఊరురా చాకలి ప్రజల్ని చైతన్యవంతం చేసి ఓటుతో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. 70 ఏళ్లుగా బీసీ జాబితాలో ఉన్నా సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, రాజకీయంగా అత్యంత వెనుకబడి ఉనికి ప్రశ్నర్థకంగా, బతుకు ఆగమయ్యే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే ఉచితంగా కరెంటు ఇస్తున్నామని చెప్పి ఆశ చూపి, వందల కోట్ల రూపాయల మేర పేరుకుపోయిన బకాయిలను చెల్లించలేదని, విద్యుత్ అధికారులు కరెంటు కనెక్షన్ కోత పెట్టారని, వృత్తి దారుల ఇస్త్రీ వృత్తి చేసుకోకుండ చేసారని విమర్శించారు. రజక ఫెడరేషన్ కు 9 వేల కోట్ల రూపాయలు కేటాయించి రజకుల సంక్షేమానికి తోడ్పాటు ఇవ్వాలని కోరుతున్నాము. రజకుల పై అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పున్నయ్య, సీనియర్ జర్నలిస్ట్ నీలం వెంకన్న, ప్రముఖులు అశోక్, జి. వెంకటప్ప, ముదిగొండ వెంకటప్ప, సట్టు వెంకటేశ్వర్లు, సట్టు నాగయ్య, డాక్టర్ రాజయ్య, మాజీ జడ్పీటీసీ రవి, నోముల రవి, పురుషోత్తం, రాయల శ్రీను, కోయలకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామ.. కనవేమి రా..!

## హుండీ పెట్టిన రోజు నుంచే గండీ

### ప్రతిష్ఠాత్మకమైన విరాళాల చోరీ ..పాలకుల నైతికతకు అగ్నిపరీక్ష

### దేశాన్ని కుదిపేస్తున్న విరాళాల వివాదం

అయోధ్య రామ మందిరం దశాబ్దాలుగా బిజెపికి ఉన్న సైద్ధాంతిక సాంస్కృతిక ఎజెండాలో ఒకటి. కేంద్రంలో అధికారంలో ఉన్నది బిజెపి. ఉత్తరప్రదేశ్లో కూడా బిజెపి దే పవర్. అయోధ్య రామ మందిరంలో విరాళంగా ఇచ్చిన 60 కిలోల వెండి మాయమైంది. శ్రీరాముని కోసం విరాళంగా ఇచ్చిన నాలుగు కిలోల వెండి ఇటుక ఇప్పుడు ఎక్కడుంది? భక్తులు సమర్పించిన రాముడి ఆభరణాలు ఏమయ్యాయి..? విలువైన కానుకలు వస్తువుల సంగతేంటి? వీటన్నింటి పై దాతలు ప్రశ్నలు అడుగుతున్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకమైన వివాదంగా మారింది. ఈ పొలిటికల్ కాంట్రవర్సీ దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది.

**మెగా ఇన్వెస్టిగేషన్..**

రామ మందిరంలో చోటు చేసుకున్న విరాళాల దొంగతనం పై పోలీసులు ఆలయంలోకి రంగ ప్రవేశం చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు మొదలు పెట్టారు. భక్తులకు విరాళాలకు మధ్య ఉన్న జ్యువెలర్స్ అసోసియేషన్ బహిరంగ విమర్శలు చేస్తుంది. వెండిని ఆలయానికి అప్పగించినట్లు పక్క ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెప్తున్నారు. విరాళాల దొంగతనం కేసు దర్యాప్తు సాధారణ క్రిమినల్ కేసుల పరిధి దాటిపోయింది. దేవాలయ ఆర్థిక అవకతవకలు మాత్రమే కాదు. ప్రతి రూపాయి, వెండి బిస్కెట్, ఆభరణం, వెండి ఇటుక శ్రీరాముడి పాదాల చెంత భక్తులు చెల్లింపుగా సమర్పించలేదు. అచించలమైన విశ్వాసానికి ప్రతిరూపంగా రాముడి పాదాల ముందు పెట్టారు. వెండి బిస్కెట్లు ఆభరణాల వివరాలు ఆలయ రికార్డులు నమోదు చేశారా లేదా అనేదానిపై సీట్ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. నగదు లెక్కింపు గదిలోనే భయంకరమైన నిజం బయటపడింది. నమ్మశక్యంగానే కదలికలు జరిగాయని దానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ లు సిట్ అధికారులు గుర్తించారు. ధనాన్ని గుట్టు చప్పుడు కాకుండా ఆలయ ప్రాంగణంలోని ఇతర ప్రాంతాల్లో దాచినట్లు అధికారులు కూపిలాగారు.

**హుండీ పెట్టిన రోజు నుంచే గండి..!**

అయోధ్య రామ మందిరం 22 జనవరి 2024లో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట ఘనంగా జరిగింది. దాదాపు 13 కోట్ల భక్తులు బాల రాముని దర్శించుకున్నారు. ఈ సందర్భంలో హుండీలు ఏర్పాటు చేసి భక్తులు వేసిన కానుకలను ట్రస్ట్ ఈ అధికారులు పర్యవేక్షణలో ఉంచారు. ఇక్కడే అసలు మోసం జరిగింది. హుండీ లెక్కింపు మొదటి రోజు నుంచే డబ్బు ఆభరణాల పక్కదారికి బీజం పడిందని సిట్ అధికారులు స్పష్టం చేశారు .దర్యాప్తు అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం ఆలయ నిధుల మళ్లింపు ఒక్కరోజులో జరిగిన సాధారణమైన దొంగతనం కాదని తెల్చారు. ఈ దొంగతనం చాలా కాలం నుంచి సాగుతూనే ఉందని విచారణలో స్పష్టంగా తేలింది. ప్రధాన నిందితుడు అవినాష్ శుక్లాను అయోధ్య పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆలయ నిబంధన ప్రకారం ఉండి తెరిచి నగదును లెక్కించే ప్రక్రియను ప్రారంభించే సమయంలో లెక్కింపు దశలోనే ఎవరు ఊహించని విధంగా భారీ అక్రమాలు జరిగినట్లు దర్యాప్తు అధికారులు తేల్చారు నగదు లెక్కింపుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ లను అధికారులు క్షుణ్ణంగా జల్లెడ పట్టారు హుండీ లెక్కింపు జరుగుతున్నప్పుడు కొన్ని అనుమానాస్పద కదలికలను విజువల్స్ ను అధికారులు గుర్తించారు ఇక్కడ అత్యంత చాకచక్యంగా వివరించిన అధికారి ఒకరు సీసీటీవీ క్యాప్చర్ చేయకుండా అడ్డంగా నిలబడగా మరో వ్యక్తి నోట్ల కట్టలను మాయం చేయడం అధికారులు స్పష్టంగా గమనించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద నుంచి దొంగిలించిన నగదును ఎవరికి అనుమానం రాకుండా ఆలయంలోని బాత్రూంలోకి ఇతర రహస్య ప్రదేశాల్లో తాత్కాలికంగా దాన్ని ఉంచేవారని అధికారులు క్లారిటీ ఇచ్చారు కౌంటింగ్ గది నుంచి సేఫ్గా బయటపడేందుకు ఈ రకమైన వ్యూహాన్ని రచించుకున్నారని అధికారులు వెల్లడించారు. ఈ మెగా ఇన్వెస్టిగేషన్లో దొంగతనం కేవలం నగదు కే పరిమితం కాలేదు భక్తులు సమర్పించిన బంగారం వెండి ఇతర విలువైన కానుకల లెక్కలను చిత్త అధికారులు పూర్తిగా తవ్వి తీస్తున్నారు. ఆలయానికి వచ్చిన ప్రతి కానుకకు సరైన లెక్క ఉందో లేదో తేల్చేందుకు దాతల వివరాలు రిజిస్టర్లు ఇన్వెంటరీ రికార్డులు సీసీటీవీ ఫుటేజ్ లు ప్రస్తుతం ఆలయంలో ఉన్న ఫిజికల్ స్టాక్ ను ఒకదానితో ఒకటి సరి చూస్తున్నారు. ఈ విచారణ తర్వాతనే ఊహించని విధంగా దర్యాప్తు వేగాన్ని పుంజుకుంది. సిట్ తన ప్రాథమిక దర్యాప్తు నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించింది. ఈ ఆధారాల మీదనే ఎఫ్ఐఆర్ కూడా నమోదయింది.

**పాలకుల నైతికతకు అగ్నిపరీక్ష**



డబుల్ ఇంజన్ సర్కార్ హయాంలో అత్యంత వైభవంగా రామ మందిరం నిర్మాణం పూర్తయింది. బాల రాముడి ప్రాణ ప్రతిష్ట మహోత్సవం కూడా గ్రాండ్ గా జరిగింది. ప్రతి ఏటా సీఎం యోగి ఆదిత్యనాథ్ అయోధ్యలో జరిగే దీపోత్సవ సెలబ్రేషన్ను ముందుండి నడిపిస్తారు. లక్ష దీపాలతో అయోధ్యను సనాతన సాంప్రదాయ ప్రతీకగా ప్రజెంట్ చేస్తున్నారు. మందిరంలో జరిగిన విరాళాల దొంగతనంపై ప్రతిపక్ష లీడర్లు గొంతు చించుకుంటున్నారు. ఇది కేవలం సాధారణ క్రిమినల్ కేసు కాదని దీని వెనుక పెద్ద కథ ఉందంటూ ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. అఖిలేష్ యాదవ్ తో పాటు పలువురు ప్రతిపక్ష నేతలు తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. దర్యాప్తు కేవలం కిందిస్థాయి ఉద్యోగుల వద్దనే ఆగిపోతుందని అసలు బాధ్యత వహించాల్సిన ఉన్నత స్థాయి వ్యక్తుల పాత్ర పై ప్రశ్నలు వేయకుండా తప్పించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. దర్యాప్తు పూర్తి పారదర్శకంగా ఇలాంటి ఒత్తిడి లేకుండా సమగ్రంగా జరగాలని డిమాండ్ చేస్తున్నారు. పైన పెద్దలను కాపాడడం కోసం రాజకీయ డ్రామా నడుస్తున్న జరుగుతుందని ఒక వర్గం చెప్తుంది. రాజకీయ లాభం కోసం ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం మాత్రమే అంటున్నారు ఆలయ అధికారులు ట్రస్ట్ పెద్దలు చట్టం తన పని తాను చేసుకోబోతుందని అంటున్నారు. దర్యాప్తు సమయంలో దీనికి రాజకీయరంగు పులమ వద్దని చెబుతున్నారు. ఈ రెండు వాదనలో నిజం ఏంటో తేల్చేది ఇలాంటి ఒత్తిడి లేని ప్లేన్ ట్రాన్స్పరెంట్ అండ్ క్రెడిబుల్ ఇన్వెస్టిగేషన్ ఆధారాలు ఎటు చూపిస్తే అటువైపు నిజాయితీగా అడుగులు వేసే విచారణ మాత్రమే దీనికి అసలైన సమాధానం చెప్పగలుగుతుంది.

**వి హెచ్ పి సీరియస్.. చంపత్ రాయ్ రాజీనామా!**

నాగపూర్ నుంచి విహెచ్పి జనరల్ సెక్రెటరీ రామ మందిరం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సంపత్రాయుని రాజీనామా చేయాలని ఆదేశించారు. కానీ విచారణ ముగిసే దాకా ఉంటానని చెంపతరాయి పట్టుపట్టారు. జూన్ 24న విహెచ్పి సీరియస్ అయింది. కేసు పెడతామని ఎవరిని వదిలిపెట్టమని నాలుగు వాక్యాల ప్రకటన విడుదల చేసింది. ఖాళీ కాగితంపై సంతకం చేసి వెళ్లిపోవాలని విహెచ్పి ఆదేశించింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ విచారణ నిగ్గు తేలే వరకు తన మాటకు పూర్తిగా కట్టుబడి ఉన్నారని స్పష్టమైనది. ఈ వివాదం కేవలం డబ్బు గురించి కాదు కోట్లాదిమంది భక్తుల నమ్మకానికి సంబంధించినది. భగవంతుని పాదాల వద్ద భక్తుడించిన కానుకల విషయంలో ఇలా జరగటం వారి మనోభావాలను తీవ్రంగా కలిసి వేసింది. రాముని సొమ్మును పిడకల గుట్టలో దాయాల్సిన పరిస్థితులు ఎందుకు వచ్చిందని విహెచ్పి అడుగుతోంది. ఆలయ ట్రస్ట్ సభ్యులు ప్రధాన కార్యదర్శి చంపత్రాయ్ రాజీనామా చేశారు.


**దేశం చర్చిస్తోంది..!**

భక్తి ఉన్నచోట నమ్మకం అన్నింటికన్నా గొప్పది. రామ మందిరంలో జరిగిన విరాళాల చోరీ సంఘటన గురించి దేశం చర్చిస్తుంది. ప్రభుత్వ రికార్డుల ఆధారంగా అధికారులు సేకరించిన వివరాల ప్రకారం కోర్టులు పోలీసులు దర్యాప్తుల ద్వారా అసలు విషయం తేలిపోతుంది. కానీ భక్తుల మనసులో ఇంకా ప్రశ్నలు మిగిలి ఉన్నాయి. మొదటినుంచి కఠినమైన నిర్ణయాలు చర్యలు పకడ్బందీ భద్రత ఉండి ఉంటే ఈ ఘటన వెలుగు చూసేది కాదని భక్తులు చెబుతున్నారు. ఈ వివాదం ఎలా బయటకు వచ్చింది కోట్లాదిమంది భక్తులు ఇదే ప్రశ్న అడుగుతున్నారు. ఇది ఒక ఎఫ్ఐఆర్ తో మొదలైందా..? పొలిటికల్ ఫిర్యాదుతో మొదలైందా..? లేదా పిడకలగుట్ట మధ్యలో లక్షలాది రూపాయల హుండీ డబ్బులు నోట్ల కట్టలు ఎందుకు దాయాల్సి వచ్చింది..? పంపకాల విషయంలో తేడా వచ్చిందా..? ఇంకా సమాధానం దొరకని ప్రశ్న లాగే మిగిలిపోయింది.

**8మంది కౌంటింగ్ సభ్యులు అరెస్టు. 75లక్షలు రికవరీ.**
హుండీ కౌంటింగ్ సభ్యులలో ప్రధాన నిందితుడు అవినాష్ శుక్లా ను ప్రాథమిక విచారణలోనే అధికారులు అరెస్టు చేశారు. ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సంపత్ రాయి ట్రస్ట్ ఆలయ నిర్మాణ నిర్వహణతో సంబంధం ఉన్న గోపాలరావు సిట్ అధికారులు విచారించారు. చంపత్ రాయ్ రాజీనామా చేశారు. ఆలయ కౌంటింగ్ సభ్యులు అవినాష్ శుక్ల అనుకల్స్ శుక్ల లవ కుశ మిశ్రా మనీష్ కుమార్ యాదవ్ కరుణేష్ పాండే రమా శంకర్ మిశ్రా సుభాష్ శ్రీవాత్సవ ప్రమాశంకర్ యాదవుల నుంచి 75 లక్షల రూపాయలు రికవరీ చేశారు. ఇవి కాకుండా 11 గ్రాముల బంగారం 375 గ్రాముల వెండి ఆభరణాలను అధికారులు రికవరీ లో చూపారు. ట్రస్టు సభ్యులు ఎవరు ? అయోధ్య విడిచి వెళ్ళరాదని సిత్తాధికారులు సిఫారసు జారీ చేశారు.

– జక్కుల రవీందర్ రావు
జగిత్యాల, కరీంనగర్ జిల్లా

# రొమ్ము పరీక్షలో బయటపడిన హార్మోన్ వ్యాధి





**హైదరాబాద్, (సింగిడి) :** రొమ్ములో గడ్డ అనుమానంతో పరీక్షలకు వచ్చిన 59 ఏళ్ల మహిళలో కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్ వైద్యులు అరుదైన ప్రైమరీ హైపర్‌పారా థైరాయిడిజం వ్యాధిని గుర్తించి విజయవంతంగా చికిత్స అందించారు. మామోగ్రామ్‌లో రొమ్ము సాధారణంగానే ఉన్నప్పటికీ, పక్కటెముకలో అసాధారణ మార్పు కనిపించడంతో మరిన్ని పరీక్షలు నిర్వహించి పారాథైరాయిడ్ అడెనోమాను గుర్తించారు. శస్త్రచికిత్స ద్వారా ప్రభావిత గ్రంథిని తొలగించగా మహిళ పూర్తిగా కోలుకుందని వైద్యులు తెలిపారు. సాధారణ ఆరోగ్య పరీక్షలతో కూడా ఇలాంటి వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించవచ్చని సూచించారు.

# సెప్టెంబర్‌లో NSE రూ. 30,000 కోట్ల ఐపీఓ



**ఢిల్లీ:** ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ తొలి పబ్లిక్ ఇష్యూ ఈ ఏడాది సెప్టెంబర్‌లో పట్టాలెక్కనుంది. మొత్తం రూ. 30వేల కోట్లు మార్కెట్ నుంచి సమీకరించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దాదాపు రూ. 5 లక్షల కోట్ల మార్కెట్ విలువతో ఐపీఓకు రానుంది. పబ్లిక్ ఇష్యూకు సంబంధించి ఎన్ఎస్ఈ త్వరలో రోడ్‌షోలు నిర్వహించనుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. 2024 అక్టోబర్‌లో వచ్చిన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓనే (రూ. 27,870 కోట్లు) అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఉంది.

ఎన్ఎస్ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో నిర్వహించనున్నారు. అంటే ప్రస్తుత వాటాదారులు తమ వాటాలను వదులుకోనున్నారు. సుమారు 6 శాతానికి సమానమైన 14.80 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంఎస్ స్ట్రాటిజిక్ (మారిషస్) లిమిటెడ్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు, అరండ ఇన్వెస్ట్‌మెంట్స్ (మారిషస్), బ్యాంక్ ఆఫ్ బరోడా, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ది న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలు తమ వాటాలు విక్రయించనున్నాయి. ఎన్ఎస్ఈలో అతిపెద్ద వాటాదారుగా ఉన్న ఎల్ఐసీ మాత్రం పబ్లిక్ ఇష్యూలో తన వాటాలను విక్రయించడం లేదు. స్టాక్ ఎక్స్ఛేంజీలో ఈ సంస్థకు 10.72 శాతం వాటా ఉంది.


**దశాబ్దం కల నెరవేరుతున్నవేళ**

ఎన్ఎస్ఈ ఐపీఓ దాదాపు దశాబ్దం క్రితమే రావాల్సింది. 2016లో రూ. 10వేల కోట్లు సమీకరించేందుకు సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. గవర్నెన్స్ సమస్యలు, కోలొకేషన్ వ్యవహారం తెరపైకి రావడంతో సెబీ రెడ్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో అడ్డంకులను తొలగించుకుంటూ వచ్చింది. నియంత్రణ సంస్థ నుంచి ఆమోదం కోసం పలుమార్లు విజ్ఞప్తులు చేసింది. ఈ క్రమంలోనే సెబీ నుంచి ఎన్ఓసీ రావడంతో ఐపీఓకు ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఎన్ఎస్ఈ బోర్డు ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా 20 మంది మర్చంట్ బ్యాంకర్లను నియమించింది. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా జియో ప్లాట్‌ఫామ్ పేరిట అతిపెద్ద ఐపీఓకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది.

## స్టాక్ మార్కెట్
Stock Market

నాలుగో రోజు లాభాల్లోనే..

### సెన్సెక్స్ 521 పాయింట్లు పైకి



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి . చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, క్యూ1 ఫలితాలపై ఆశావహ దృక్పథం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. ముఖ్యంగా ఆటో, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఈ క్రమంలో వరుసగా నాలుగో రోజూ సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 521 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 24,400 పాయింట్ల పైకి ఎగబాకింది.


నిఫ్టీ 159.50 పాయింట్ల లాభంతో 24,430.35 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్, రిలయన్స్, ఐసీఐసీఐ, మారుతీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. కోటక్, టీసీఎస్, బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాలను చవిచూశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.38గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.50 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,148.34 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఫ్రీ ట్రయల్ ఫ్రీ కాదు గురూ.. మరి మ్యాండేట్ డిలీట్ చేయడం ఎలా?

యాప్‌లో కొత్త ఫీచర్ వచ్చింది.. నెల రోజులు ఫ్రీ ట్రయల్.. ఇప్పుడే సబ్‌స్క్రైబ్ చేసుకోండి. మా ఓటీటీలో కొత్తగా యాడ్‌ఫ్రీ సేవలు తీసుకొచ్చాం.. ఓ రెండు నెలలు ఉచితంగా వాడాక పేమెంట్ చేయండి.. అంటూ రకరకాల సేవలు మనల్ని ఊరిస్తుంటాయి. చాలా కంపెనీలు తమ ప్రీమియం సేవలవైపు యూజర్లను ఆకర్షించేందుకు వేసే ఎత్తుగడే ఈ ఫ్రీ ట్రయల్. ఎలాగూ ఉచితమేగానని చాలామంది సబ్‌స్క్రైబ్ అవుతుంటారు.

ప్రీమియం సేవల కోసమే తీసుకునే వారికి.. ఈ ఫ్రీ ట్రయల్ ఓ విధంగా కలిసొచ్చినట్లే. కానీ, ఉచితకాలం ముగిశాక ఆపేద్దామనుకున్న వారు మాత్రం ఇరుక్కుపోతుంటారు. సబ్‌స్క్రైబ్ చేసుకున్నాక చాలా మంది దాని సంగతి మరిచిపోతుంటారు. తీరా బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యాక నాలుక కరుచుకుంటారు. మరికొందరు మాత్రం ఫ్రీ ట్రయల్ రద్దు చేయడం తెలీక తాము వాడని సేవలకూ నెల నెలా డబ్బులు చెల్లిస్తుంటారు. దీనివల్ల నగదు కోల్పోవడమే కాదు.. అకౌంట్‌లో డబ్బులు లేకపోతే ఆటోపే మ్యాండేట్ ఫెయిల్ అయి బ్యాంకులు అపరాధ రుసుం విధించొచ్చు. దీనివల్ల క్రెడిట్ స్కోరుపైనా ప్రభావం పడుతుంది.

**ఆటోపే మ్యాండేట్ తెలుసుకోవడం ఎలా?**
చాలా మంది దగ్గర తమ స్మార్ట్‌ఫోన్లలో ఒకటికి మించి యూపీఐ యాప్స్ ఉంటాయి. ఏదైనా ఫ్రీ ట్రయల్‌కు సబ్‌స్క్రైబ్ అయినప్పుడు ఏదో ఒక యాప్ నుంచి ఆటో డెబిట్‌కు అంగీకారం తెలుపుతూ అనుమతి ఇచ్చేస్తుంటారు. రెండు మూడుకు మించి ఇలాంటి అనుమతులు ఇచ్చినప్పుడు ఏ యాప్‌లో ఏది ఉందో తెలుసుకోవ డమూ కష్టమే. అలాంటి వారి కోసమే ఒక మొబైల్ నంబర్‌పై ఎన్ని మ్యాండేట్‌లు ఉన్నాయో తెలుసుకోవడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఓ సదుపాయం కల్పిస్తోంది. https://upihelp.npci.org.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ మొబైల్ నంబర్‌పై ఎన్ని ఆటోపేకి అనుమతులు ఉన్నాయో తెలుసుకోవచ్చు. మీ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వగానే అన్నీ ఒకే చోట దర్శనమిస్తాయి. కావాలంటే అక్కడే పాజ్ చేయొచ్చు. లేదంటే పూర్తిగా క్యాన్సిల్ చేయొచ్చు.





యాప్‌లోనూ రద్దు చేసుకునే సదుపాయం ఉంది.

**ఒక్కో యాప్‌లో ఒక్కోలా**
ఒకవేళ మీరు ఫోన్‌పే వాడుతుంటే.. ప్రొఫైల్ పిక్చర్ మీద క్లిక్ చేసి పేమెంట్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఆటోపే ఆప్షన్ ఎంచుకుని కావాల్సిన మ్యాండేట్‌ను తొలగించొచ్చు. పేటీఎంలో అయితే ప్రొఫైల్ మెనూలోకి వెళ్లి యూపీఐ/పేమెంట్ సెట్టింగ్స్‌లో యూపీఐ ఆటోమేటిక్ పేమెంట్స్ ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుంది. గూగుల్ పేలో ప్రొఫైల్ ఐకాన్ క్లిక్ చేసి అందులో నేరుగా ఈ ఆప్షన్ ఎంచుకోవచ్చు. ఒకవేళ భీమ్ యాప్ యూపీఐ వాడుతుంటే.. మ్యాండేట్స్ లేదా ఆటోపే సెక్షన్‌లోకి వెళ్లి యూపీఐ పిన్ ఎంటర్ చేసి ఇంతకుముందు ఆటోడెబిట్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేయొచ్చు.

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
24-8-2026

# కొత్తపల్లిలో ఘనంగా ఖండ యువ సమ్మేళనం

## దేశ పునర్నిర్మాణంలో యువతే కీలకం. ముత్తునూరి హరీష్



**కరీంనగర్, ఆగస్టు 23(సింగిడి):** కొత్తపల్లిలోని శ్రీరామాలయంలో ఖండ యువ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో యువ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత, ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్తునూరి హరీష్ మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న యువ సమ్మేళనంలో పాల్గొనడం యువతకు గొప్ప అవకాశమన్నారు. దేశ పునర్నిర్మాణంలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెడు వ్యసనా లకు దూరంగా ఉంటూ స్వామి వివేకానం దుడిని ఆదర్శంగా తీసుకుని దేశం, సమాజం కోసం ఆలోచించే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. చిన్నచిన్న విషయాలకు క్షణికావేశానికి లోనై విలువైన ప్రాణాలను కోల్పోవద్దని యువ తకు హితవు పలికారు. సమాజ సేవలో ప్రతి రోజూ కనీసం గంట సమయం కేటాయిం చాలని కోరారు. కుటుంబ బాధ్యతలు, ఉద్యో గాలతో పాటు సామాజిక సేవలో స్వయం సేవ కులు భాగస్వాములవు తున్నారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ పౌర బాధ్యతలను పాటించాలని సూచిం చారు. ప్రపంచంలోనే భారతదేశంలో యువశక్తి అధికంగా ఉందని, యువత ఆలోచనలు దేశ ప్రగతిపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఐక్య తతో సమాజ హితం కోసం ధర్మమార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఖండ కార్యవాహ దీకొండ అన్వేష్ అంజన్న, సహ కార్యవాహ ఎన్నం సురేందర్, గ్రామ వికాస ప్రముఖ్ చిట్యాల శ్రీనివాస్, శారీరక ప్రముఖ్ ఆవుల శివశంకర్, ఖండ కళాశాల విద్యార్థి ప్రముఖ్ పెద్ది శ్రీధర్, బండ కిషన్‌రెడ్డి, స్వర్గం సురేంద్రనాథ్‌తో పాటు పలువురు యువకులు, స్వయంసేవకులు పాల్గొన్నారు.

# జీవో 97ను రద్దు చేయాల్సిందే, లేదంటే పోరాటం

## పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్, (సింగిడి)** పాలిటెక్నిక్ విద్యా విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. జీవో రద్దయ్యే వరకు విద్యార్థుల తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మోడల్ గురుకుల పాలిటెక్నిక్ మహిళా కళాశాలను సందర్శించిన గంగుల కమలాకర్ విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొత్త విధానం అమలైతే తమ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంటుందని, ఇంజనీరింగ్‌లో ప్రవేశానికి కీలకమైన ఈసెట్ రాసే అవకాశం కోల్పోతామని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరి మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. సాంకేతిక విద్యా విధానాన్ని బలహీనపరిచి కొత్త విధానాన్ని తీసుకురావడం ద్వారా పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందని విమర్శించారు. పాలిటెక్నిక్ కళాశాలల ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.



విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో 97ను ప్రభుత్వం బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని, జీవో రద్దయ్యే వరకు విద్యార్థుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, శాతవాహన విశ్వవిద్యాలయ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, నాయకులు గంగాధర చందు, మొగిలోజు వెంకట్, పలువురు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఇమ్మడి సతీష్




**జమ్మికుంట, (సింగిడి)** కరీంనగర్‌లోని కళాభారతి వేదికగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో జమ్మికుంటకు చెందిన తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షులు ఇమ్మడి సతీష్‌కు "ఉత్తమ సేవా పురస్కారం" అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలు, యువత అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న ఇమ్మడి సతీష్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొంటానని పేర్కొన్నారు.

# అరుదైన హైడాటిడ్ సిస్ట్ శస్త్రచికిత్స విజయవంతం

## ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం



**జమ్మికుంట, (సింగిడి)** జమ్మికుంట పట్టణంలో అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సను ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జనరల్ సర్జన్ డాక్టర్ మహిపాల్ విజయవంతంగా నిర్వహించారు. సిరిసేడు గ్రామానికి చెందిన 70 ఏళ్ల రైతు 16 సంవత్సరాల క్రితం హనుమకొండలోని ప్రముఖ ఆసుపత్రిలో కాలేయంలోని హైడాటిడ్ సిస్ట్‌ల తొలగింపునకు లాపరోటమీ శస్త్రచికిత్స చేయించుక న్నారు. అయితే ప్రస్తుతం ఆయనకు కాలేయంతో పాటు పొత్తికడుపులోని పెరిటోనియం ప్రాంతానికి కూడా హైడాటిడ్ వ్యాధి విస్తరించింది. ఆపరేషన్ చేయడానికి దాదాపు 8 ఆసుపత్రులు నిరాకరిం చడంతో, రోగి కుటుంబ సభ్యులు పలు ఆసుపత్రులను సంప్రదించిన అనంతరం చివరకు జమ్మికుంటలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆశ్రయించారు. రోగిని పరీక్షించిన డాక్టర్ మహిపాల్, కాలేయంలో సుమారు 12 హైడాటిడ్ పరాన్నజీవి తిత్తులు ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఎక్స్‌ప్లోరేటరీ లాపరోటమీ ద్వారా శస్త్రచికిత్స చేయాలని తెలిపారు. శస్త్రచికిత్స సమయంలో కాలేయం పొత్తికడుపు ప్రాంతంలో ఉన్న హైడాటిడ్ తిత్తులను, వాటి గోడలను జాగ్రత్తగా తొలగించారు. తిత్తుల్లోని పరాన్నజీవులు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేకమైన స్కోలిసైడల్ ఏజెంట్ ఉపయోగించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో డాక్టర్ మహిపాల్ తన అనుభవాన్ని ఉపయోగించి శస్త్రచికిత్సను విజయవం తంగా పూర్తి చేశారు. అతి తక్కువ స్థాయిలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అందించడం పట్ల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్లిష్టమైన అరుదైన శస్త్రచికిత్సలను అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

# ప్రజల భద్రతే మా ప్రధాన ధ్యేయం

## రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా





**కమాన్ పూర్ ఆ(సింగిడి)** ప్రజలు ఎలాంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు భరోసా కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెంచికల్‌పేట్ గ్రామంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణలో, టూ టౌన్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్ రావు, లింగమూర్తి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంచడంతో పాటు అనుమానాస్పద ప్రాంతాలు, నివాస గృహాల్లో తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 70 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీ గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టపరమైన చర్యలకు, నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, గ్రామంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. నేరాన్ని ప్రారంభ దశలోనే అడ్డుకోవడం వల్ల భవిష్యత్తులో తలెత్తే పెద్ద సమస్యలను నివారించవచ్చన్నారు. యువత చెడు మార్గాల్లోకి వెళ్లకుండా కష్టపడి చదివి, క్రీడల్లో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. యువత ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు పోలీసుల తరఫున సహాయ సహకారాలు అందిస్తామని, సింగరేణిలో లభించే అవకాశాలను సైతం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ పౌరులు, ప్రజాప్రతినిధులు చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కళాకారునికి పురస్కారం అందజేత..



**కమాన్ పూర్ (సింగిడి)** కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామానికి చెందిన పులిపాక కృషి కళా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం మెమొంటోను అందజేశారు. ప్రపంచ జానపద కళల దినోత్సవాన్ని పురస్కరించుకొని కృషి కల్చరల్ అకాడమీ వారు జానపద కళోత్సవాలను ఘనంగా నిర్వహించారు పోల్ ఇండియా పథకాల విజేత నటులు కాసిపాక రాజమౌళి జ్యోతి ప్రజ్వలన చేశారు . అనంతరం పులిపాక బానేష్ కు మేముంటో అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజమౌళి, అట్ల జగ్గయ్య ,జనగామ శ్రీనివాస్ ,పండుగ రాజేశ్వర రావు, సిరిపురం శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, పాల నరేష్ ,వేముల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు బిగ్ షాక్..

## ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

### ప్రతి కష్టంలో తోడుంటా,ప్రతి ఒక్కరికి అండగా ఉంటా... సంక్షేమ పథకాలను ఇంటింటికి చేర వేయాలి..





**జమ్మికుంట, (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం నుండి పెద్ద ఎత్తున బీఆర్ఎస్,బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్. అనంతరం వారు మాట్లాడుతూ ఒకవైపు సంక్షేమ పథకాలు, మరొకవైపు అభివృద్ధి రెండు సమపాళ్ళలో ప్రభుత్వం అందిస్తుందని,నియోజవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అభివృద్ధి ప్రజలకు ఇంచార్జి గా ప్రణవ్ బలంగా తీసుకువెళు న్నారని వారి ఆధ్వర్యంలో పని చేయడానికి ముందుకు వచ్చామని తెలిపారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు స్థానిక నాయకులతో కలిసి ప్రజలకు చేరవేస్తామని, మరిన్ని నిధులు తీసుకొచ్చి హుజురాబాద్ అభివృద్ధికి తోడ్పడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు సదానందం, మండల అధ్యక్షుడు పరశురామ రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు రాచపల్లి శ్రీనివాస్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్,డివైసి సెక్రటరీ సజ్జు,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాచపల్లిసాగర్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భాస్కర్,వార్డు సభ్యులు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రెడీహిల్స్ కాలనీలో మురుగునీటి సమస్యకు పరిష్కారం

## సుడా నిధులతో ఆర్‌సీసీ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న



**కరీంనగర్, (సింగిడి)** నగరంలోని 11వ డివిజన్ రెడీహిల్స్ కాలనీలో సుడా నిధులతో చేపట్టనున్న ఆర్‌సీసీ డ్రైనేజీ పనులకు కార్పొరే టర్ ఆకుల నర్మద నర్సన్న శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయ కొట్టి పను లకు శంకుస్థాపన చేశారు. కాలనీలో దీర్ఘకాలంగా నెలకొన్న మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన పారిశుద్ధ్య వసతులు కల్పించేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నర్మద నర్సన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వివాదాన్ని వెంటనే పరిష్కరించాలి

## మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి డిమాండ్..

## జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు..

**జమ్మికుంట,(సింగిడి):** గ్రామీణ ప్రాంత సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజాసేవలో కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల నివేశన స్థలాలపై అడ్డంకులు సృష్టించడం సరికాదని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. హుజూరాబాద్‌లో గత ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కోర్టులో కేసు వేయడాన్ని నిరసిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి.

దీక్షకు ముందు జర్నలిస్టులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ పార్టీతో పాటు స్వామిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి పెద్దిరెడ్డి సందర్శించి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.

?ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ... మూడేళ్ల క్రితం నిబంధనల ప్రకారం ప్రభుత్వం జర్నలిస్టులకు స్థలాలు కేటాయించిందని గుర్తుచేశారు. పట్టాలు పొందిన జర్నలిస్టులు ఒక్కొక్కరు రూ. లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు వెచ్చించి చిన్నపాటి గదులు నిర్మించుకుని, విద్యుత్ సౌకర్యం కూడా పొందారని తెలిపారు. వారు నివాసయోగ్యంగా మలుచుకుంటున్న సమయంలో కావాలని కేసు వేసి ఇబ్బందులకు గురిచేయడం తీవ్ర అన్యాయమన్నారు.

**న్యాయపరమైన పోరాటానికి పూర్తి సహకారం...**

"ప్రజా సమస్యలపై గళమెత్తే జర్నలిస్టులు ఇవాళ తమ హక్కుల సాధన కోసం రోడ్డున పడి దీక్షలు చేయాల్సి రావడం బాధాకరం, దౌర్భాగ్యం" అని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కల్పించిన సౌకర్యాలను అడ్డుకోవడం ప్రజాప్రతినిధుల లక్షణం కాదని హితవు పలికారు. కేసు వేసిన నాయకుడితో వ్యక్తిగతంగా మాట్లాడి కేసు



ఉపసంహరించుకునేలా చూస్తానని, అవసరమైతే న్యాయ నిపుణుల ద్వారా ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు.

**ప్రభుత్వం, జిల్లా మంత్రి చొరవ చూపాలి...**

పార్టీ కార్యకర్తలు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన బాధ్యత జిల్లా మంత్రిపై ఉందని ఆయన పేర్కొన్నారు. బాధ్యులైన నాయకులతో పాటు జర్నలిస్టులను చర్చలకు పిలిచి వివాదాన్ని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దాటవేత ధోరణి వీడి, జర్నలిస్టులకు స్థలాలను అప్పగించడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. సమస్య కొలిక్కి వచ్చేంత వరకు జర్నలిస్టుల వెన్నంటే ఉంటానని స్పష్టం చేశారు.

# వారసంత పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట, (సింగిడి).** జమ్మికుంట పట్టణంలో ప్రతి మంగళవారం జరిగే వారసంతను కొండూరు కాంప్లెక్స్ నుండి పాత వ్యవసాయ మార్కెట్ సమీపంలో మార్చడం జరిగిందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్అన్నారు. ఈ సందర్భంగా పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డు సమీపంలో జరుగుతున్న పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో ప్రతి మంగళ వారం జరిగే వారసంత వల్ల కొండూరి కాంప్లెక్స్ లో పాఠశాలలు హాస్పిటల్స్ బొమ్మల గుడి ప్రాంతంలో వర్షం వల్ల భురదమయం అవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ సమావేశంలో అంగడి కొండూరి కాంప్లెక్స్ నుండి పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డు నుండి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వరకు మార్చడం జరిగిందని దీనికోసం అవసరమైన లైటింగ్, పారిశుద్ధం,చెట్ల కొమ్మల తొలగింపు చేసి అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు .జమ్మికుంట పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు గ్రహించి సహకరించాలని కోరారు. ఈ పరిశీలనలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్, బోళ్ళ సదానందం, కొలుగురి కిరణ్, మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర దాత కిరణ్ చూపు సజీవం..

## నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

**జమ్మికుంట, (సింగిడి)** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శాలవాడ కు చెందిన బూరుగుపల్లి కిరణ్ (45) మరణం చెందగా, ఆయన కుటుంబ సభ్యులు చూపిన ఉదారత ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపింది. శనివారం కిరణ్ మరణించిన విషయం తెలుసుకున్న సదాశయ ఫౌండేషన్ జమ్మికుంట ప్రతినిధి డాక్టర్ క్యాతం రవి.. మృతుని కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ ప్రతినిధుల సూచనతో కిరణ్ భార్య శారద, కుమారుడు వివేక్, కుమార్తె రాజహర్షిని నేత్రదానానికి సంపూర్ణ సమ్మతి తెలిపారు.

వెంటనే స్పందించిన సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి, ఎల్. వి. ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ టెక్నీషియన్ రాజేంద్ర ప్రసాద్ సహాయంతో కార్నియాలను సేకరించి, భద్రపరచి హైదరాబాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. పరమపదించిన వేళలోనూ నేత్రదానం చేసి సామాజిక స్ఫూర్తిగా నిలిచిన మృతుడి భార్య శారద కుమారుడు వివేక్ కూతురు రాజా హర్షిని తోపాటు రవి సమ్మయ్య రాము సదానందం లను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారు రమేష్, జిల్లా అధ్యక్షుడు నరహరి, డీలర్ వెంకన్న తదితరులు అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు.

# మంత్రి శ్రీధర్ బాబు మండలంలో పర్యటన.

**కమాన్‌పూర్,(సింగిడి)** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం కమాన్‌పూర్ మండలంలో సోమవారం పర్యటించనున్నారు. ఉదయం 11.30 గంటలకు మండల కేంద్రంలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం ఆదివరాహ స్వామి దేవాలయానికి రూ.95 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. కమాన్‌పూర్ గ్రామంలో రూ. 30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈజీఎస్ లో నిర్మించిన రోడ్డు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అలాగే గుండారం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజాపూర్ గ్రామం నుండి మంగపేట కు వెళ్లే దారిలో రూ. 3.05 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఆదివరాహ స్వామి జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొంటారు.

# పేదింటి గృహప్రవేశానికి 'వెలిచాల' కానుక

## ఇందిరమ్మ ఇల్లు పూర్తయితే ఆడబిడ్డ ఇంటికి కొత్త వెలుగు

## గృహప్రవేశం చేసుకునే కుటుంబాలకు పొయ్యిలేదా పాత్రల సెట్ అందజేస్తా

## కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు

**కరీంనగర్, (సింగిడి)** ఇందిరమ్మ ఇల్లు పూర్తిచేసుకుని గృహప్రవేశం చేసుకునే ప్రతి ఆడబిడ్డ కుటుంబానికి తనవంతు కానుకగా విద్యుత్ పొయ్యి లేదా పాత్రల సెట్ అందజేస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి నుంచి ఆదివారం ప్రారంభించారు. చామనపల్లికి చెందిన పల్లె జగదీష్--శిరీష దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజేందర్‌రావు, నూతన గృహంలోకి అడుగు పెడుతున్న దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. తొలి కార్యక్రమంగా వారికి విద్యుత్ పొయ్యితో పాటు పాత్రల సెట్‌ను అందజేశారు. పేద కుటుంబానికి సొంతిల్లు



భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్‌కు భరోసానిస్తుందని అన్నారు.

**పేదల సొంతింటి కలకు ప్రభుత్వ భరోసా....**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని రాజేందర్‌రావు తెలిపారు. మొదటి విడతలో నాలుగు లక్షల ఇళ్లకు, రెండో విడతలో మరో రెండు లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యేలా తనవంతు కృషి చేస్తానన్నారు. రేకుల షెడ్లు లేదా గోడల వరకు నిర్మించుకుని ఉన్న అర్హులైన కుటుంబాలకు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు ఆర్థిక సహాయం అందే అవకాశం ఉందని తెలిపారు. ఇరుకుల్ల గ్రామంలో విజయలక్ష్మి--రామ్‌రెడ్డి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి రాజేందర్‌రావు భూమిపూజ చేశారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నెలలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని, బిల్లులు సకాలంలో అందేలా అధికారులతో సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కురుమ సంఘం సభ్యులతో కలిసి బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. చామనపల్లిలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న రాజేందర్‌రావు, సంఘ భవన నిర్మాణానికి సహకరిస్తానని, ప్రభుత్వ పరంగా అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. గౌడ సంఘం కార్యక్రమంలోనూ పాల్గొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, చామనపల్లి సర్పంచ్ బోగొండ ఐలయ్య, కార్పొరేటర్ గుమ్మడి రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంకు సహకరించాలి

**పారదర్శకమైన ఓటరు జాబితాకు కృషి.**
**ఆగస్టు 27న వార్డ్, గ్రామ సభలు**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల బ్యూరో (సింగిడి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన ఓటర్లకు నోటీసుల జనరేషన్, డెలివరీ, అభ్యంతరాల స్వీకరణ, తదుపరి హియరింగ్ ప్రక్రియలను వేగవంతం చేయడానికి మండలాల వారీగా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. ప్రస్తుతం గద్వాల, అలంపూర్ అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో హేతుబద్ధీకరణ అనంతరం మొత్తం 594 పోలింగ్ స్టేషన్ల కు సంబంధించి 1,48,674 మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 47,218 నోటీసులు జనరేట్ కాగా, 31.76 శాతం పురోగతి నమోదైందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల జనరేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయడానికి సంబంధిత అధికారు లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆగస్టు 22న బి ఎల్వో లు సంబంధిత బిఎల్ఏ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారన్నారు. ఈ సమావేశంలో నోటీసుల జనరేషన్, పెండింగ్ నోటీసుల పరిష్కారం, నోటీసుల డెలివరీ, ప్రజల అభ్యంతరాల స్వీకరణతో పాటు ఆగస్టు 27న ప్రతి గ్రామంలో నిర్వహించనున్న వార్డు, గ్రామ సభల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించి, సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారన్నారు. గ్రామసభల్లో ప్రజలకు ఓటర్ల జాబితా మరియు సంబంధిత ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రజల అభిప్రాయాలు అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. వార్డు గ్రామసభలు సజావుగా జరిగేలా అధికారులు, బిఎల్ఓలు, బిఎల్ఏలు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు గ్రామసభలకు పెద్ద సంఖ్యలో హాజరై, తమ పేరు, కుటుంబ సభ్యుల వివరాలు మరియు ఓటుకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలించుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో తమ పేరు సక్రమంగా ఉందో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకొని, ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ భాగస్వామ్యాన్ని నిర్ధారించుకోవాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## బాసర జోన్ ఎక్సైజ్ కానిస్టేబుళ్ళ సంఘం చైర్మన్‌గా కైలాష్ పవార్



**నిజామాబాద్ (ప్రతినిధి, (సింగిడి) :** బాసర జోన్ (ప్రొహిబిషన్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ,కానిస్టేబుల్ ఎన్నిక ఆదివారం సుభాష్ నగర్ లో గల ఆల్ పెన్షనర్స్ సీనియర్ సిటిజన్స్ భవన్ లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో చైర్మన్ గా చంద్రమోహన్, కైలాష్ పవార్ పోటీపడగా 36 ఓట్లలో ఇరువురికి సరిసమానంగా 18-18 రాగా ఎలక్షన్ అధికారులు డ్రా పద్ధతి నిర్వహించగా కైలాష్ పవార్ కి చైర్మన్ పదవి ఖరారైంది. వైస్ చైర్మన్ పదవి కి లింబాద్రి ఏకగ్రీవం, కోశాధికారి పదవికి చల్ల బాబు, ధనరాజ్ పోటీపడగా 36 ఓట్లలో చల్ల బాబు కు 24, ధనరాజ్ కు 12 రాగా చల్ల బాబు కోశాధికారిగా గెలిచారు. ఎన్నికల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్ అసోసియేషన్ ల అధ్యక్ష కార్యదర్శులకు, కార్యవర్గం ఓట్లు వేశారు. ఎలక్షన్ అధికారి విలాస్, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి బాలకిషన్, కోఆపరేటివ్ ఇన్స్పెక్టర్ అబ్దుల్ కలీం, సిబ్బంది తాజుల్ ఇస్లాం,రాజు తదితరులున్నారు.

## ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి




**కల్వకుర్తి (సింగిడి) :**వెల్దండ మండలం, బొల్లంపల్లి గ్రామం రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీరామ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఆలంపల్లి కృష్ణ, మండలి శ్రీనివాస్ యాదవ్, కనుగుల రమేష్,ఎండి రాజ్ మహ్మద్ లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు,గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో,ఉప సర్పంచ్ రామకృష్ణ,స్థానిక నాయకులు వెంకట్రావ్ లతో పాటు ఫౌండేషన్ సభ్యులు కొండల్ యాదవ్, శ్రీరాములు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మధిర వైరా నదిలో (ఏటిలో) రిటైనింగ్ వాల్ (స్మార్ట్ వాల్) పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు.



**మధిర, (సింగిడి) ::** మధిర వైరా నదిలో నిర్మాణం జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులను సంబంధిత అధికారులతో కలసి మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, రామాలయ కమిటీ చైర్మన్ వంగవీటి రాజశేఖర్ తదితర కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి ఏటి ఒడ్డున ఉన్న నివాస ప్రజలు, నివాస భవంతులు వర్షాకాలంలో వరద ముంపుకు గురవటం జరుగుతుంది. ఆ వర్షాకాలం మొత్తం అక్కడ ఉన్న ప్రజలు రాత్రిపూట భయభ్రాంతులతో నిద్రపోయే వారు కాదు. తుఫాను వచ్చినప్పుడల్లా, ఏటి ప్రవాహం పెరిగినప్పుడల్లా ఈ సమస్య వచ్చేది. ఈ సమస్య కు పరిష్కారాన్ని ఆలోచించి అక్కడ ఉన్న నివాసాలకు కానీ, ప్రజలకు ఇబ్బందులు కలగని రీతిలో పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఫ్లడ్ సేఫ్టీ వాల్ యొక్క అవసరాన్ని గుర్తించి ఈ రిటైనింగ్ వాల్ నిర్మించడం జరుగుతుందని తెలియజేశారు. రిటైనింగ్ వాల్ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. మధిరను అభివృద్ధి పరచడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలియజేస్తూ ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

## అంగన్‌వాడీ టీచర్ ప్రేమలతకు ఉత్తమ అంగన్వాడీ టీచర్‌గా ప్రశంస పత్రం



**ఆర్మూర్, (సింగిడి) :** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఆదివారం రోజున జి ఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎర్గట్ల మండలశీ తోర్తి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ ప్రేమలతకు ఉత్తమ అంగన్వాడి టీచర్ గా ప్రశంసా పత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తూ, చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డును అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమలతను జిల్లా అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందించారు. తన కృషిని గుర్తించి ప్రభుత్వం ప్రశంసా పత్రం అందించడం సంతోషంగా ఉందని ప్రేమలత తెలిపారు. భవిష్యత్తులోనూ మరింత బాధ్యతతో సేవలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, పాలొన్నరు.

## ఆటో డ్రైవర్ల బంద్‌కు సిపిఐ మద్దతు



**ఖమ్మం, (సింగిడి) :**ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సోమవారం నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త బంద్ కు సిపిఐ ఖమ్మంజిల్లా సమితి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందన్నారు. పెరిగిన ఇంధన ధరలు, అధిక పన్నులు, ఇన్సూరెన్స్ భారంతో డ్రైవర్లు ఆర్థిక భారంతో ఇబ్బందులు - పడుతున్నారన్నారు. ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి యాప్ల వల్ల ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోల్ ధరలను తగ్గించాలని, డ్రైవర్లకు సామాజిక భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఆటోల బంద్కు ప్రజలు కూడా సహకరించాలని సురేష్ కోరారు.

## ముత్యాలమ్మకు ఘనంగా బోనాలు



**తల్లాడ, (సింగిడి) :**తల్లాడ మండలం రామాను జవరం లో శ్రావణమాసాన్ని పురస్కరించు కుని గ్రామదేవత ముత్యాలమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, చీర సారెలతో బోనాలు ఎత్తుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాన్ని చల్లగా కాపాడాలని ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. బోనాల కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సందడితో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## నిరుద్యోగులకు కానిస్టేబుల్ సబ్ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకై ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్





**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి) :** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్, సబ్-ఇన్‌స్పెక్టర్ పోస్టుల నియామక పరీక్షలకు సిద్ధం కావడానికి ఉచిత పోలీస్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్న ప్రతిభావంతులైన నిరుద్యోగ యువతకు ఈ కార్యక్రమం ద్వారా నాణ్యమైన శిక్షణ, అవసరమైన మార్గదర్శకత్వం అందించడమే పోలీస్ కమిషనరేట్ ప్రధాన ఉద్దేశమని తెలి పారు. ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూడు డివిజన్లలోని నిజామా బాద్ డివిజన్‌కు మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయ రూరల్ ఇంజినీరింగ్ కాలేజీలో, ఆర్మూర్ డివిజన్‌కు క్షత్రియ ఇంజినీరింగ్ కాలేజీలో, బోధన్ డివిజన్‌కు జూనియర్ ఇంటర్ డిగ్రీ కాలేజీలో స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష ప్రశాంతంగా క్రమబద్ధంగా నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్షా ప్రక్రియ సజావుగా, పారద ర్శకంగా జరిగేలా అధికారులు పర్య వేక్షిం చారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి,వారికి పోలీస్ కానిస్టేబుల్ , సబ్-ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్షలకు అవసరమైన రాత పరీక్ష, ఫిజికల్ ఈవెంట్స్ తదితర అంశాల్లో సమగ్ర శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నారు. నిజామాబాద్ పోలీస్ కమి షనరేట్ చేపట్టిన ఈ ఉచిత శిక్షణ కార్యక్రమా న్ని నిరుద్యోగ యువ త సద్వినియోగం చేసు కుని,క్రమశిక్షణతో శిక్ష ణ పొం ది పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలని సీపీ ఆకాంక్షించారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వ హ ణలో అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సీటీసీ, ట్రాఫి క్, సీసీఎస్, ఏఆర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాం చ్ విభాగాలకు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఎస్. హెచ్.ఓ లు, ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పరీక్ష నిర్వహణలో భాగస్వాములయ్యారు.

## వంగా సాంబశివ రెడ్డికి మాజీ మంత్రి పువ్వాడ నివాళులు



**ఖమ్మం,, (సింగిడి) ::** ఖమ్మం నిర్మల్ హృదయ్ స్కూల్ అధినేత వంగా సాంబశివ రెడ్డి ఇటీవల మరణించారు.
వారి దశదిన ఖర్మ సందర్భంగా ఆదివారం జరిగిన సంతాప సభకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకు న్నారు. సాంబశివరెడ్డి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతమైన స్థానాల్లో ఎదిగేందుకు కృషి చేసారని విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దారని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.

## 27న ఉచిత కంటి ఆపరేషన్ చికిత్స శిబిరం..

**నాగర్ కర్నూల్ జిల్లావైద్యఆరోగ్యశాఖ**

**నాగర్ కర్నూల్ (సింగిడి) :):** జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో ఈనెల 27న గురువారం నాడు ఉదయం 9నుండి 11గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరము నిర్వహిస్తున్న ట్లు నాగర్ కర్నూలు ఆప్తాలమిక్ అధి కారి కొత్త బాలాజీ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం లోని గదినెంబర్ 102లో కంటిశిబిరం ఉదయం 9 నుండి 11గంటల వరకు వచ్చిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు,సాధారణ పరీక్షలు నిర్వహించి, అందులో అవసరమైన వారికి,క్యాటరాక్టు పొర గలవారికి ఉచితంగా కంటిఆపరేషన్లు మహబూబ్ నగర్ ఏనుగొండ లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించ నున్నట్లు తెలిపారు. రోగులకు ప్రత్యేక అంబులెన్స్ ద్వార ఏనుగొండకు పంపనున్నట్లుతెలిపారు. రోగులు ముందుగా బి.పి,షుగర్ పరీక్షలు చేసుక్కొని రిపోర్టు వెంటతెచ్చుకోవాలని తెలిపారు. ఈ ప్రాంత రోగులు ఆధార్ కార్డు,రేషన్ కార్డు,ఓటర్ కార్డు,ఏదేని గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ,ఫోన్ నెంబర్ ని తమవెంట తెచ్చుకోవాలని తెలిపారు.

## అయిజ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బడేసాబ్ యాదవ్ ఎన్నిక

**గద్వాల ప్రతినిధి (సింగిడి) ::** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బహుజన నేత, కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త ఈడిగోనిపల్లి బడే సాబ్ యాదవ్ ఎన్నికయ్యారు. పార్టీపై నమ్మకంతో, కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి నిరంతరం పనిచేస్తున్న బడేసాబ్ యాదవ్‌కు ఈ బాధ్యత దక్కడం పట్ల పార్టీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పనిచేసే బడేసాబ్ యాదవ్‌కు మండల అధ్యక్ష పదవి అప్పగించడం పట్ల పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. బడేసాబ్ యాదవ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి మండల పార్టీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మండల స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగేందుకు తన వంతు కృషిచేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డా. ఎస్.ఏ. సంపత్ కుమార్లకు బడేసాబ్ యాదవ్ హృదయపూ ర్వక కృతజ్ఞతలు తెలిపారు. బడేసాబ్ యాదవ్ ఎన్నికపై అయిజ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

## అన్నదాన సత్ర గదులను ప్రారంభించిన బీసీ సంక్షేమ వేదిక నాయకులు


**పలువురు బీసీ నాయకులకు ఘన సన్మానం .. మేమంటోల అందజేత**



**ఆర్మూర్, (సింగిడి) :** దేశంలోనే మరో కాశీ పుణ్యక్షేత్రం గా పేరుగాంచిన, అత్యంత ప్రసిద్ధిగాంచిన, అతి పురాతనమైన, అతి ప్రసిద్ధి గాంచిన శ్రీ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర పుణ్యక్షేత్రం ప్రాంతంలో శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు (కాపు) అన్నదాన సత్రం ఆధ్వర్యంలో నూతన గదుల ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ రాష్ట్ర వేదిక అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుస్సాపూర్ శంకర్, పరువులు పలువురు తెలంగాణ బిసి. ఎస్సీ ఎస్టీ మైనార్టీ పలు జిల్లాల నాయకులు ముఖ్య అతిథులుగా విచ్చేసి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి కి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేములవాడలో మున్నూరు కాపు సంఘం వారి ఆధ్వర్యంలో అన్నదాన సత్రం నూతన అదనంగా నిర్మించిన గదులను బిసి. ఎస్సీ ఎస్టీ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు వారి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం అన్నదాన సత్రం నూతన గదుల నిర్మాణంలో ప్రత్యేక సన్మాన సమావేశం నిర్వహించారు. ఈ సన్మాన సంక్షేమ వేదికలో తెలంగాణ బిసి. ఎస్సీ ఎస్సీ మైనార్టీ,రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ తోపాటు,ప్రధాన కార్యదర్శి బుస్సాపూర్ శంకర్, పలువురు బిసి ఎస్సి, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సాధికారత సంఘం నాయకులను పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, మెమొంటోల్లు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ సాధికారత రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, తెలంగాణ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ సాధికారత ప్రధాన కార్యదర్శి బుస్సాపూర్ శంకర్ లఅధ్యక్షతన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, ప్రధాన కార్యదర్శి బుస్సాపూర్ శంకర్ నూతన గదులను సందర్శించి, సత్రం ద్వారా భక్తులు, యాత్రికులకు అందిస్తున్న సేవలను తిలకించి నిర్వాహకు లను యజమానులను అభినందించారు. భవిష్యత్‌లో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగిస్తూ భక్తులకు అండగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులకు అన్నదాన సేవ చేయడం ఎంతో పుణ్య కార్యక్రమము అన్నారు. మున్నూరుకాపు సమాజ అభివృద్ధితో పాటు,అన్ని వర్గాల ప్రజలకు సేవలందించే కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లవేళలా అందిస్తూ కృషి చేస్తామని బిసి ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ సాధికారత రాష్ట్ర అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం మరింత సేవ చేసేందుకు అన్న సత్రం ద్వారా మరిన్ని గదులు నిర్మించి సేవ చేస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బిసి నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## వెల్దండ మండలంలో గుప్త నిధుల తవ్వకాలు ముగ్గురు అరెస్ట్ చేసిన పోలీసులు





**కల్వకుర్తి (సింగిడి) :**వెల్దండ,మండల కేంద్రము లో గుప్త నిధులు ఉన్నాయన్న అనుమానంతో అర్ధరాత్రి పూజలు నిర్వహించి జేసీబీతో తవ్వకాలు చేపట్టిన ఘటన వెల్దండ మండల పరిధిలోని రాచూరు తండా సమీపంలో చోటుచేసుకుంది. రాత్రి సుమారు 11 గంటల సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి జేసీబీ, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాచూరు తండా సమీపంలో కొంతమంది గుప్త నిధుల కోసం పూజలు నిర్వహిస్తూ జేసీబీతో గుంతలు తవ్వుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకోగా సుమారు 20 నుంచి 30 మంది గ్రామస్థులు కనిపించారు. ముగ్గురు వ్యక్తులు జేసీబీతో తవ్వకాలు చేస్తుండగా, పోలీసులను చూసి మరికొందరు అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. పోలీసులు అక్కడే ఉన్న గుత్తి సత్యనారాయణ (40), కేతావత్ శంకర్ (34), క్యాసారపు శ్రీశైలం (25)లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి టి జి 06బి 1171 నంబర్ గల ఎక్స్ కవేటర్, టి ఎస్ 07జి బి 8362 నంబర్ గల హోండా షైన్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ముగ్గురు వ్యక్తులతో పాటు పరారైన మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గుప్త నిధుల పేరుతో అక్రమంగా తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల మేధో వికాసానికి దోహదం

**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**
**వరంగల్, హైదరాబాదులో పలు పర్యాటక ప్రదేశాల సందర్శన**





**గద్వాల బ్యూరో (సింగిడి) :** ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల మేధో వికాసానికి నిర్వహించిన విజ్ఞాన, విహార యాత్రలు విజయవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రతి మండలం నుంచి పీఎం శ్రీ పాఠశాలలతో పాటు భవిత కేంద్రాలలో ఉండేటటువంటి 65 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 30 మంది ఐఈఆర్‌పీలు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, 11 మంది తల్లిదండ్రులతో ఈనెల 20, 21వ తేదీల్లో రెండు రోజులపాటు వరంగల్, హైదరాబాద్ విహార యాత్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించమన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ వారి రెండు బస్సులతో ప్రత్యేక అవసరాలు గల (చిల్డ్రన్స్ విత్ స్పెషల్ నీడ్) విద్యార్థుల కోసం నిర్వహించిన రెండు రోజుల యాత్రలో పలు దర్శనీయ స్థలాల్లో పర్యటించారన్నారు. హైదరాబాదులోని నెహ్రూ జువాలజికల్ పార్క్, సాలార్జంగ్ మ్యూజియం, లుంబినీ పార్క్ లను సందర్శించారు. అనంతరం వరంగల్ లోని భద్రకాళి ఆలయం, వెయ్యి స్తంభాల గుడి, వరంగల్ కోటలను సందర్శించి చారిత్రక, సాంస్కృతిక అంశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారన్నారు. నెహ్రూ జువాలజికల్ పార్క్‌లో వివిధ జంతువులు, పక్షుల గురించి తెలుసుకున్న విద్యార్థులు, సాలార్జంగ్ మ్యూజియంలో చారిత్రక వస్తువులు, కళాఖండాలను వీక్షించారనీ తెలి పారు. లుంబినీ పార్క్‌లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిం చినట్లు పేర్కొన్నారు. వరంగల్ పర్యటనలో కాకతీయుల చరిత్ర, శిల్పకళ, వాస్తు కట్టడాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం విద్యార్థులకు లభిం చిందన్నారు. ఈ పర్యటన ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో ప్రత్యక్ష అనుభవం ద్వారా అభ్యసనం, సామాజిక అవగాహన, ఆత్మవిశ్వాసం, స్వతంత్రత, చారిత్రక, సాంస్కృతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు అవకాశం కలిగిందన్నారు. తల్లిదండ్రులు, ఐఈఆర్‌పీలు, స్పెషల్ ఎడ్యుకేటర్స్ సహకారంతో విద్యార్థులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో పర్యటనను నిర్వహించామన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యా, సాంస్కృతిక, చరిత్రాత్మక, సామాజిక అనుభవాలను అందించడంలో ఇటువంటి విద్యా, విహారయాత్రలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. "ప్రత్యక్ష అనుభవమే ఉత్తమ అభ్యసనం -- ప్రతి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థికి సమాన అవకాశమే సమగ్ర విద్య లక్ష్యం" అనే సందేశంతో ఈ విద్యా విహారయాత్రను విజయవంతం చేశామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
24-8-2026

# నేరాల నియంత్రణలో మూడో నేత్రం ప్రధానం

## ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్




**వికారాబాద్ ప్రతినిధి, (సింగిడి):** గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ వినూత్న ఆలోచనతో అమలు చేస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ ను సందర్శించి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. నేరాల నియంత్రణ పై రాజీలేకుండా సమాలోచనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నే జిల్లా పరిధిలోని నవాబుపేట పోలీస్ స్టేషన్ ను ఇటీవల సందర్శించారు. రక్షణ నేత్రం కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 110 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని యావపూర్ గ్రామంలో 24, నవాబ్‌పేట్‌లో 16, గొల్లగూడలో 12, పులుమామిడి గ్రామంలో 14, కొజ్జావ నం పల్లిలో 16, ముబారక్‌పూర్‌లో 28 మొత్తం 110 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేశారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రధాన ప్రాంతాలు, రహదారులు, కూడళ్లలో జరుగుతున్న కార్యకలాపాలను పోలీస్ స్టేషన్ నుంచే నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమం ద్వారా జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో సీసీటీవీ నిఘా వ్యవస్థను మరింత విస్తరించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. సీసీటీవీ కెమెరాలు నేరాలను అరికట్టడంలోనే కాకుండా, నేరం జరిగిన అనంతరం నిందితులను గుర్తించడం, వారి కదలికలను పసిగట్టడం, నేర పరిశోధనలో కీలక ఆధారాలను సేకరించడంలో ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ద్వారా శాంతిభద్రతల పర్యవేక్షణ, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల కదలికల గుర్తింపు, రోడ్డు భద్రత, నేరాల నియంత్రణ, నేర పరిశోధన వంటి అంశాల్లో పోలీసులకు మరింత సహకారం అందుతుందని ఎస్పీ గారు తెలిపారు. ప్రజలు కూడా తమ గ్రామాల భద్రత కోసం సీసీటీవీ వ్యవస్థ ఏర్పాటులో భాగస్వాములు కావాలని, పోలీసులకు సహకరించాలని సూచించారు. అంతేకాకుండా సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక వైద్యశిభిరాల ఏర్పాటు, జిమ్ పునరుద్ధరణ ఏర్పాటు కార్యక్రమంతో పాటు నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును ప్రారంభించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, విధుల్లో నిత్యం ఒత్తిడితో పనిచేసే సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు క్రీడా సదుపాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది క్రీడల్లో పాల్గొని ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో సీసీటీవీ కెమెరాలు, ప్రహరీ గోడ, బ్యాడ్మింటన్ కోర్ట్ ఏర్పాటుకు కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని, స్థానిక ప్రజలను ఎస్పీ అభినందించారు. ప్రజల సహకారంతో సీసీటీవీ నిఘా వ్యవస్థను మరింత విస్తరించి సురక్షిత వికారాబాద్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిఎస్పి అంజయ్య, మోమిన్ పేట్ సిఐ వెంకట్, నవాబ్ పేట్ ఎస్ఐ గిరి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో మాలలకు తీవ్ర అన్యాయం..

**రోస్టర్ విధానం రద్దు చేయాలి**
**రేవంత్ రెడ్డి, చంద్రబాబు ప్రభుత్వాలకు గతే పడుతుంది**
**ఐక్యతతో ఉద్యమించి హక్కులు సాధించుకోవాలి**
**ఈ నెల 31న "చలో సెక్రటేరియట్"ను విజయవంతం చేయాలి: మాజీ మంత్రి సుద్దాల దేవయ్య**




**దుబ్బాక, (సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోం దని, వారి హక్కులను పరిరక్షించేందుకు ఐక్యంగా ఉద్యమించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి కాల్వ నరేష్ అధ్యక్షతన దుబ్బక్క పట్టణంలోని పోచమ్మ ఆలయం వద్ద "హలో మాల–చలో దుబ్బాక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం 2024 ఆగస్టు 1న జీవో 99 అమలు చేసి రోస్టర్ విధానాన్ని తీసుకువచ్చిందని, ఈ విధానం వల్ల మాలలకు ఉద్యోగ అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆరోపించారు. మాలలు ఐక్యతతో ఏకతాటిపైకి వచ్చి ఉద్యమిస్తే తమ హక్కులను సాధించుకోవచ్చని వారు అన్నారు. వర్గీకరణ పేరుతో మాలలకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ, మాలల జనాభా గణాంకాల్లో ఉన్న లోపాలను సరిచేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ 30 ఏళ్ల క్రితం చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్ర సహకార శాఖ మంత్రి పదవికి తాను రాజీనామా చేసినట్లు మాజీ మంత్రి సుద్దాల దేవయ్య తెలిపారు. ప్రతి వ్యక్తికి సమాన హక్కులు కల్పించిన మహనీయుడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ అని గుర్తు చేశారు. ప్రస్తుత తరంలో హక్కుల కోసం పోరాడకపోతే భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుందని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో మాలలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న నిర్వహించనున్న "చలో సెక్రటేరియట్" కార్యక్రమానికి మాలలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, ఏఎస్ శ్రీరాములు, దుబ్బాక అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కాల్వ లింగం, సాయన్న, భీమసేన, నల్లమల్ల మురళి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఏఎస్ సులోచన స్వామి, కౌన్సి లర్ తునికి సురేష్, కాల్వ రాజు, ఏఎస్ నాగభూషణం, దశరథం, బావాజీ శ్రీను, సురేందర్, కాల్వ బలరాం తదితరులతో పాటు మాల మహానాడు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపదలో అండగా నిలుస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

**పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం సహాయనిధి చెక్కుల మంజూరు**
**రూ.51 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన జెమినీ గౌడ్**



**కమాన్‌పూర్, (సింగిడి):** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారికి అవసరమైన సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేద ప్రజల పాలిట దైవంలా నిలుస్తున్నారని యువజన కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు జెమినీ గౌడ్ అన్నారు. కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన కూనారపు రాధ కుటుంబానికి మంజూరైన రూ. 51 వేల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును ఆదివారం జూలపల్లిలో జెమినీ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రులను ఆశ్రయించే పేదలకు మంత్రి శ్రీధర్‌బాబు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న వేలాది మంది ప్రజలకు వైద్య సహాయం అందించేందుకు కృషి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. గతంలో పేదల దరఖాస్తులు చెత్తకుప్పల్లో.. ఇప్పుడు వేగంగా పరిష్కారం గత ప్రభుత్వాల హయాంలో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ప్రజలు సమర్పించిన పత్రాలు నిర్లక్ష్యానికి గురై చెత్తాచెదారాల్లో పడిపోయిన పరిస్థితులు ఉండేవని జెమినీ గౌడ్ ఆరోపించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తున్నారని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించిన పత్రాలు సమర్పించిన వారికి, అర్హత మేరకు గడువులోపే చెక్కులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా రూ. 51 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందుకోవడంతో కూనారపు రాధ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఆపద సమయంలో తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు, జెమినీ గౌడ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

**ఇంద్రకరణ్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి**




**సంగారెడ్డి ప్రతినిధి,(సింగిడి):** కంది మండలం ఇంద్రకరణ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్ర మం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి నూతన గృహాన్ని ప్రారంభించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుం బానికి భద్రతతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుం బానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని, అదే విధంగా అర్హులైన ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు నిరంతరం కృషి చేస్తారని నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. నూతన గృహాన్ని ప్రారంభించిన సందర్భంగా కుటుంబ సభ్యులు డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, కంది మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొగులయ్య, మోతిలాల్ నాయక్, సర్పంచ్ శంకరి రాజు, ఉపసర్పంచ్ కొన్యాల లావణ్యరాజేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫోటో ఫీచర్...

# కన్ను"విందు చేస్తున్న టేకు వృక్షం

జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఒక అరుదైన దృశ్యం సందర్శకులను, రైతులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మార్కెట్ కార్యాలయం పక్కనే పలు రకాల చెట్లు ఉన్నప్పటికీ, అందులోని ఒక టేకు చెట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అది ఏమిటంటారా...మనిషి ముఖంలో కన్ను ముక్కు నోరు కనుబొమ్మలు ఏ విధంగా అయితే ఉంటాయో అలా ఈ చెట్టుకు కూడా అలాంటి ఆకృతి కనిపించడం చూపర్లను ఇట్టే ఆకర్షిస్తుంది. ఎత్తుగా, నాజూగ్గా పెరిగిన ఈ టేకు వృక్షం మార్కెట్‌కు వచ్చే రైతులకు, వ్యాపారులకు చల్లని నీడను అందిస్తోంది. 'నినాదం' దినపత్రిక ప్రతినిధి మార్కెట్ యార్డ్ విజిట్‌కు వెళ్లిన సమయంలో చెట్టుకున్న ఈ దృశ్యం కంటపడింది. ప్రకృతి దిద్దిన ఈ అందాన్ని తన కెమెరాలో బంధించారు.సుందరంగా కనిపిస్తున్న ఈ దృశ్యాన్ని చూసిన పలువురు స్థానికులు, రైతులు "ఔరా!" అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కాంక్రీట్ వాతావరణంలోనూ పచ్చదనంతో కళకళలాడుతున్న ఈ వృక్షం, మార్కెట్ యార్డ్‌కే ఒక ప్రత్యేక శోభను తెచ్చిపెట్టింది.



– నారాయణపేట ప్రతినిధి, (సింగిడి)

# "భోనమెత్తిన బాచుపల్లి"




**అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే**
**అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలి: బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, (సింగిడి):** శ్రావణ మాస భోనాల వేడుకల సందర్భంగా శనివారం బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో నిర్వహించిన బోనాల వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ తల్లుల దీవెనలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ శంభీ పూర్ క్రిష్ణ, మాజీ కార్పొరేటర్లు కాసాని సుధాకర్, ఆగం రాజు, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీం, చంద్రగిరి సతీష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వార్డు అభివృద్ధి లక్ష్యం

**ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు.. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు**
**వాగ్దానాన్ని నిలబెట్టుకున్న కౌన్సిలర్ తెలుగూరి అలివేలు చంటిబాబు**



**సూర్యాపేట ప్రతినిధి (సింగిడి):** వార్డు అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని 22వ వార్డు కౌన్సిలర్ ఎలుగూరి అలివేలు చంటిబాబు అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భా గంగా వార్డు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆదివారం జీవ్వి చెట్టు బంగారు మైసమ్మ పండు గను వార్డు ప్రజలతో కలిసి నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి నిరుపే దకు ఇందిరమ్మ ఇల్లు అందాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని అందులో భాగంగా వార్డులో ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేశామని అన్నారు. ప్రజా ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని వార్డు ప్రజలందరికీ అందేలా చూస్తున్నామని అభివృద్ధి విషయంలో రాజీ పడబోమని అన్నారు.

**కౌన్సిలర్ కు కృతజ్ఞతలు తెలిపిన వార్డు ప్రజలు**

జివ్వి చెట్టు బంగారు మైసమ్మ గుడికి రేకుల షెడ్డు నిర్మించి ఇచ్చిన మాట ప్రకారం పండుగ నిర్వహించడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి






**జడ్చర్ల, (సింగిడి)::** జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి వివిధ ప్రారంభోత్సవ కార్యక్రమాలు, వివాహ వేడుకలు, జన్మదిన వేడుకలు, ఇతర శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కుటుంబాలను, కార్యక్రమాల నిర్వాహకులను కలిసి అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి డా. శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ప్రత్యేకంగా పాల్గొని ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. శ్రీధర్ రెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరిన్ని విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం డా. సి. లక్ష్మారెడ్డి జడ్చర్ల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వివాహాలు, ఇతర శుభకార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూతన వధూవరులను, వారి కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుదీర్ఘమైన వైవాహిక జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, మిత్రులు, అభిమానులు డా. సి. లక్ష్మారెడ్డికి ఘన స్వాగతం పలికారు. వివిధ కార్యక్రమాల్లో ఆయన వెంట ఉన్న నాయకులు, కార్యకర్తలు కూడా ఆయా కుటుంబాలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి వివిధ సామాజిక, శుభకార్యక్రమాల్లో పాల్గొనడంతో స్థానికంగా సందడి నెలకొంది.

# మిలాద్–ఉన్–నబీ ర్యాలీ శాంతియుతంగా నిర్వహించాలి

## ఎస్ఐ కురుమూర్తి



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తిలో పవిత్ర మిలాద్–ఉన్–నబి సందర్భంగా ఈ నెల 26న నిర్వ హించనున్న జులూస్‌ను శాంతియు త, ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని నిర్వాహకులు, ప్రజలకు సూచిం చారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ఆయన అందించిన శాంతి సందేశాన్ని చాటిచెప్పేలా ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని కోరారు. నిబంధ నలు పాటించాలి. జులూస్ నిర్ణీత సమయానికే ప్రారంభమై, నిర్దేశిత గడువులోగా ముగించాలని సూచించారు. సుప్రీంకోర్టు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీజేలు, అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. వేడు కను ఆధ్యాత్మిక, ప్రశాంత వాతావరణంలో నిర్వ హించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపడం, బైక్‌లపై ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి ర్యాష్ డ్రైవింగ్ చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. నిర్ణీత తేదీకి ముందు ఎలాంటి బైక్ ర్యాలీలకు అనుమతి ఉం డదని స్పష్టం చేశారు. విద్యుత్ అలంకరణల వద్ద అప్రమత్తతవర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ దీపాలంకరణల వద్ద భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. జెండాలు విద్యుత్ తీగలకు తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్నదాన కేంద్రాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుం డా నిర్వాహ కులు, వలంటీర్లు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని కోరారు.

**సోషల్ మీడియాపై నిఘా**


సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, విద్వేషపూ రిత వ్యాఖ్యలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుం దని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపైనా నిరంతరం నిఘా కొనసాగుతుం దని తెలిపారు. మిలాద్–ఉన్–నబీ జులూస్‌ను శాంతి, సోదరభా వం, మత సామరస్యానికి ప్రతీకగా నిలిపేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, ఎ ఎస్ ఐ రాజశేఖర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కాజాను పరామర్శించిన మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు..



**దమ్మపేట, (సింగిడి):** అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కాజాను పలువురు సీనియర్ నాయకులు ఆదివారం పరామర్శించారు. మండలపరిధిలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన కాజా గత 20 ఏళ్లుగా ఏలూరులోనే స్థిరపడి నివాసం ఉంటున్నారు. ఇటీవల ఆయన ఆరోగ్య కారణాల రీత్యా వైద్యం చేయించుకుని, ప్రస్తుతం తన నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరావు, పామాయిల్ రైతుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కేవీ సత్యనారాయణ, సీనియర్ నాయకులు దొడ్డకుల రాజేశ్వరరావు తదితరులు ఆదివారం కాజా నివాసానికి వెళ్లారు. ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటారని వారు కాజ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి




**కల్వకుర్తి ఆగస్టు 23 (నినాదం):** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్కి సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అమ్మవా రిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతి ష్టాపన మహోత్సవానికి ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, గ్రామం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజల ఐక్యత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్,ఆలయ నిర్మాణ దాతలు గోకికార్ రమేష్ లతో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ యాట గీత నరసింహ,పార్టీ మండల అంధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి,కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మాజీ అధ్యకులు డోకూరి ప్రభాకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ లు వెంకట్రామ్ రెడ్డి,నరసింహ,మాజీ ఎంపీటీసీ గణేష్ గుప్తా,లతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు, భక్తులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
24-8-2026

## ఘనంగా పి.వి జయంతి వేడుకలు



**భీమదేవరపల్లి, (సింగిడి):** భారతదేశ మాజీ ప్రధానమంత్రి, పీవీ నరసింహా రావు'భారతరత్న' పి.వి. నరసింహారావు 105వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమ కొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర లో ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి, దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి ఖాజీపేట ఎసిపి ప్రశాంత్ రెడ్డి పీవీ కుటుంబ సభ్యులు పీవీ మదన్ మోహన్ హాజరై నివాళులర్పించారు. అలాగే సీఐ పులి రమేష్, ఎస్ఐ దివ్యతో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. రాజకీయ, ప్రజాప్రతినిధులలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి. రాజిరెడ్డి, ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల శ్రావంతి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెంపల్లి ఐలయ్య, జిల్లా కార్యదర్శి ఆదరి రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిదురాల స్వరూప, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, "తెలుగు జాతి గర్వకారణం, భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అయిన భారతరత్న పి.వి. నరసింహారావు ఆశయాలు చిరస్మరణీయం. ఆయన చూపిన బాటలో నడవడం మనందరి బాధ్యత" అని కొనియాడారు. దేశ రాజకీయ, ఆర్థిక రంగాల్లో పి.వి. నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని నాయకులు పేర్కొన్నారు.

## –పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

### –అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి)** పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్ కోరారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సందర్శించి 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో వ్యాధి పూర్తిగా నిర్మూలించాలంటే ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ఎంతో ముఖ్యమని అన్నారు. పోలియో చుక్కలు సురక్షితమైనవని, పిల్లలభవిష్యత్తును ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఇవి కీలక పాత్ర పోషిస్తాయనితెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏ చిన్నారి కూడా పోలియో చుక్కలువేయించకుండా మిగిలిపోకుండా ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలుచేపట్టాలని సూచించారు. బూత్‌లకు రాలేని చిన్నారులను గుర్తించి ఇంటింటికీవెళ్లి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులు సమీప పోలియోకేంద్రానికి తమ చిన్నారులను తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కోరారు. పోలియో రహిత వనపర్తి జిల్లా లక్ష్య సాధనకు ప్రజలందరూ ఆరోగ్య శాఖకుసహకరించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ఇతర వైద్యాధికారులు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తారంలో పల్స్ పోలియో ప్రారంబించిన ఇంచార్జీ సర్పంచ్




**భీమదేవరపలి (సింగిడి)** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 0--5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. "రెండు చుక్కలు -- పోలియోకు పూర్తి రక్షణ" అనే నినాదంతో ప్రతి చిన్నారిని సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఏఎన్ఎం వనజ, అంగన్వాడీ టీచర్ కవిత, ఆశా కార్యకర్త రేణికుంట్ల భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## –మాజీ మున్సిపల్ చైర్మన్ సతీమణి మృతిపట్ల మాజీ మంత్రి సంతాపం



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి)**వనపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్‌డాక్టర్ అశ్విని దామోదర్ సతీమణి అశ్విని జయమ్మ మృతి పట్ల ఆదివారం మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.
విదేశీ పర్యటనలో ఉన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి కుమారుడు డాక్టర్ అశ్విని అమరేశ్వర్ ను ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యంగాఉండాలని కోరారు. కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని ఆయన ఆకాంక్షించారు.

## పల్స్ పోలియో ప్రారంభించిన సర్పంచ్ బోయిన వేణు.



**పాలేరు (సింగిడి))** పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమనికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ బోయిన వేణు హాజరై ప్రారంభిం చారు... 5 సంవత్స రాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. కార్యక్రమంలో వార్డు నెంబర్లు కాలింగి వీరబాబు లక్క నాగరాజు మేకలబ్రహ్మం తీగ హనుమంతు దేగల సౌజన్య వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టారు.

## పల్స్ పోలియో లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (సింగిడి)**కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులెవరూ తమ చిన్నారులను ఈ కార్యక్రమానికి దూరం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, లేదా పోలియో బూత్‌లకు తీసుక వచ్చి తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, కమిషనర్ పర్వతాలు, కౌన్సిలర్స్ గేరుగంటి లక్ష్మి నారాయణ, కో ఆప్షన్ మెంబర్ ముబాషీర్ అలీ, ఏఈ వేణు ప్రసాద్, ఎమ్మార్వో బిందు, డి.ఎం. హెచ్.ఓ వెంకటట్, చలపతి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి: కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (సింగిడి)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కామారెడ్డిలోని 14వ వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత, 5 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయాలని ఆదివారం కోరారు. ఎన్జీవోస్ కాలనీ పరిధిలోని అభ్యాస స్కూల్, 16 ఫోర్వన్ స్ట్రీట్ లో జరిగిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, రెండు చుక్కలు భవిష్యత్తులో అంగవైకల్యాన్ని నివారిస్తాయని ఆమె పిలుపునిచ్చారు.

## లక్ష్మి నరసింహ స్వామి కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక....

### నూతన అధ్యక్షులు గా జె. సుధాకర్... ప్రధాన కార్యదర్శిగా అఖిల్

**మల్కాజిగిరి, (సింగిడి)** కాలనీ అభివృద్ధితో పాటు, మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని నూతన అధ్యక్షులు జె సుధాకర్ అన్నారు. ఆదివారం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ అసోసియేషన్ కాలనీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా జె సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా, ట్రెజరర్ గా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బండ కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ చారి, సహాయ కార్యదర్శులుగా మునీర్, మల్లేష్, రవి నాయక్, అడ్వైజర్లుగా బరత్ సాగర్, రాజయ్య, కనకయ్య, పరమేష్, కమిటీ సభ్యులుగా సురేష్ సాగర్, కూర అరుణ్, మాదేశ్, సమల కృష్ణ, రాజేష్, ప్రసాద్, శ్రవణ్, దామోదర్, శ్రీధర్, రాంచందర్, సంతోష్, శ్రీనివాసులు, హరి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే ద్యాప గోపాల్ రెడ్డి సేవలు మరువలేనివి

### శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**కల్వకుర్తి (సింగిడి)** కల్వకుర్తి మండల ప్రజా పరిషత్ ఆవరణలో నిర్వహించిన మాజీ శాసన సభ్యులు, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు, మాజీ డీసీసీ చైర్మన్ స్వర్గీయ గుడిగానిపల్లి ధ్యాప గోపాల్ రెడ్డి శత జయంతి ఉత్సవాలకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్కసి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ గోపాల్ రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం ఆయన ప్రజా సేవలు, రాజకీయ ప్రస్థానం, కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి చేసిన విశేష కృషిని స్మరించు కుంటూ, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపో యిన గొప్ప నాయకుడిగా కొనియాడారు, వారి ఆశయాలు, విలువలు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు, అలాగే శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వందేమాతరం ఫౌండేషన్ మరియు గోపాల్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్ పోటీలకు కూడా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు, పోటీల్లో పాల్గొన్న యువతను అభినందిస్తూ, పాల్గొన్న వారం దరికీ అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాండ్ర సాయిరెడ్డి , స్వర్గీయ ద్యాప గోపాల్ రెడ్డి ట్రస్ట్ సభ్యులు గోలి ప్రభాకర్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అంధ్యక్షులు నర్సిరెడ్డి, శృతిలయ కల్చరర్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి, కార్యక్రమ నిర్వాహక సభ్యులు సందీప్ తో పాటు ప్రశాంత్ రెడ్డి అభిమానులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## విజయవంతంగా పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం

**భిక్కనూర్, (సింగిడి):** మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో నివారణ కోసం పోలియో చుక్కలు వేయించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియు ప్రత్యేక బూత్‌లలో ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు. కార్యక్రమాన్ని వైద్యాధికారులు పర్యవేక్షిస్తూ, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు నాయకులు, లింబాద్రి, దయాకర్ రెడ్డి, సిద్ధారెడ్డి, గజ్జె వేణు, మమత వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి : చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్



**పెబ్బేరు, (సింగిడి)** చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పెబ్బేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. గతంలో పోలియో మహమ్మారి కారణంగా అనేక మంది చిన్నారులు అంగవైకల్యానికి గురయ్యారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగలకుండా వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పని చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. మొదటి రోజు కేంద్రాలకు రాలేని చిన్నారుల కోసం సోమవారం, మంగళవారం ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు పర్వీన్ షకీల్, సౌజన్య దిలీప్ రెడ్డి, హరి శంకర్ నాయుడు, మన్యం, వైద్యాధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతంగా పల్స్ పోలియో

**భీమదేవరపల్లి, (సింగిడి)** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పీహెచ్‌సీ వంగర మరియు ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో బూత్ డే విజయవంతంగా నిర్వహించారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ఆరోగ్య శాఖ కీలక అడుగు వేసింది. పీహెచ్‌సీ వంగర పరిధిలో 23 పల్స్ పోలియో బూత్‌లు, ఒక మొబైల్ టీమ్ ద్వారా మొత్తం 2,315 మంది లక్ష్య చిన్నారుల్లో 2,180 మందికి పోలియో చుక్కలు వేశారు. అలాగే ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1,885 మంది లక్ష్య చిన్నారుల్లో 1,875 మందికి పోలియో డ్రాప్స్ అందించారు. ఈ కార్యక్రమంలో డా. రహ్మాన్, డా. దినేష్, పీహెచ్ఎన్ వాణి, హెచ్ఈఓ మోహన్, గ్రామ సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రహ్మాన్ మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. బూత్‌లకు రాలేకపోయిన చిన్నారుల కోసం వచ్చే రెండు రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి పోలియో చుక్కలు వేస్తామని, ఏ ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు ఆరోగ్య శాఖకు సహకరించి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆరోగ్య శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అధికారులు పునరుద్ఘాటించారు.



## పోలియో చుక్కలు విజయవంతం



**వెల్దుర్తి మాసాయిపేట, (సింగిడి)** మాసాయిపేట మండలం కేంద్రంలోని మాసాయి పేట గ్రామంలో గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి తో కలిసి పోలియో చుక్క పంపిణీ కార్యక్రమం చేశారు మండల కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు అదేవిధంగా స్టేషన్ మాసాయి పేట గ్రామ సర్పంచ్ స్టేషన్ శ్రీను ఆధ్వర్యంలో పోలియో చుక్కలు చిన్న పిల్లలకు కార్యక్రమం చేశారు అనంతరం కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి తో మాజీ ఎంపిటిసి, పాలకవర్గం గ్రామ ప్రజలు పాల్గొన్నారు అనంతరం చిన్న పిల్లలు ఆరోగ్యం బాగుండాలంటే పోలియో చుక్కలు వేయించాలని సూచనలు తెలిపారు .

## పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దాం

### మునిసిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్



**అమరచింత, (సింగిడి)::** పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అమరచింత మున్సిపల్ చైర్పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ పిలుపునిచ్చారు. వలస పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమరచింత తహసిల్దార్ కార్యాలయం వద్ద
ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు మున్సిపల్ చైర్ పర్సన్ పోలియో చుక్కలు వేశారు. అనంతరం చైర్పర్సన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు కృషి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జింక రవి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, వైద్య బృందం పాల్గొన్నారు.

### తాగునీటి గోస తీర్చిన పిఎసిఎస్ చైర్మన్

**అమరచింత, (సింగిడి):**
తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్నారురేచింతల సింగిల్విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి. వీరరాఘవపురంలోతాగునీటి గోస తీరుస్తానని ఇచ్చిన హామీ ప్రకారం ఆదివారం గ్రామంలోనిసుంకులమ్మ దేవాలయం వద్ద లక్ష రూపాయల వ్యయంతో తాగునీటి బోరును వేయించారు. బోరులో నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. తమ గ్రామానికి తాగునీటికి దోశ తీర్చినపిఎస్సి చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డికి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామ సర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పిల్లలకు పోలియో చుక్కలు వేద్దాం.. వారి ఆరోగ్యాన్ని కాపాడుదాం

### –మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):**పిల్లలకు పోలియో చుక్కలు వేయించివారి ఆరోగ్యాన్ని కాపాడుదామని సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఆదివారం పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో చుక్కలు వేయడం వల్ల వారి ఆరోగ్యాన్నిరక్షించడంతోపాటు పోలియో రహిత గ్రామంగా తీర్చిదిద్దిన వారం అవుతామనిచెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితోపాటు గ్రామస్తులు రాములు, రామిరెడ్డి, ప్రతాపరెడ్డి, బాలరాజు, కొములయ్య, శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, శేషయ్య యాదవ్, బుచ్చయ్య, రాఘవేంద్ర, శివకుమార్, ఉషయ్య తదితరులుపాల్గొన్నారు



## పెబ్బేరులో ఆర్ఎస్ఎస్ హిందూ సామ్రాజ్య దినోత్సవం

### యువ సాంఘిక్ కార్యక్రమం



**పెబ్బేరు, (సింగిడి):**
వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం, యువ సాంఘిక్ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్వయంసేవకులు, యువకులు, స్థానిక ప్రముఖులు పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో సంఘ్ సంప్రదాయ పద్ధతిలో స్వయంసేవకులు శారీరక విన్యాసాలు, దండ ప్రదర్శనలు, వ్యాయామ విన్యాసాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. యువతలో క్రమశిక్షణ, సేవా భావం, దేశభక్తిని పెంపొందించే విధంగా కార్యక్రమం సాగింది. అనంతరం నిర్వహించిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య దినోత్సవం చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ అభ్యున్నతి కోసం యువత సేవా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, జాతీయ చైతన్యం, సామాజిక బాధ్యత పెంపొందించడంలో యువత ముందుండాలని వక్తలు సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా, మండల స్థాయి బాధ్యులు, స్వయంసేవకులు, యువకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం శాంతియుత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.



singidinews@gmail.com



# భర్త చనిపోతే బొట్టు, గాజులు తీసేయాలా?

## అనసూయ సూటి ప్రశ్న

నటి అనసూయ సామాజిక మాధ్యమాల వేదికగా భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి మరణానంతరం తన తల్లి జీవితంలో వచ్చిన మార్పులను చూసి తాను మూడేళ్లుగా మథనపడుతున్నట్లు చెప్పారు. భర్త చనిపోతే మహిళలు బొట్టు, గాజులు తీసేయాలనే ఆచారంపై ఆమె పలు ప్రశ్నలు అడిగారు. "మూడేళ్లుగా ఒక ప్రశ్న నన్ను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మా నాన్న మూడేళ్ల క్రితం చనిపోయారు. అప్పటినుంచి మా జీవితాల్లో చాలా మార్పులొచ్చాయి. మా అమ్మ ముస్తాబైతే చాలా అందంగా ఉంటుంది. చక్కగా బొట్టు, కాటుక, రంగురంగుల గాజులు, గజ్జెలు పెట్టుకుంటే చూడముచ్చటగా ఉంటుంది. కానీ, నాన్న చనిపోయాక సమాజంలోని మాటల వల్ల ఆమె వాటన్నింటికీ దూరమైంది. ఆ పరిస్థితులు కష్టంగా అనిపించాయి. ముఖ్యంగా ఆడపిల్లలు నా బాధను అర్థం చేసుకోగలరు. నన్ను వెంటాడుతున్న ప్రశ్న ఒక్కటే. ఆడపిల్లలకు బొట్టు, కాటుక, గాజులు, గోరింటాకు వంటివి పెళ్లికి ముందే వాళ్ల అమ్మ, అమ్మమ్మలు పరిచయం చేస్తారు. అలాంటప్పుడు వీటికి భర్త జీవితంతో ఎందుకు ముడి పెడుతున్నారు?"

ఆమె తల్లిదండ్రులను చూస్తే జాలేస్తోంది: కంగనా

"నా దృష్టిలో చెప్పాలంటే.. ఈ అలంకరణను పరిచయం చేసిన అమ్మమ్మ చనిపోయినప్పుడు కదా వాటిని వదులుకోవాలి. బొట్టు, గాజులు వేసుకోవడం అనేది పూర్తిగా వాళ్ల వ్యక్తిగత ఇష్టం కదా? ఏవైనా పూజలు, శుభకార్యాలు జరిగినప్పుడు కూడా కొన్ని బలవంతపు రూల్స్ నాకింకా కనిపిస్తూనే ఉన్నాయి. అసలు ఇవన్నీ ఎక్కడ రాసి ఉన్నాయి? నేను ఎవరినీ ఉద్దేశించి, ఎవరికీ వ్యతిరేకంగా ఈ మాటలు అనడం లేదు. నాలో మెదిలిన ఒక సందేహాన్ని మాత్రమే మీ అందరితో పంచుకుంటున్నాను" అని అనసూయ తన మనసులోని భావాలను వ్యక్తపరిచారు.

## మానవ సంబంధాలను చాటిన 'పళ్ళ బురుసు': నారాయణ

వృద్ధాప్యం, ఒంటరితనం, మానవ సంబంధాల విలువను ఆలోచింపజేసే విధంగా రూపొందించిన 'పళ్ళ బురుసు' చిత్రం అభినందనీయమని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె. నారాయణ తెలిపారు. ఇలాంటి ప్రయోజనాత్మక, సామాజిక స్పృహ కలిగించే చిత్రాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఆయన కోరారు. ప్రముఖ సినీ నిర్మాత అక్కినేని నాగార్జునకు చెందిన అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'పళ్ళ బురుసు' చిత్రంలో వృద్ధుల సహజమైన కోర్కెలు, ఒంటరితనాన్ని భరించడం, మిత్రుల ఆత్మీయ కలయిక కలిగించే ఆనందం వంటి అంశాలను చక్కగా చూపించారని నారాయణ పేర్కొన్నారు. కార్ల్ మార్క్స్ చెప్పిన 'సకల మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలే' అనే భావన సైతం సినిమాలో ఒక కోణంలో ప్రతిబింబిస్తుందని తెలిపారు.

చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఈ నెల 22న చిత్ర దర్శకుడు, కథా రచయిత ఉదయ్ చౌహాన్, సహనిర్మాత అధిప్ అయ్యర్ తదితర అన్నపూర్ణ స్టూడియోస్ బృందం 'పళ్ళ బురుసు' చిత్రాన్ని ప్రదర్శించింది. వృద్ధాశ్రమంలోని సభ్యులు చిత్రాన్ని ఆసక్తిగా వీక్షించి, సినిమాలోని పాత్రలు, పరిస్థితులను తమ జీవితాలతో అన్వయించుకుని ఆనందించారని నారాయణ తెలిపారు. వృద్ధాప్యంలో స్నేహం, అనుబంధం, ఆత్మీయత ఎంత ముఖ్యమో ఈ చిత్రం గుర్తుచేసిందని పేర్కొన్నారు. ఇలాంటి సినిమాలు వినోదాన్ని అందించడంతోపాటు వృద్ధుల సమస్యలు, ఒంటరితనం, మానవ సంబంధాల విలువపై సమాజంలో చర్చకు దారితీస్తాయని తెలిపారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విలాసవంతంగా సినిమాలు నిర్మించి, అధిక టికెట్ ధరల ద్వారా ప్రజలపై భారం మోపే చిత్రాలకు ప్రభుత్వ సహాయం అందించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజలకు వినోదంతోపాటు ఆలోచన, ఆనందం, సామాజిక చైతన్యం కలిగించే చిత్రాలను ప్రోత్సహించడమే ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

### నటనను ఒక వరంగా భావిస్తాను..

# ఆ ఇష్టమే నన్ను నడిపిస్తోంది

## రాశీ ఖన్నా

గ్లామరస్ నటి రాశీ ఖన్నా, భారతీయ చిత్ర



పరిశ్రమలోకి అడుగుపెట్టి విజయవంతంగా 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. 2013లో బాలీవుడ్ చిత్రం 'మద్రాస్ కేఫ్' సినిమాతో రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఈ అందాల భామ, ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోకుండా వరుస ఆఫర్లతో దూసుకెళ్లారు. కేవలం ఒకే భాషకు పరిమితం కాకుండా తెలుగు, తమిళం, హిందీ, మలయాళం సినీ పరిశ్రమల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును, పాన్-ఇండియా ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఈ విషయంపై రాశీ ఖన్నా స్పందిస్తూ చేసిన వ్యాఖ్యలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. నటనను గొప్ప వరంగా భావించడం వల్లనే ఈ 13 సంవత్సరాల సుదీర్ఘ సమయం ఎంతో వేగంగా గడిచిపోయిందని ఆమె పేర్కొన్నారు. నటనపై ఉన్న ఇష్టమే తనను నిరంతరం నడిపిస్తోందని తెలిపారు.

తొలి చిత్రం 'మద్రాస్ కేఫ్'ను గుర్తు చేసుకుంటే తాను నటనను కెరీర్‌గా ఎందుకు ఎంచుకున్నానో మళ్లీ స్పష్టంగా అర్థమవుతుందని, తనకు నచ్చిన కథలలో భాగమయ్యే అవకాశం దక్కడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ఈ ప్రయాణంలో తనకు మద్దతుగా నిలిచి ప్రోత్సహించిన ప్రతీ దర్శకుడికి, నిర్మాతకు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. రాశీ ఖన్నా సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం దర్శకులు రాజ్ అండ్ డీకే తెరకెక్కిస్తున్న 'ఫర్జీ' సీజన్ 2 సిరీస్‌లో ఆర్బీఐ ఆఫీసర్ మేఘా వ్యాస్ పాత్రలో ఆమె మళ్లీ కనిపించబోతున్నారు. బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలసి నటించిన ఈ సిరీస్‌పై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. దీంతో పాటు సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న 'ధర్మన్' అనే తమిళ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ సరసన అనీస్ బాజ్మీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న కామెడీ డ్రామాలోనూ మెరిసేందుకు సిద్ధమవుతున్నారు.

సినిమా సింగిడి
Cinma Singidi

సోమవారం
24-8-2026



### ఆమె తల్లిదండ్రులను

# చూస్తే జాలేస్తోంది

## కంగనా

బాలీవుడ్ నటీమణులు కంగనా రనౌత్ , తాప్సీ మధ్య మాటల యుద్ధం మళ్లీ మొదలైంది. గతంలో వీరి మధ్య జరిగిన వివాదంపై ఇటీవల తాప్సీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడగా.. దానికి కంగనా సోషల్ మీడియా వేదికగా ఘాటుగా బదులిచ్చారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ.. కంగనాతో ఉన్న విభేదాలపై స్పందించారు. "వివాదం మొదలైనప్పుడు గానీ, ఇప్పటివరకు గానీ నేను కంగనాను ఎప్పుడూ వ్యక్తిగతంగా కలవలేదు. ఆమెపై నా అభిప్రాయం అనేది నా పెంపకం, నా మాట్లాడే తీరు, నా ఆలోచనా విధానాన్ని తెలియజేస్తుంది. ఆమె విధానం ఆమెది. ఎవరు ఎక్కడి నుంచి వచ్చారో తెలుసుకోవడానికి ఇదే నిదర్శనం" అని తాప్సీ వ్యాఖ్యానించారు.

గొప్ప సినిమాటిక్ అనుభూతిని అందించే సినిమా 'టాక్సిక్': యశ్

తాప్సీ వ్యాఖ్యలు బయటకు రాగానే కంగనా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో తీవ్రంగా స్పందించారు. "ఓ 'చౌకబారు కాపీ' (సస్తీ కాపీ) తన బి-గ్రేడ్ సినిమా ప్రమోషన్ల కోసం బయటకు వచ్చింది. ఎప్పటిలాగే మీడియా హెడ్‌లైన్స్‌లో ఉండటానికి నా పేరు వాడుకుంటోంది. ఈ రోజు నా పెంపకం, నా తల్లిదండ్రుల గురించి మాట్లాడి హద్దులు దాటింది. ఏ వాదనలోనూ నేను ఇతరుల తల్లిదండ్రుల జోలికి వెళ్లను. కానీ, మా తల్లిదండ్రుల్లా ఒక నిజమైన బిడ్డకు ఎందుకు జన్మనివ్వలేకపోయారో.. ఆమె తల్లిదండ్రులనే అడగాలనిపిస్తోంది. ఇలాంటి చౌకబారు కాపీని కన్నందుకు వాళ్లని చూస్తే జాలేస్తోంది" అంటూ కంగనా విరుచుకుపడ్డారు. 2019లో 'జడ్జిమెంటల్ హై క్యా' సినిమా సమయంలో కంగనా సోదరి రంగోలి.. తాప్సీని ఉద్దేశించి మొదటిసారి 'సస్తీ కాపీ' (చౌకబారు కాపీ) అని సంబోధించారు. 2020లో నెపోటిజం చర్చల సమయంలో కంగనా.. తాప్సీ, స్వరా భాస్కర్‌లను 'బి-గ్రేడ్ నటీమణులు' అని పేర్కొనడంతో వీరి మధ్య వివాదం మరింత రాజుకుంది. ఇదే ఇంటర్వ్యూలో తాప్సీ రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనపై స్పష్టత ఇచ్చారు. "నేను చాలా నిజాయితీగా, సున్నితంగా ఉంటాను. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదు. ఇంకా కొన్ని సినిమాలు చేయాలనుంది. ఒక బాధ్యతాయుతమైన పౌరురాలిగా నా అభిప్రాయాలను చెబుతాను తప్ప.. రాజకీయాల్లోకి రాను" అని స్పష్టం చేశారు. తాప్సీ నటించిన ప్రతీకార డ్రామా 'గాంధారి' సెప్టెంబర్ 3న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737